




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 60 | మంగళవారం | 19-08-2025 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00




## 2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు

- కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు
- కలెక్టర్లు, అధికారులకు మంత్రి తుమ్మల అదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

యూరియాకు సంబంధించి రైతులు ఇబ్బందులు పడకుండా పట్టిష చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులనుఅదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత యూరియా పరిస్థితులపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయింపుల ప్రకారం రాష్ట్రానికి యూరియాను సరఫరా తరువాయి 2లో



## జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుంచి 'రెడ్ ఫ్లాగ్ మార్చ్'

● 20-22 వరకు సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు ● మహాసభల ప్రాంతానికి పొట్లూరి నాగేశ్వర్‌రావు నగర్‌గా నామకరణం ● సమావేశ హాల్‌కు ఎన్.బాలమల్లేశ్, భోజనశాలకు రొయ్యల కృష్ణమూర్తి, కె.సహాదేవ్‌ల పేర్లు ● మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, గాజుల రామారంలోని మహారాజ గార్డెన్స్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు చెప్పారు. రాష్ట్ర మహాసభలకు 20వ తేదీ ఉదయం 11గంటలకు ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్, ఇటి.నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి. సాయిల్ గౌడ్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి, ఇ.ఉమామహేశ్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, కౌన్సిల్ సభ్యులు దామోదర్‌రెడ్డితో కలిసి కూనంనేని సాంబశివరావు మహాసభల వివరాలను వెల్లడించారు. ఎంతో ఘనమైన వందేళ్ల చరిత్ర ఉన్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలలో 743 ప్రతినిధులతో పాటు ప్రత్యేక ఆహ్వానితులు మొత్తం 1000 మంది పాల్గొననున్నారని తెలిపారు. మహాసభల ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి మహాసభల వేదికైన మహారాజ గార్డెన్స్ వరకు 'రెడ్ ఫ్లాగ్ మార్చ్' జరుగుతుందన్నారు. ప్రదర్శన అనంతరం ఉదయం 10 గంటలకు మహాసభల ప్రారంగణంలో సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప రెడ్డి అరుణ తరువాయి 2లో

## బిసి రిజర్వేషన్లకు ప్రధాని మోదీ, కిషన్‌రెడ్డే అడ్డు



● ముస్లింలను బిసి జాబితా నుంచి తొలగించాలనడం సరికాదు ● మహారాష్ట్ర, యుపి, గుజరాత్‌లలో దూదేకుల, నూర్ బాషా వర్గాలు బిసి జాబితాలో ఉన్నా తొలగించరేం? ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపాటు ● ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన ● ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ పోరాటంలో పాల్గొంటామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

బిసి రిజర్వేషన్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలే అడ్డు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ముస్లింలను బిసిల నుంచి తొలగించాలనే బిజెపి నాయకుల డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. మహారాష్ట్ర, యుపి, గుజరాత్‌లలో దూదేకుల, నూర్ బాషా వర్గాల వారు బిసిల జాబితాలోనే ఉన్నారని, మరి వారిని ఎందుకు తొలగించడం లేదని ఆయన ప్రశ్నించారు. సచివాలయం సమీపంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటుకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్‌లు హాజరయ్యారు. అనంతరం రవీంద్రభారతీలో పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చినప్పుడు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తామని, ఇందుకోసం కులగణన తరువాయి 2లో



## విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృతి

● కృష్ణాష్టమి వేడుకల్లో రథాన్ని లాగుతుండగా తీవ్ర విషాదం ● హైదరాబాద్ రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో దుర్ఘటన ● మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి

మేడ్చల్ జిల్లా రామంతాపూర్‌లో ఆదివారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా రామంతాపూర్‌లోని గోఖలేనగర్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృతి చెందారు. సంఘటనా స్థలంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స తరువాయి 2లో


## బిజెపి ప్రతినిధిలా సిఇసి

- ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమాధానం ఇవ్వడంలో విఫలం
- సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రతిపక్షాలు ధ్వజం



**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బిజెపి ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), ఓటర్ల జాబితాలో అక్రమాలకు సంబంధించిన అంశాలపై తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో ఆయన విఫలమయ్యారని విమర్శించాయి. సోమవారం ప్రతిపక్షాలు సమావేశమయ్యారు. అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. కాంగ్రెస్, టిఎంసి, ఎస్‌పి, డిఎంకె, ఆర్‌జెడి వంటి ఎనిమిది ప్రముఖ ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు సిఇసిపై విరుచుకుపడ్డారు. తాము లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి బదులుగా, ఆదివారం తన మీడియా సమావేశం లో దాడి చేయాలని ఆయన ఎంచుకున్నారని ఆ రోపించారు. 'ఓటు హక్కు అనేది ఒక సాధారణ పౌరుడికి రాజ్యాంగం ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కు. ప్రజాస్వామ్యం దానిపై ఆధారపడి ఉం టుంది. దానిని రక్షించడానికి ఉద్దేశించిన సంస్థ ఇసి... కానీ రాజకీయ పార్టీలు లేవనెత్తిన ముఖ్యమైన ప్రశ్నలకు సిఇసి సమాధానం ఇవ్వలేదు. బాధ్యత నుండి పారిపోతోందని మనం చూడవచ్చు' అని కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ అన్నారు. ప్రతిపక్షాలు అడిగిన చెల్లుబాటు అయ్యే ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పి ఉండాలి. కానీ అందుకు విరుద్ధంగా, అతను రాజకీయ పార్టీలపై ప్రశ్నలు లేవనెత్తుతూ దాడి చేశారని ఆరోపించారు. ఎన్నికలు కేవలం మూడు నెలల దూరంలో ఉన్నప్పుడు, రాజకీయ పార్టీలతో చర్చించకుండా, ఇంత తొందరపడి ఎస్ఐఆర్ ఎందుకు చేశారో వారు చెబితే బాగుండేదని, తరువాయి 12లో

## మూడు రోజులు అత్యంత భారీ వర్షాలు



● వాతావరణ కేంద్రం అధికారుల హెచ్చరిక ● వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

ప్రజాపక్షం/హైదరాబాద్

అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడురోజులు రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని తెలిపారు. మంగళవారం వరకు వాయుగుండంగా మారి మధ్యాహ్నం వరకు దక్షిణ ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మధ్య తీరాలను దాటే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో తరువాయి 12లో


● భారత కమ్యూనిస్టు పార్టీ పిలుస్తోంది








### జెలెన్‌స్కీకి మద్దతుగా ఓవల్ ఆఫీస్‌లో
## యూరప్ నేతల సందడి



**వాషింగ్టన్:** ట్రంప్, జెలెన్‌స్కీ, యూరోపియన్ నాయకుల మధ్య కీలకమైన చర్చలు నిర్ణీత ప్రకారం సోమవారం రాత్రి జరుగుతాయి. పెద్దసంఖ్యలో ఒకేసారి యూరప్ నాయకులు ట్రంప్‌ను కలుసుకోవడం ఒక ప్రముఖఘట్టంగా నమోదు కానున్నది. రాత్రి 10.30 గంటలకు జెలెన్‌స్కీతో ట్రంప్ కరచాలనం చేస్తారు. తర్వాత గంటన్నరకు రాత్రి 11.45 గంటలకు యూరప్ నాయకులతో కరచాలనం చేస్తారు. రాత్రి 12.15 గంటలకు అందరూ కలిసి గ్రూప్ ఫొటో దిగుతారు. ఇదిలా ఉండగా, క్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎన్నో ఆశలతో ట్రంప్‌తో సమావేశానికి సిద్ధమై సానుకూల ప్రకటనలు చే స్తుండగా, ఉక్రేన్ కొన్ని త్యాగాలకు సిద్ధపడాలని చ ర్చలకు ముందే ట్రంప్ ఖరాఖండీ ప్రకటన చేశారు.బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ఇటాలియన్ ప్ర ధానమంత్రి జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్స్‌లర్ ఫ్రెడరిక్‌మెర్జ్, ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ స్టబ్, నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టే తదితరులు జెలెన్‌స్కీ వెంట ట్రంప్‌తో జరిగే ఓవల్ సమావేశంలో పాల్గొంటున్నారు. ఉక్రేన్ వెంట బలగం ఉందని, రష్యాకు వ్యతిరేకంగా ఒక ఐక్యసంఘటన అండ ఉందని చెప్పడంకోసం తరువాయి 12లో

### నరేంద్ర మోదీకి
## పుతిన్ ఫోన్‌కాల్

'అలాస్కాలో జరిగిన చర్చల సారాంశాన్ని వివరించిన రష్యా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ:** ఉక్రేన్ యుద్ధ సమస్య పరిష్కారంపై అలాస్కాలో జరిగిన చర్చల సారాంశాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ సంక్షిప్తంగా ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆగస్టు 15వ తేదీన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పుతిన్ మధ్య అలాస్కా శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశ వివరాలను పుతిన్ తన మిత్రదేశాల నాయకులకు ఫోన్‌చేసి సంక్షిప్తంగా తెలియజేస్తున్నారు. అందులోభాగంగా భారత్ ప్రధాన మంత్రి మోదీకి కూడా ఈ చర్చల సారాంశాన్ని పుతిన్ తె లియజేశారు. ఉక్రేన్‌లో యుద్ధ సమస్య శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కారం కావాలని భారత్ స్థిరమైన వైఖరితో ఉందని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ తెలియజేశారు. యుద్ధ పరిష్కారానికి జరిగే కృషికి అన్నివిధాలుగా భారత్ సహకా రం అందజేస్తుందని తెలియజేశారు. 'అలాస్కాలో జరిగిన చర్చల సారాంశాన్ని, వివరాలను నాతో పంచుకున్న మిత్రుడు, రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు కృతజ్ఞతలు'' అని సోషల్ మీడియా వేదిక ద్వారా మోదీ తెలియజేశారు. ''ఉక్రేన్ సమస్య శాంతియుతంగా పరిష్కారం కావాలని భారతదేశం చా లా స్థిరమైన వైఖరితో ఉంది, దీనికి సంబంధించి జరిగే కృషికి అన్నివిధాలుగా మద్దతు ఇస్తుంది, రాబోయే రోజుల్లో కూడా తరువాయి 12లో

### గోదావరి ప్రాజెక్టులకు
## జలకళ



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో చుక్క నీళ్లు లేకపోయినా, మేడిగడ్డ కుంగినా, అన్నారం సుందిళ్లలో నీటి చుక్క ఆపకపోయినప్పటికీ ఈ ఏడాది కురుస్తున్న వర్షాలతో గోదావరి బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ జల కళ సంతరించుకున్నాయి. ఎస్ఆర్ఎస్‌పి, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండటంతో ఉత్తర తెలంగాణలో వరద కాల్వతో పాటు మిడ్ మానేరు, ఎల్ఎండిలో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయి. మహారాష్ట్రలో ఎగువన గోదావరి పరీవాహకంలో కురిసిన వర్షాలతో ఎస్ఆర్ఎస్‌పికి మూడు రోజులుగా ఇన్ ఫ్లో కొనసాగుతోంది. నీటి పారుదల శాఖ అధికారుల సమాచారం ప్రకారం తరువాయి 2లో

### కూకట్‌పల్లిలో విద్యార్థిని
## దారుణ హత్య

- స్కూల్‌కు సెలవు కారణంగా ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక
- యువకుడి అత్యాచారయత్నం.. ప్రతిఘటించడంతో హత్య
- సిసిటివిలో పారిపోతున్న యువకుడి ఫుటేజ్‌లు లభ్యం

ప్రజాపక్షం/హైదరాబాద్

పాఠశాలకు సెలవు ఉండడం.. తల్లిదండ్రులు డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న 6వ తరగతి చదువుతున్న బాలిక దారుణ హత్యకు గురైన సంఘటన కూకట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడే ఆమెను దారుణంగా చంపి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి పారిపోతున్న అగంతకుడి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## గాజా సిటీ ఖాళీ చేస్తున్న వేలమంది...

**కైరో:** ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేస్తుందన్న భయంతో గాజా సిటీ నుండి వేలాదిమంది ప్రజలు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నారు. గాజా సిటీ తూర్పు ప్రాంతం నుండి వేలాదిమంది పాలస్తీనియన్లు తరలివెళుతున్న దృశ్యాలు సోమవారంనాడు వెలుగుచూశాయి. గాజా సిటీని ఆక్రమిస్తామని ఐడిఎఫ్ ప్రతిజ్ఞ చేసింది. ప్రపంచదేశాలు ఎంతగా చెబుతున్నప్పటికీ లెక్కచేయకుండా ముందుకు వెళుతూ ఉండటంతో పాలస్తీనియన్లు తమ సొంత మార్గాలలో రక్షణ చర్యలను అన్వేషిస్తూ ఇళ్ళు ఖాళీచేస్తున్నారు. ఈ ప్రాంతంలో తరచు బాంబుదాడులు జరుగుతున్నాయి. ఇటీవలికాలంలో 995 కుటుంబాలు గాజా సిటీ వదలివెళ్ళాయని బెయిత్ లెహియాలోని పాలస్తినా షెల్టర్ మేనేజర్ అహ్మద్ మెహైసన్ చెప్పారు.



# బొలీవియాలో మితవాదుల గెలుపు

**సుక్రీ:** సెంట్రల్ సౌత్ అమెరికా దేశం బొలీవియాలో అధ్యక్ష పదవికి, పార్లమెంటుకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఆగస్టు 17వ తేదీన అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో వామపక్షాలు ఓటమి చవిచూడగా, మితవాదులు విజయం సాధించారు. అధ్యక్ష పదవికి జరిగిన మొదటి విడత ఎన్నికల్లో మితవాద అభ్యర్థులు ఆధిక్యం సంపాదించారు.

గడచిన ఇరవై సంవత్సరాలుగా బొలీవియాలో కమ్యూనిస్టుల అప్రతిహత పరిపాలన కొనసాగుతున్నది. కానీ అధికారపార్టీలో విభేదాలవల్ల నిట్టనిలువునా చీలికలు వచ్చాయి. ప్రస్తుత దేశాధ్యక్షుడు లూయిస్ ఆల్బెర్టో అర్సే, ఆయన గురువు,ఉపదేశకుడు, దేశ మాజీ అధ్యక్షుడు ఎవో మోరల్స్ మధ్య తలెత్తిన అహంభావపూరిత విభేదాలు చీలికకు దారితీయడంతో అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అత్యంత అగౌరవకరమైన ఓటమిని చవిచూసింది. ఆదివారంనాడు అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాలేదు. రెండు మితవాద పార్టీలకు చెందిన అభ్యర్థులు సెంటర్ రైట్ సెనేటర్ రోడ్రిగో పాజ్ పెరీరా(క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీ), మాజీ అధ్యక్షుడు పచ్చిమితవాది జోర్గ్ ఫెర్నాండో 'టుటో' క్విరోగా రామిరెజ్ ఆధిక్యత సంపాదించారు. రెండో విడత రన్నాఫ్ ఎన్నికల్లో ఈ మితవాద నాయకులు ఇద్దరూ తలపడతారు. అక్టోబరు 19వ తేదీన జరిగే ఈ రెండో రౌండు ఎన్నికలలో మెజార్టీ ఓట్లు పొందిన అభ్యర్థిని అధ్యక్షుడుగా నిర్ణయిస్తారు. బొలీవియా రాజ్యాంగం ప్రకారం, మొదటి విడత జరిగిన ఎన్నికల్లో ఏ అభ్యర్థికీ 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు లభించకపోతే ఉన్నదాంట్లోనే ఎక్కువ ఓట్లు పొందిన మొదటి ఇద్దరు అభ్యర్థులూ రెండో రౌండు ఎన్నికల్లో పోటీపడి తమలో విజేత ఎవరో తేల్చుకుంటారు. ఆదివారం జరిగిన మొదటిరౌండు ఎన్నికల్లో రోడ్రిగో పాజ్ పెరీరా 32.1 శాతం ఓట్లు పొంది మొదటిస్థానంలో ఉన్నారు. క్విరోగా రామిరెజ్ 26.9 శాతం ఓట్లు సంపాదించి రెండోస్థానంలో నిలిచారు. వామపక్ష శిబిరం నుండి అనేక మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కానీ వీరిలో వామపక్ష శిబిరం నుండి ఒకే ఒక అభ్యర్థి ఆండ్రోనికో రోడ్రిగ్యుజ్ లెడెజ్మా (సెనేట్ ప్రెసిడెంట్)కు 8 శాతం ఓట్లు మాత్రమే లభించగా, ప్రస్తుత దేశాధ్యక్షుడు ఆల్బెర్టో అర్సే మద్దతుతో అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి ఎడ్వర్డో క్యాస్టిల్లోకు కేవలం 3.15 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఎనిమిదీశాతం ఓట్లు సంపాదించిన రోడ్రిగ్యుజ్ లెడెజ్మాకు నిజానికి మోరల్స్ మద్దతు ఉంది. కానీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన మోరల్స్ మద్దతును తిరస్కరించారు.



రోడ్రిగ్యుజ్ ఎవరిమీదా ఆధారపడకుండా తన సొంత ప్రజాభిమానంతో ఎనిమిదీశాతం ఓట్లు సంపాదించుకున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఎవరికీ ఓటు వేయవద్దని ఎవో మోరల్స్ ప్రచారం చేశారు. దీంతో నో ఓట్‌కు 19.1 శాతం ఓట్లు రావడంతో ఆ విధంగా మోరల్స్ తన ప్రజాదరణ నిరూపించుకున్నారు.

# డిసెంబరు 28న మయన్మార్ ఎన్నికలు

**బ్యాంకాక్:** ప్రజాస్వామ్యం గొంతు నొక్కి అధికా రం చేజిక్కించుకున్న జుంటా పాలకులు మయన్మార్‌లో ఎట్టకేలకు ఎన్నికల ప్రక్రియకు తెరలేపారు. ఈ ఏడాది డిసెంబరు 28వ తేదీన దేశంలో సార్వత్రిక ఎన్నికలకు మయన్మార్ ఎన్నికల సంఘం ముహూర్తం నిర్ణయించింది. ఎన్నికల సంఘం ఈ మేరకు ఒక ప్రకటనను సోమవారం పాత్రికేయుల కు పంపింది. ఈ ఎన్నికలు దశలవారీగా అనేక రోజులపాటు జరుగుతాయని, ఈ దశలవారీ ఎన్నికల తేదీల వివరాలు తర్వాత తెలియజేస్తామని మయన్మార్ యూనియన్ ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది.





దేశంలో 330 పట్టణాలను నియోజకవర్గాలుగా ఎన్నికల నిమిత్తం నిర్ణయించినట్లు అధికార పత్రిక ''మ్యాన్‌మా అలిన్'' తెలియజేసింది. జుంటా పాలకుల సారథ్యంలో ఉన్న రాజకీయపార్టీతోపాటు దేశంలో మొత్తం 60 రాజకీయపార్టీలు ఎన్నికల సంఘం వద్ద అధికారికంగా నమోదై ఉన్నాయి. యూనియన్ సాలిడారిటీ–డవలప్‌మెంట్ పార్టీకి అధికార జుంటా సైనికపాలకులు పూర్తి మద్దతు ఇస్తున్నారు. దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకోసం ప్రజాదళాలు పోరాటాలు చేస్తున్నాయి. చాలా ప్రాంతాలు జుంటా సైన్యం అధీనంలో లేవు. అలాంటప్పుడు ఈ ప్రాంతాల్లో సైన్యం ఏ విధంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్న విషయం ప్రధాన చర్చనీయాంశమైంది. ఎన్నికలు జరగనివ్వబోమని అనేక సాయుధ గ్రూపులు, ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ఐతే ఎన్నికల ప్రక్రియను ఎవరు అడ్డుకున్నాసరే గరిష్ఠంగా మరణశిక్ష విధిస్తూ జుంటా పాలకులు గతనెల లోనే ఒక చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, న్యాయబద్ధంగా జరిగే అవకాశం లేదని, సైనిక పాలకుల కనుసన్నల్లో వారి ప్రయోజనాలను కాపాడే ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవడంకోసమే ప్రపంచంకోసం ఈ ఎన్నికలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

ఐతే దేశంలో తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడంకోసమే జుంటా పాలకులు మొక్కుబడిగా ఎన్నికలు నిర్వహిస్తున్నారన్నది నగ్నసత్యంగా మారింది. ప్రతిపక్షాలు కూడా ఇదే విమర్శ చేస్తున్నాయి. 2021లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని జుంటా సైన్యం కూలదోసింది. ఆంగ్ సాన్ సూకీ 2020 చివరిలో జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఆమెను అధికారం చేపట్టనీయకుండా సైనిక పాలకులు అడ్డుకున్నారు. ఆమె సహా అనేకమంది రాజకీయ నాయకులను జైలుపాలు చేసింది. ప్రస్తుతం 80 ఏళ్ళు వయసుగల ఆంగ్‌సాన్ సూకీకి సైనిక కోర్టు 27 ఏళ్ళు జైలుశిక్ష విధించింది. 2020 ఎన్నికల్లో భారీ ఎత్తున అవినీతి జరిగిందని పేర్కొంటూ అధికారాన్ని కైవసం చేసుకోవడాన్ని జుంటా పాలకులు సమర్థించుకున్నారు. జుంటా అధికార దురాక్రమణను ప్రతిఘటించి వీధుల్లోకి వచ్చిన వందలమంది విద్యార్థులను సైన్యం కాల్చి చంపింది. వేలాది మంది విద్యార్థులను జైళ్ళల్లో నిర్బంధించింది. దేశంలోని పలు ప్రాంతాలలో ఇప్పటికీ అంతర్యుద్ధం జరుగుతోం ది. దీనివల్ల వేలు, లక్షలమంది మయన్మార్ నుండి ఇతర ప్రాంతాలకు, ఇతర దేశాలకు వలసలు వెళుతున్నారు. ముఖ్యంగా రోహింగ్యా ప్రజలు లక్షల మంది అనేక దేశాలకు వలసలు ఇంకా కొనసాగుతున్నాయి.

**సైన్యం బాంబు దాడుల్లో 24 మంది మృతి**

ఆదివారంనాడు మయన్మార్‌లోని మౌచి పట్టణంలోని ఒక ఆసుపత్రిపై సైన్యం బాంబులవర్షం కురిపించింది. ఈ దాడుల్లో 24 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. కాయేహ్ రాష్ట్రంలో ఈ దాడులు జరిగాయి.

మయన్మార్ ఇండిపెండెంట్ ఆన్‌లైన్ మీడియా ఈ విషయం వెల్లడించింది. అదేవిధంగా మరోచోట జరిగిన దాడుల్లో ఒక గర్భవతి సహా 21మంది మరణించారు. మోగాక్ పట్టణంలో గురువారం జరిగిన గగనతల దాడుల్లో వీరంతా మరణించారు. ఐతే సైన్యం ఈ దాడుల ను, మరణాలను ధృవీకరించలేదు.

# నైజీరియాలో బోటు బోల్తా : 40 మంది పైగా గల్లంతు



**అబుజా:** నైజీరియాలో ఒక బోటు బోల్తా పడటం తో అందులో ప్రయాణిస్తున్న 40మంది ప్రయాణీకులు జాడ తెలియకుండా పోయారు. వారికోసం తీవ్ర గాలింపు చేపట్టారు. పదిమంది ప్రయాణికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. నైజీరియా వాయువ్య ప్రాంత సోకోటో రాష్ట్రంలో ఉన్న గోరోన్యో ప్రాంత నదిలో బోటు ఆదివారం రాత్రి తలక్రిందులైంది. వ్యాపారులు, కార్మికులు బోటులో మార్కెట్‌కు వెళుతుండగా ఈ ఘటన జరిగిందని నైజీరియా నేషనల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంటు ఏజన్సీ డైరెక్టర్ జుబైదా ఉమర్ ఒక ప్రకటనలో చెప్పారు. వీరంతా గోరోన్యోలో మార్కెట్‌కు వెళుతుండగా ప్రమాదం జరిగిందని చెప్పారు. బోటులో 50మంది ప్రయాణికులు ఉన్నారన్నారు. పదిమంది సహాయ సిబ్బంది గల్లంతైనారికోసం గాలిస్తున్నారు.

నైజీరియాలో వర్షాకాలంలో తరచుగా పడవ ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. అనేకమంది ఈ ప్రమాదాలలో మరణించడం సహజ విషయంగా మారిపోయింది. ఈ పరంపర లో ఇది మరో తాజా సంఘటన. గతనెలలో కూడా ఉత్తర సెంట్రల్ నైజీరియా ప్రాంతంలో ఒక బోటు ప్రయాణికులను తీసుకువెళుతూ తలక్రిందులు కావడంతో 25మంది మరణించారు.

2024లో జరిగిన అతిపెద్ద బోటు ప్రమాదంలో 326 మంది మరణించారు. లైఫ్ జాకెట్స్‌ను ప్రయాణికులకు సమకూర్చకుండానే నైజీరియాలో బోట్లు నదిలో రాకపోకలు సాగించడం ప్రమాదాలకు ముఖ్య కారణంగా

## కిషన్‌రెడ్డే అడ్డు
(మొదటి పేజీ తరువాయి)

చేపడతామని హామీ ఇచ్చారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తాము కులగణన చేపట్టామని తెలిపారు. పక్కా ప్రణాళిక ప్రకారం శాస్త్రీయంగా కులగణన చేసి చూపించామని ధీమా వ్యక్తం చేశారు. కులగణన ద్వారా బహుజనుల సంఖ్య 56.33 శాతంగా ఉందని తేల్చామని తెలిపారు. 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున 95 వేల మందిని నియమించి ప్రతి ఇంటి నుంచి సంపూర్ణ సమాచారం సేకరించామన్నారు. తాము చేసిన సర్వే నూటికి నూరు శాతం కరెక్ట్ అని, తప్పుని నిరూపిస్తే క్షమాపణలు చెబుతామని అన్నారు. తాము సేకరించిన సమాచారాన్ని ఆయా కుల సంఘాలకు కూడా ఇచ్చామని, ఇంతలోతైన సమాచారాన్ని ఈ దేశంలో ఏ రాష్ట్రం సేకరించలేదని సిఎం పునరుద్ఘాటించారు.

**రిజర్వేషన్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి**

తెలంగాణ అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ తీర్మానం చేసి పంపించామని, అది గవర్నర్ ద్వారా రాష్ట్రపతి వద్దకు చేరిందని రేవంత్ రెడ్డి తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం 2018లో చేసిన ఒక నిబంధన 50 శాతం రిజర్వేషన్లకు అడ్డంకిగా మారిందని గుర్తించి, దానిని సవరించి ఆర్డినెన్స్ చేశామని, అది కూడా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెట్టాలని హైకోర్టు చెప్పినా, రాష్ట్రపతి మాత్రం సంతకం చేయడం లేదన్నారు. 5 నెలలు గడిచినా బిల్లులను ఆమోదించకపోవడంతో బహుజనుల కోసం ఢిల్లీలో ధర్నా సైతం చేశామన్నారు.బహుజనుల కోసం తాము చేసిన ధర్నాకు బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల నేతలు ఎందుకు రాలేదంటూ సిఎం రేవంత్ ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటుంది కిషన్ రెడ్డి, నరేంద్ర మోదీ కాదా? అంటూ నిలదీశారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చట్టంలోనే లేదు, ఎందుకు అబద్ధాలతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

**ఓటు దొంగల భరతం పడతాం**

ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, ఆయన బీహార్‌లో పాదయాత్ర చేస్తున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పోరాటంలో తాము కూడా పాల్గొంటామని చెప్పారు. ఓట్ల చోరీపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తే ఇండియా కూటమికి చెందిన 100 మంది ఎంపిలు వచ్చారని, అయితే బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులెవరూ రాలేదని ఆయన విమర్శించారు. యువతీ యువకులు గ్రామాలకు వెళ్లి ఓట్ల జాబితాను చెక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

**బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్**

బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మైనింగ్ పేరుతో ఖిలాషాపూర్ కోట చరిత్రను కాలగర్భంలో కలిపేందుకు కుట్ర చేసిందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం ఖిలాషాపూర్ కోటపై కుట్రలు చేసిందని, ఆనాడే కోటపైకి వెళ్లి దాన్ని కాపాడి చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు.

**సామాజిక న్యాయానికి, ధర్మానికి పాపన్న విగ్రహం పునాది : భట్టి విక్రమార్క**

సామాజిక విప్లవానికి దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శమని, సామాజిక న్యాయానికి కట్టుబడి సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ కేబినెట్ నిర్ణయాత్మక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని కుల గణన రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా చేపట్టి, బిసిలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్‌కు పంపామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య దేశంలోనే చర్చకు దారితీసిందన్నారు. బహుజన బిడ్డలు భవిష్యత్తులో ఫలాలు పొందేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని, ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకొని కాపాడాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న పోరాట మార్గం, పోరాట స్ఫూర్తి అందరికీ గుర్తుకు వచ్చే విధంగా సచివాలయం ముందు భాగాన విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విగ్రహ ఏర్పాటు, సచివాలయం ఎదురుగా స్థలాన్ని ఇచ్చినందుకు సిఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలపాలన్నారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేసింది కొన్ని రాజకీయ పార్టీలు రకరకాలుగా ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

**సర్వాయిపేట కోటను రూ.4.5 కోట్లతో అభివృద్ధి చేస్తాం – మంత్రి పొన్నం ప్రభాకర్**

బహుజనుల ఆకాంక్షలకు అనుగుణంగా అందరినీ కలుపుకుని పాపన్న పోరాటం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పాపన్న చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో విగ్రహం ఏర్పాటుకు తాను, మహేశ్ కుమార్ గౌడ్ చొరవ తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విగ్రహానికి శంకుస్థాపన చేశారన్నారు. 42 శాతం రిజర్వేషన్లు రాజకీయాలకు మాత్రమే కాకుండా, విద్య, ఉద్యోగాల్లో కూడా వర్తిస్తాయని, దీనివల్ల విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సర్వాయిపేట కోటను సందర్శించారని మంత్రి గుర్తు చేశారు. ఆ కోటను రూ. 4.5 కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేస్తూ, పాపన్న ఆనవాళ్లతో అక్కడ ఒక విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## 'రెడ్ ఫ్లాగ్ మార్చ్'
(మొదటి పేజీ తరువాయి)

పతాకాన్ని ఎగురవేస్తారని, 10.15 గంటలకు ప్రముఖ కవి, నవ చేతన పబ్లిషింగ్ హౌజ్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, సౌహార్ద్ర ప్రతినిధులుగా సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరుకానున్నారని కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

**మహాసభల ప్రాంతానికి 'పొట్లూరి నాగేశ్వరావు నగర్'గా నామకరణం :**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల ప్రాంతానికి ఎఐటియుసి సీనియర్ నాయకులు 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్'గా నామకరణం చేసినట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. మహసభల సమావేశ హాల్‌కు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేష్ హాల్'గా, భోజనశాలకు మేడ్చల్ జిల్లా నాయకులు 'కామ్రేడ్ రోయ్యల కృష్ణమూర్తి, కామ్రేడ్ కె.సహాదేవ్'ల పేర్లను పెట్టామని వివరించారు.

**మహాసభల వేదికగా ప్రజాసమస్యలపై ఉద్యమ కార్యాచరణ:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మహాసభల వేదికగా ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోనున్నామని కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. ముఖ్యంగా మతోన్మాద పార్టీ అయిన బిజెపి ఫాసిస్టు విధానాలను అనుసరిస్తూ మతం, కులం, జాతి, భాష పేర్లతో చిచ్చు పెడుతూ దేశ ప్రజలను చీల్చేందుకు కుట్ర పనుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 240 సీట్లకు కట్టడి చేసి కొంత నియంత్రించగలిగామని, భావసారూప్యత గల పార్టీలతో కలిసి భవిష్యత్‌లో బిజెపిని రాజకీయంగా మరింత కట్టడి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రజలకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేయాల్సి ఉందని, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే ఆర్‌టిసిలో ఎన్నికలు నిర్వహించకపోవడం అప్రజాస్వామికమని, అసంఘటిత కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని, ఈ సమస్యలపై మహాసభల అనంతరం ఉద్యమించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ(ఎం)తో సిపిఐ పొత్తు ఉంటుందని, కాంగ్రెస్‌తోనే స్నేహబంధం కొనసాగుతుందని తెలిపారు.

**తెలంగాణ సాయుధ పోరాట యోధులకు తగిన గుర్తింపు ఇవ్వాలి : చాడ వెంకట రెడ్డి**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేనిదే తెలంగాణ రాష్ట్రం లేదని చాడ వెంకటరెడ్డి అన్నారు. సమరయోధులకు గత ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తింపును ఇవ్వకపోవడం బాధాకరమని, వారికి సరైన గౌరవాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా నాటి రైతాంగ సాయుధ పోరాట సమరయోధుల వీర గాథలు, వారి ఫోటోలతో ఆహ్వాన సంఘం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పశ్యపద్మ మాట్లాడుతూ మహాసభలలో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలతో దేశ, రాష్ట్ర రాజకీయాలు, ఉద్యోగ, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలు, ప్రజా సమస్యలపై విస్తృత స్థాయిలో చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభల ఏర్పాట్లను ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి.యూసుఫ్ వివరించారు.

## జలకళ
(మొదటి పేజీ తరువాయి)

సోమవారం మధ్యాహ్నం 1.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దాదాపు 76,867 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. కాకతీయ కెనాల్‌కు 5 వేల క్యూసెక్కులు, ఎస్ఆర్ఎస్‌పి నుంచి 18 వేల క్యూసెక్కుల నీటిని ఇందిరమ్మ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరుకు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు 18.92 టిఎంసిలకు చేరుకున్నాయి. ఈ ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 20.175 టిఎంసిలు, 148 మీటర్ల గరిష్ట నీటి మట్టం కాగా ప్రస్తుతం 147.55 మీటర్ల నీటి మట్టం ఉంది. ఈ ప్రాజెక్టు పరివాహకంలో కురిసిన వర్షాలతో 48,293 క్యూసెక్‌ల ఇన్ ఫ్లో ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ తాగునీటితో పాటు న్‌టిపిసికి నీటిని విడుదల చేయటంతో పాటు నంది పంప్ హౌజ్‌కు 6,300 క్యూసెక్‌ల నీటిని వదులుతున్నారు. ఆగస్ట్ 13వ తేదీ నుంచి 5 రోజులుగా ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు 4.12 టిఎంసిల నీటిని వదిలారు. మిడ్ మానేరు జలాశయంలో 10.81 టిఎంసిల నీటి నిల్వలున్నాయి. ప్రస్తుత నీటి మట్టం 309.63 మీటర్లు కాగా ఈ నీటి మట్టం 311.14 మీటర్లకు చేరితే నీటి నిల్వ 13.13 టిఎంసిలకు చేరుతుంది. అప్పుడు ఒక పంప్ ఆన్ చేయటం వీలవుతుంది. ఇప్పుడున్న ఇన్ ఫ్లో ప్రకారం ఆగస్ట్ 20 నుంచి పంపింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయని ఇరిగేషన్ ఇంజనీర్లు తెలిపారు. మిడ్ మానేరు నుంచి 4 పంప్‌లు రన్ చేయాలంటే 25.77 టిఎంసిల నీటి నిల్వ చేరాల్సి ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

## మంజీరా నదిలో నలుగురు గొర్రెకాపరులు
### 560 గొర్రెలను కాపాడిన ఫైర్ సిబ్బంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కామారెడ్డి జిల్లా బీనికుంద మండలం చెట్లూరు గ్రామంలో మంజీరా నదిలో వరదల్లో చిక్కుకుపోయిన నలుగురు గొర్రెకాపరులతో పాటు 560 గొర్రెలను అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలకు తెగించి రక్షించినట్లు ఫైర్ డిజి వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గుంకల్లూరు గ్రామానికి చెందిన సాయి గౌండ (48), బస్వాపూర్‌కు చెందిన సాయి గౌండ (37), గుంకలూరు గ్రామానికి చెందిన యాదవ్ గౌండా(23), చిక్లూర్ గ్రామానికి చెందిన చాకలి సాయిలు (35)లు ఈ నలుగురు గొర్రెల కాపరులు తమ వెంట సుమారు 560 గొర్రెలను తీసుకుని చెట్లూరు గ్రామంలోని మంజీరా నది ఒడ్డుకు ఆదివారం ఉదయం మేత కోసం వెళ్లారు. రాత్రి అక్కడే తిష్ట వేసి గొర్రెకాపరులతో పాటు, గొర్లు రాత్రంతా అక్కడే మకాం చేశారు. ఇదిలావుండగా నిజాంసాగర్‌లో వరద నీరు పెరగడంతో ఏడు గేట్లను అర్ధరాత్రి తరువాత తెరిచారు. దీంతో వీళ్లు మకాం వేసిన ప్రాంతంలోకి పెద్ద ఎత్తున నీరు చేరుకోవడంతో వరదలో చిక్కుకున్నారు. చుట్టూత వరద నీరు చేరుకోవడంతో ఎక్కడికి పారిపోలేని పరిస్థితి నెలకొంది. ఉదయం 5 గంటలకు ఈ విషయంపై కామారెడ్డి, నిజామాబాద్ డిస్టిక్ ఫైర్ ఆఫీసర్లు సందన్న, టి.పరమేశ్వర్‌లకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన వీళ్లు మదనూర్ ఫైర్ స్టేషన్, నిజామాబాద్, కామారెడ్డి, ఏగవ బెటాలియన్‌ల నుంచి ఫైర్ సిబ్బంది, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది బోట్స్, ఇతర పరికరాలతో ఘటనా స్థలానికి చేరుకుని పై నలుగురిని క్షేమంగా కాపాడారు. ఆ తరువాత 560 గొర్రెలను కూడా క్షేమంగా వరదల నుంచి కాపాడారు. గొర్రెకాపరులతో గొర్లను కాపాడిన అధికారులు, సిబ్బంది ధైర్య సాహసాలను ఫైర్ డిజి వై.నాగిరెడ్డి అభినందనలు తెలిపారు.

## ఆరుగురు మృతి
(మొదటి పేజీ తరువాయి)

పొందుతూ తుది శ్వాస విడిచాడు. మృతుల కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించి మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొంటుందని హామీ ఇచ్చారు. ఈ సంఘటన పూర్వాపరాలిలా ఉన్నాయి. కృష్ణాష్టమి వేడుకల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన రథాన్ని ఆదివారం రాత్రి స్థానికులు చేతులతో లాగుతూ ముందుకు తీసుకొని వెళ్లసాగారు. ఈ క్రమంలో ఇనుముతో కూడిన రథానికి ఒక్కసారిగా పైనున్న విద్యుత్ ప్రసారిత వైర్లు తగిలటంతో విద్యుద్ఘాతానికి గురై రథాన్ని లాగుతున్న వారందరూ విసిరేసినట్లు దూరదూరంగా పడి పోయారు. ఏం జరిగిందో తెలియక ఊరేగింపులో ఉన్న వారంతా భయభ్రాంతులకు గురై అరుస్తూ భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే తేరుకొని కిందపడ్డ కిందపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారిలో ఐదుగురు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మరొకరు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతి చెందిన వారిని కృష్ణయాదవ్(21), సురేష్ యాదవ్(34), శ్రీకాంత్‌యాదవ్(35, రుద్రవికాస్(38, రాజేంద్రరెడ్డి(45)లుగా గుర్తించగా మరొకరిని గుర్తించాల్సి ఉంది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలను శవపంచనామా నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. సంఘటనా విషయం తెల్సిన రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం మృతులు కుటుంబాలను పరామర్చించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిహెచ్‌ఎంసి కమిషనర్, మేడ్చల్ జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విద్యుద్ఘాతంతో యువకులు మృతి చెందిన ఉదంతంపై బిఆర్‌ఎస్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కెటి రామారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, చాలా బాధాకరమైన సంఘటన చోటు చేసుకొందంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈ విషాద సంఘటనపై విద్యుత్ శాఖ సిఎండి ముషారఫ్ ఫరూఖీ స్వయంగా సంఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. 11 కెవి విద్యుత్ తీగకు ఇంటర్నెట్ కేబుల్ కండక్టర్ వైర్లు కంటాక్టులో ఉందని, ఈ కారణంగా ఇంటర్నెట్ కేబుల్ వైరుకు సైతం విద్యుత్ ప్రసారం అయిందని, ఈ కేబుల్ వైరును ఊరేగింపులో ఉన్న కృషాష్టమి రథం తగిలి ఇనుముతో కూడిన రథం మొత్తానికి విద్యుత్ ప్రసారం అవటం వల్లనే ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు.మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. తక్షణ చర్యగా ఇక్కడ ఉన్న ఇంటర్నెట్ వైర్లన్నీ తొలగించి కిందకు ఉన్న విద్యుత్ తీగలను సరిచేస్తామని చెప్పారు.రానున్న వినాయక, దుర్గామాత వేడుకలు సందర్భంగా నగర వ్యాప్తంగా ఇలాంటి చర్యలు తీసుకొంటామని సిఎండి వెల్లడించారు. విద్యుద్ఘాతంతో ఆరుగురు యువకులు మృతి చెందటానికి విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికులు సోమవారం రామంతాపూర్‌లోని ప్రధాన రహదారిలో బైఠాయించి నిరసన చేపట్టటంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

## యూరియా లోటు
(మొదటి పేజీ తరువాయి)

చేయలేక పోవటంతో ప్రస్తుతం రాష్ట్రంలో 2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడిందన్నారు దీంతో రైతులకు పంటకు సరిపడా యూరియాను ఒకేసారి అందించలేకపోతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న లోటును దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్లకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత నిల్వలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని, హోల్ సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాములలో రోజువారి యూరియా స్టాక్ ను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు.వ్యవసాయశాఖ నుండి వచ్చే రెక్‌ల వివరాలను జిల్లా స్థాయిలో సమన్వయం చేసుకొని మండలాల వారీగా అవసరానికి అనుగుణంగా కేటాయింపు చేయాలని కలెక్టర్లకు సూచించారు. యూరియా సరఫరాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెద్ద రైతుల అవసరాలకు విడతల వారిగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. అవసరమైతే పట్టాదారు పాసుపుస్తకాలు అనుసంధాన చేయాలని సూచించారు. రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి గందరగోళం లేకుండా యూరియా సరఫరా చేయాలని, యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా, అన్ని శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, రాష్ట్రాల మధ్య అక్రమ రవాణా అడ్డుకునేలా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతులకు యూరియాను మితంగా ఉపయోగించాలనీ, నానో యూరియా, డిఎపి, ఎంఒపి కాంప్లెక్స్ ఫెర్టిలైజర్స్, బయోఫెర్టిలైజర్స్ వంటివి వినియోగించేలా ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. స్థానిక మీడియా ద్వారా ప్రకటనలు విడుదల చేసి, రైతులకు ప్రభుత్వం సమయానికి సరఫరా చేస్తున్నదని నమ్మకం కల్పించాలని అన్నారు. ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని,మండలాల వారీగా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి, వ్యవసాయ శాఖ, పోలీస్, సహకార సంస్థలతో సమన్వయం చేసి పారదర్శకంగా పంపిణీ జరిగేలా చూడాలని అన్నారు. యూరియా సరఫరా సాధారణ స్థితికి చేరేవరకుఅధికారులంతా పూర్తి అప్రమత్తతో పర్యవేక్షించాలనికలెక్టర్లను ఆదేశించారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడే మాటలకు భయాందోళనలకు గురై యూరియాను అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తెలంగాణ నుంచి గుజరాత్‌కు 'కేన్స్' కంపెనీ : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, విధానాల కారణంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన భారీ పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో రూ.2,800 కోట్ల పెట్టుబడితో వచ్చిన 'కేన్స్' టెక్నాలజీ' సెమీ కండక్టర్ల పరిశ్రమ గుజరాత్‌కు తరలిపోవడం అత్యంత బాధాకరమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా రేవంత్ కళ్లు తెరిచి పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించాలని సూచించారు. లేకపోతే మరిన్ని కంపెనీలు రాష్ట్రం విడిచిపోయే ప్రమాదం ఉన్నదని కెటిఆర్ పేర్కొన్నారు.

పెట్టుబడులు తీసుకురావడంలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రత్యేక కృషి ఏమీ లేదని, తెలంగాణ ఆటో పైలెట్ మోడ్‌లో ఉందని కారుకూతలు కూసిన సిఎం రేవంత్ రెడ్డి, ప్రస్తుతం వేరే రాష్ట్రాలకు తరలిపోతున్న పరిశ్రమలపై ఏం సమాధానం చెబుతారని కెటిఆర్ ప్రశ్నించారు.

# చేనేత ఉత్పత్తులపై జిఎస్‌టిని ఎత్తివేయాలి

### ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌కు తుమ్మల నాగేశ్వరరావు లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన 5 శాతం జిఎస్‌టినిఎత్తివేయాలని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఇప్పటికే చేనేత రంగం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని చేనేత ఉత్పత్తులపై 5 శాతం జిఎస్టి విధించడంతో ధరలు పెరిగి, వినియోగం తగ్గి మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే ఈ రంగమేనని రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 మంది చేనేత కార్మికులు, 34,569 మంది అనుబంధ కార్మికులు ఈ రంగంలో పని చేస్తున్నారని చెప్పారు. అయితే, ముడి సరుకుల ధరలు పెరగడం, పవర్‌లూమ్ అండ్ మిల్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారుచేయడంతో, మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారుచేసే నేత కార్మికులకు గిరాకి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ కాటన్, పట్టు చీరలు, నారాయణపేట కాటన్ మరియు పట్టు చీరలు,సిద్దిపేట గొల్ల భామ చీరలు, వరంగల్ దర్రీస్,కరీంనగర్ డబుల్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, వీటిలో ఆరు ఉత్పత్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదు అయ్యాయని మంత్రి వివరించారు.

జిఎస్‌టి కారణంగా నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్ళాల్సిన పరిస్థితి వస్తోందన్నారు.చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికి, వారి నిరంతరం ఉపాధి కల్పించడానికి, భారతీయ చేనేతకళా వారసత్వాన్ని భావితరాలకు అందించడానికి చేనేత ఉత్పత్తులపై 5 శాతం జిఎస్‌టిన మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు లేఖలో కోరారు.

# 20న 'ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్'కు సిఎం శంకుస్థాపన

### గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్:గచ్చిబౌలిలోని తెలంగాణ రాష్ట్ర అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్ మెంట్ (తాలిమ్) కార్యాలయంలోని 'ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్'ను ఈ నెల 20న సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేందుకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టామని, తద్వారా ప్రజలకు ఇప్పటికే పలు మెరుగైన సేవలు అందుతున్నాయని, భవిష్యత్‌లో అత్యుత్తమ సేవలు అందించేందుకు వీలుగా అవసరమైన చోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరించి ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మించబోతున్నామని వెల్లడించారు. 'గచ్చిబౌలి ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్' కార్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపైన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పని తీరు మెరుగుపడడంతో పాటు పర్యవేక్షణ సులభమవుతుందని, అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పని భారం సమానంగా ఉండడంతో పాటు దస్తాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందని వివరించారు. మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి నాలుగు జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకురాబోతున్నామని, రంగారెడ్డి ఆర్ఒ ఆఫీస్, గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నాలుగు ఆఫీసులను నిర్మిస్తున్నామన్నారు.

అబ్దుల్లాపూర్, పెద్ద అంబర్ పేట్, హయత్‌నగర్, వనస్థలిపురంనకు సంబంధించి కోహెడ్ లో, మహేశ్వరం, ఇబ్రహింపట్నం, శంషాబాద్‌కు సంబంధించి మహేశ్వరం మండలంలోని మంకాల్‌లో, ఆర్ఒ మేడ్చల్, కుత్బుల్లాపూర్, కీసర, శామీర్‌పేటకు సంబంధించి కండ్లకోయలో ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజిగిరికి సంబంధించి బోడుప్పల్‌లో బంజా రాహిల్స్, ఎస్.ఆర్.నగర్, గోల్కొండకు సంబంధించి బంజా రాహిల్స్‌లో, ఆజంపూరా, చార్మినార్, దూద్ బౌలికి సంబంధించి మలక్‌పేటలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. మరో పదమూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం నాలుగు చోట్ల ఇంటిగ్రేటెడ్ భవనాల కోసం స్థలాలను గుర్తించాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశించినట్టు తెలిపారు.

రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10వ తేదీ నుంచి దశల వారీగా జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని,ఇప్పటి వరకు దాదాపు మూడు లక్షల స్లాట్ బుకింగ్‌లు నమోదయ్యాయని మంత్రి పొంగులేటి చెప్పారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖను తమ ప్రభుత్వం ఒక ఆదాయ వనరుగా చూడడం లేదని, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

స్లాట్ బుకింగ్ ద్వారా ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని, మరింత వేగవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేలా 'ఈ ఆధార్' విధానాన్ని తీసుకురాబోతున్నామని, ఇప్పటికే ఈ విధానాన్ని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలవుతుందని, త్వరలోనే అన్ని కార్యాలయాల్లో అమలు చేస్తామని మంత్రి పొంగులేటి వివరించారు.

# వైద్య సేవలు అందించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ప్రశంసనీయం

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజంలోని బలహీన వర్గాలకు వైద్య సేవలు అందించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ప్రశంసనీయమని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. రాజ్‌భవన్ ప్రాంగణంలోని సంస్కృతిక కళాభవనంలో సోమవారం డిజేబుల్ ఫౌండేషన్ ట్రస్ట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో, పిట్టి ట్రస్ట్ సహకారంతో, మెగా మెడికల్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో స్వచ్ఛంధ సంస్థ కృషిని అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, వికలాంగులు, అవసరమైన ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు చేరువ కావడానికి ఇలాంటి క్యాంపులు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు.

సమాజంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహకర చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంఎల్‌ఎ కాలే యాదయ్య, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ఎం. వీరయ్య, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, పిట్టి ట్రస్ట్ చైర్మన్ శరద్, డా. విజయభాస్కర్, వైద్య నిపుణు లు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారతీయ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/ హైదరాబాద్: భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్ ను నిలపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సినిమా రంగం ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతను అందిస్తామని ఆయన తెలిపారు. 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఎంపికైన పలువురు సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన నివాసం లో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అవార్డు గ్రహీతలైన భగవంత్ కేసరి సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి, హనుమాన్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, హనుమాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్ కు సంబంధించి వెంకట్, శ్రీనివాస్, టీమ్ సభ్యులు, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, బేబి సినిమా డైరెక్టర్ సాయి రాజేశ్, సింగర్ రోహిత్ లను సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు.




# కోటి మందికి ఏఐ ఆధారిత పౌర సేవలు

### 2027 నాటికి అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం
### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్:2027 నాటికి ఏఐ ఆధారిత పౌర సేవలను కోటి మంది ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'ఏఐ లెడ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఛాంపియన్స్ కాటలిస్ట్ ప్రోగ్రామ్' పేరిట ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్(ఐటి శాఖ) ఆధ్వర్యంలో ప్రభుత్వాధికారులకు జూబ్లీహిల్స్ లోని డా.ఎంసిఆర్ హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తమది సమస్య వచ్చిన తర్వాత స్పందించే ప్రభుత్వం కాదన్నారు. ముందుగానే ఊహించి పరిష్కరించే చురుకైన, పారదర్శకమైన, ముందుచూపున్న ప్రభుత్వమన్నారు. ఏఐ సహకారంతో ప్రజలు అడగకుండానే వారి ముంగిటకు పౌర సేవలను చేర్చే సరికొత్త తెలంగాణను నిర్మించాలన్నదే తమ సంకల్పమన్నారు. ఈ కొత్త తెలంగాణ 5 బిలియన్ డాలర్ల ఏఐ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మారుతుందని, వేలాది ఉద్యోగాలను సృష్టిస్తుందని వివరించారు. 'ఏఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తెలంగాణ'ను తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ ను అందుబాటులోకి తేబోతున్నామని చెప్పారు.

దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ ఛేంజ్ ను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచామన్నారు. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవలను ఏఐ ఆధారిత ప్లాట్ ఫాంపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ఆయా శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి... ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వీరికి మూడు నెలల పాటు ఏఐ నిపుణులు మెంటార్లుగా వ్యవహరించి మార్గదర్శకత్వం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, డిప్యూటీ సెక్రెటరీ భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి లాభాల్లో కార్మికులకు 40శాతం వాటా

### సిఎండికి ఎస్‌జిఎల్‌బికెఎస్ వినతి పత్రం



ప్రజాపక్షం/హైదరాబాద్ : సింగరేణి సంస్థ ఉత్పత్తి ఉత్పాదకత లో కార్మికుల శ్రమ మిళితమైందని, సంస్థ ఆర్థిక లాభాల్లో కార్మికవర్గానికి 40శాతం చెల్లించడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు రూ.10వేల బోనస్ గా ఇవ్వాలని శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఎఐఎఫ్‌టియు)డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం ఎస్‌జిఎల్‌బికెఎస్ గౌరవ అధ్యక్షురాలు విమలక్క నేతృత్వంలో ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సిఎండి బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికునికి ఎలాంటి షరతులు లేకుండా అన్‌ఫిట్ చేయాలనీ, వారి కుటుంబంలోని ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అదేవిధంగా గత మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ అయినా కార్మికుల పిల్లలను టెన్త్ స్టడీ లేదని ఉద్యోగం ఆపి విజిలెన్స్ కు అప్పాజెప్పారని దీంతో ఉద్యోగం నిలిపి వేయబడ్డ కుటుంబాలు ఎంతో మానసిక ఆర్థిక భారాలను ఎదుర్కొంటున్నాయన్నారు. వెంటనే వారికీ ఉద్యోగం కల్పించాలని సిఎండిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎల్‌బికెఎస్ అధ్యక్షులు జి. రాములు, ప్రధాన కార్యదర్శి మాతంగి రాయమల్లు, కార్యదర్శి ఎం.పోచమల్లు, రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెల్తురు సదానందం తదితరులు పాల్గొన్నారు.

# 25 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఆర్థిక సహాయం

### తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : జర్నలిస్టుల రాష్ట్ర సంక్షేమ నిధి నుంచి 25 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమి జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 3వ సమావేశం చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 18మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన ఏడుగురు జర్నలిస్టులకు కూడా కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఈ కమిటీ సమావేశంలో ఎంపికైన 18 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆ కుటుంబాలకు ఆగష్టు, 2025 నెల నుండి ప్రతి నెల రూ.3వేల చొప్పున పెన్షన్ ఐదేళ్ల పాటు అందజేస్తామని ఆయన తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్‌కెజి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక రూ.1000ల చొప్పున ట్యూషన్ ఫీజును మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. రోడ్డు ప్రమాదం, రైలు ప్రమాదం కారణంగా శాశ్వతంగా అంగవైకల్యం పాలైనవారు, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నవారు, బ్రెయిన్ హేమరేజ్, బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి గ్రస్తులు పనిచేయలేని స్థితిలో ఉన్న ఆరుగురు జర్నలిస్టులకు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం, మరొకరికి రూ.50 వేల చొప్పున జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీ సమావేశంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్.జగన్, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ మహమ్మద్ ఇక్బాల్ హుస్సేన్, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం, కమ్యూనికేషన్స్ విభాగాధిపతి డాక్టర్ సతీష్‌కుమార్ తల్లాడి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ యాదగిరి కంబంపాటి, దూరదర్శన్ ప్రోగ్రాం ఇంచార్జి సత్యనారాయణ, ఆల్ ఇండియా రేడియా కార్యక్రమాల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్(పి) సుంకశారి రమేష్, మీడియా అకాడమి అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య

* ప్రయోగాత్మకంగా 34 పాఠశాలల గుర్తింపు
* సెప్టెంబర్ 1 లోపు ప్రాథమిక విద్య బోధనను ప్రారంభించేందుకు చర్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకు అంగన్‌వాడిల కోసం ప్రయోగాత్మకంగా 34 పాఠశాలలను గుర్తించారు. పాఠశాలల ప్రస్తుత పరిస్థితులను తక్షణమే పరిశీలించి, అనువుగా ఉంటే జిల్లా విద్యా అధికారులతో (డిఇఒ) సమన్వయం చేసి భవనాలను అంగన్‌వాడి కేంద్రాల కోసం కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 1 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసి పూర్వ ప్రాథమిక విద్యా బోధనను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సూచించారు.

ప్రస్తుతం అనేక అంగన్‌వాడి కేంద్రాలు ఒకే గదిలో నడుస్తున్నందున ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనికి ప్రత్యామ్నాయంగా, జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 21 జిల్లాల్లో 61 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. అందులో 34 పాఠశాలలు అంగన్‌వాడి కేంద్రాలకు సమీపంలో ఉన్నందున అక్కడికి అంగన్‌వాడి కేంద్రాలను మార్చి, పూర్వ ప్రాథమిక విద్యా తరగతులను ప్రారంభించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అనుగుణంగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జి. సృజన జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**అంగన్‌వాడి కేంద్రాలో పూర్వ ప్రాథమిక విద్య: మంత్రి సీతక్క**

దేశంలో ఎక్కడా లేని విధంగా అంగన్‌వాడి కేంద్రాల్లోనే పూర్వ ప్రాథమిక విద్యను అంది స్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ప్రైవేటు ప్లే స్కూల్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా అంగన్‌వాడిలు ఇప్పటికే పిల్లలకు నాణ్యమైన విద్య, సంరక్షణ అందిస్తున్నాయని గుర్తుచేశారు. అంగన్‌వాడిలలో ప్రీప్రైమరీ సామర్థ్యాన్ని పెంపొందించి పిల్లలను ప్రాథమిక విద్యకు సిద్ధం చేస్తున్నామని చిన్నారి జీవితంలో ప్రారంభ దశలో ఇచ్చే సరైన సంరక్షణ, విద్య వారికి జీవితాంతం సానుకూల ఫలితాలు ఇస్తాయనే విషయం అనేక అధ్యయనాలు చెబుతున్నాయని, అందుకే పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడిల ద్వారా అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

జిరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను వినియోగించడం ద్వారా ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, రాష్ట్రంలోని ప్రతి చిన్నారికీ నాణ్యమైన ప్రారంభ విద్య అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

# 96.55 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న 'పంచాయతీ రోడ్లు'

### 60 చెరువులకు గండ్లు..

ప్రజాపక్షం/హైదరాబాద్: భారీ వర్షాలు, వరదల కారణంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో మొత్తం 96.55 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. 75 ప్రాంతాల్లో రోడ్ల ఉపరితలకు నష్టం జరిగినట్టు అధికారులు గుర్తించారు. ఇందుకు తాత్కాలిక పునరుద్ధరణకు రూ.340.80 లక్షల వ్యయం, శాశ్వత పునరుద్ధరణ నిమ్మితం రూ. 4940.00 లక్షల వ్యయం అవుతుందని పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఒక అంచనాకు వచ్చారు.సూర్యాపేట జిల్లాలో 35 భవనాలు శిధిలావస్థలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 14 భవనాలు వాడుకలో లేవు, మిగిలిన 21 భవనాలకు సంబంధించిన వారు వెంటనే ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. అలాగే ఖమ్మం జిల్లాలో మొత్తం 11 జెడ్‌పి క్వార్టర్ భవనాలు శిధిలావస్థలో ఉండగా, వాటిని కూడా ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు.

కాగా మొత్తం 88 ప్రదేశాలలో సిడి వర్క్స్ పనులు ఉండగా,ఇందుకు తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ.164.55 లక్షలు, శాశ్వత పునరుద్ధరణ వ్యయం రూ. 8774.00 లక్షలు అంచనా వేశారు. మరో 60 చెరువులకు గండ్లుపడ్డాయి. ఇందుకు తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ.108.40 లక్షలు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 557.00 లక్షల వరకు వ్యయం అవుతుందని అధికారులు గుర్తించారు. అలాగే రాష్ట్రంలోని 223 ప్రదేశాలు రోడ్లు దెబ్బతినగా, వీటికి తాత్కాలిక పునరుద్ధరణ నిమ్మితం రూ. 613.75 లక్షలు, శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.14271.00 లక్షలు మొత్తంగా రూ. 14884.75లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 22/EE/Divn-15/SBZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ తేది: 18.08.2025

క్ర.సం.1, పని పేరు: నెం.4 సివిల్ పనులు, అంచనా విలువ: రూ. 68.30 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.08.2025న మ.3.00గం.ల నుండి, డౌన్‌లోడ్ ఆఖరి తేది: 21.08.2025న మ.03.00గం.ల వరకు, బిడ్ ప్రారంభ తేది: 21.08.2025న మ.3.15గం.లకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.15, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 7995007437.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.15, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 6634-PP/CL/ADVT/1/2025-26, Date: 18-08-2025

**CHANGE OF NAME**

నేను, కుర్మ మానస, భర్త: నర్సయ్య, వయస్సు: 31 సం॥లు, పుట్టిన తేది: 15-02-1994, చిరునామా: ఆరేపల్లి గ్రామం, పాపన్నపేట మండలం, మెదక్ జిల్లా. నేను నా పేరును చెల్మేటి దుర్గాభవాని, భర్త: నర్సయ్య అని మార్చుకుంటున్నాను.

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము**
మార్కెట్ రోడ్, కరీంనగర్ పట్టణము.

లేఖ నెం. 19/SVST/2020 ప్రకటన తేది: 02.07.2025

శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయశాఖ, హైదరాబాద్, తెలంగాణ గారి RC No. B2/790/2021, Dt:28-04-2022 ఉత్తర్వుల ననుసరించి సదరు ఆలయములో **వివిధ ఆర్జిత సేవలు** మరియు **ఇతర పూజలు** చేయుటకు గాను ఈ క్రింద చూపబడిన పోస్టునకు ప్రభుత్వ ఉత్తర్వులు G.O.M.S No.888 Rev.(Endt-I) Department, dt: 08-12-2000 and G.O.Ms. No. 261, dt: 25.05.2002 ననుసరించి సెలక్షన్ కమిటి ద్వారా నియమించుటకు అర్హత కలిగిన **పురుష అభ్యర్థుల** నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

| పోస్టు వివరములు | పోస్టుల సంఖ్య | వయస్సు | విద్యార్హత |
|---|---|---|---|
| పంచరాత్ర ఆగమ వైష్ణవ సాంప్రదాయ అర్చకుడు | 01 | తేది: 19-08-2025 నాటికి 18 సం.ల వయస్సు కల్గియుండి 38 సం.ల లోపు వారు అర్హులు | వైష్ణవ మరియు ఆచార వ్యవహారములో అవగాహన కలిగి దేవాదాయశాఖ వారి అర్చక ప్రవేశ పరీక్ష నందు ఉత్తీర్ణత పొంది యుండవలెను మరియు ఇతర విద్యార్హత |

పై పోస్టు నియామకమునకై సెలక్షన్ కమిటీ ద్వారా **వ్రాత / మౌఖిక పరీక్షలు** నిర్వహించి మెరిట్ ఆధారముగా ఎంపిక చేయబడును. ఆసక్తి గల వారు తమ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్స్ జత చేసి బయోడేట పూరించి **తేది:07-09-2025 సాయంత్రం 5:00 గం.ల లోపు** సదరు ఆలయమునందు సమర్పించవలెను. అర్హత గల దరఖాస్తులందరికి సెలక్షన్ కమిటి వారిచే నిర్ణయించిన వ్రాత మరియు మౌఖిక పరీక్షలు తేదిని తదుపరి తెలియజేయబడును. మిగితా వివరాలకు ఆలయమునందు సంప్రదించగలరు.

DIPR R.O. No. : 6627-PP/CL/ADVT/1/2025-26, Date: 18-08-2025 సం/- కార్యనిర్వహణాధికారి



# జనరల్
STATE & REGIONAL NEWS

## డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సంతోష్‌కుమార్ వర్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజనన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సంతోష్‌కుమార్ వర్మ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఐఆర్‌ఎస్‌ఎస్ 1995 బ్యాచ్‌కు చెందిన సంతోష్‌కుమార్ వర్మ గతంలో భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీలో జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. సంతోష్ కుమార్ వర్మ సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో సీనియర్ డిఎంఎంగా, సౌత్ వెస్ట్రన్ రైల్వేలోని హుబ్లి డివిజన్ కు అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా తన సేవలను అందించారు.

## ప్రధానిని కలిసి శుభాన్షు శుక్లా..




**న్యూఢిల్లీ :** ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి చరిత్ర సృష్టించిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా తన అంతరిక్షయానం గురించి ప్రధానికి వివరించారు. మోదీ శుక్లాను ఆలింగనం చేసుకొని అభినందించారు. ఆయన సాధించిన విజయాన్ని ప్రశంసించారు. అనంతరం శుక్లా తన అంతరిక్ష ప్రయాణం, అనుభవాలను మోదీకి చెప్పారు. శుక్లా ఆదివారం భారత్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, ఇస్రో చీఫ్ వీ నారాయణన్ సహా పెద్ద సంఖ్యలో జనం శుభాన్షు శుక్లాకు స్వాగతం తెలిపేందుకు వచ్చారు. శుక్లా భార్య కామ్నా, కుమారుడు కియాష్ సైతం విమానాశ్రయానికి వచ్చారు. దాదాపు ఏడాది తర్వాత శుభాన్షు భారత్‌కు వచ్చాడు. ఐఎస్‌ఎస్‌ఐకు వెళ్లేందుకు అమెరికాలోనే దాదాపు ఏడాది పాటు శిక్షణ పొందాడు.

# చట్టసభల్లో బిసిలకు 50% రిజర్వేషన్లు తేవాలి

కేంద్రానికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బిసిల భారీ ప్రదర్శన



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి, చట్ట సభలలో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖ తేవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు , ఎంపి ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన వందలాది మంది సర్పంచ్‌లు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, బిసి సంఘాల నేతలు శ్రేణులు పెద్ద ఎత్తున నినదిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ దర్నాకు వివిధ పార్టీల ఎంపిలు మద్దతుతో పాటు తమ సంఘీభావం తెలిపారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ బిసిలకు రాజ్యాధికారంలో వాటా పంచాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణనకు చేపట్టనుండటం హర్షణీయమని, ఇది 76 ఏండ్ల దేశ చరిత్రలోనే రికార్డు అని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కులగణన తర్వాత బిసిలకు జనాభా ప్రకారం సామాజిక, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా దక్కుతుందన్నారు. బిసిలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు కల్పనపై సానుకూల నిర్ణయాలు తీసుకొంటారనే ఆశాభావం ఆయన వ్యక్తంచేశారు. బిసిల అభివృద్ధికి ప్రత్యేక స్కీంలు రూపొందించాలని కోరారు. బిసిలకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లతో బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి ఎంపి పాకా సత్యనారాయణ, బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, విద్యార్థి సంఘం కన్వీనర్ పగిళ్ల సతీశ్, మణికంఠ, రాజు నేత, మోదీ రాందేవ్, పృథ్విగౌడ్, లింగం ముదిరాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ నాయకులు భూపతి సురేష్ మృతి తీరనిలోటు



సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా

**ప్రజాపక్షం, సరూర్‌నగర్/కాప్రా:** భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) సీనియర్ నాయకులు భూపతి సురేష్ మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ రాజ్యసభ సభ్యులు 'సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. సోమవారం నాగోల్ జైపురికాలనీలోని సురేష్ నివాసానికి చేరుకున్న అజీజ్‌పాషా నాయకులతో కలిసి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోల్ ఉమ్మడి జైపురికాలనీ ఫేస్ 1 శాఖ కార్యదర్శిగా నాలుగు పర్యాయాలుగా, ఉప్పల మండల కౌన్సిల్ సభ్యులుగా రెండు సార్లు పని చేయాడమే కాకుండా తన హయాంలో జైపురికాలనీలో పేదలకు ఇండ్ల నిర్మాణ కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. దాదాపు 35 సంవత్సరాలుగా పార్టీలో అనేక ఆటుపోటులను ఎదుర్కుంటూ చివ రి క్షణం వరకు అనేక పార్టీ కోసం పోరాటాలు చే శారని, ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివ ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చ ల్ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, శాఖ కార్యదర్శి, మండల సహాయ కార్యధర్శి ఎం.డి. బషీర్, జి. రాజు, మల్లయ్య, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, జి. కృష్ణ, బి.అశోక్, మణెమ్మ, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కామ్రేడ్ భూపతి సురేష్ అకాల మరణం పార్టీకి తీరని లోటు : సత్యప్రసాద్

సిపిఐ సీనియర్ నేత, జైపురి కాలని శాఖ పూర్వ కార్యదర్శి భూపతి సురేష్ అనారోగ్యంతో ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దర్మేంద్రలు అన్నారు. సోమవారం సత్యప్రసాద్ భూపతి సురేష్ నివాసానికి వెళ్లి వారు పార్థీవ దేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## విద్యాశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కాల పరిమితి మరో ఏడాది పెంపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్‌లో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న 173 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అలాగే స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ ,ట్రైనింగ్ లో వివిధ కేటగిరీలలో మొత్తం 239 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కాలపరిమితిని మరో ఏడాదిపాటు పెంచారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. వీరి కాల పరిమితిని ఏప్రిల్ 1,2025 నుంచి మార్చి 31,2026 వరకు పొడిగించారు.

## స్వయం ఉపాధితో యువత అభివృద్ధి చెందాలి : నెల్లికంటి



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యువకులకు సూచించారు.సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఖానాపూర్ క్రాస్ రొడ్డు సమిపంలో రాజన్న ఫ్యామిలీ రెస్టోరెంట్‌ను సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథులుగా హజరై నూతనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకొని నీల శివరాజ్ గౌడ్, చెరుపల్లి నాగరాజులు స్వయంగా పెట్టుబడి పెట్టి వ్యాపారం చేయటం అభినందనీయమన్నారు. రెస్టోరెంట్ నిర్వహించి లాభాలు అర్జించటం కోసం చేస్తున్న ప్రయాత్నానికి తమ వంతు సహాయ సహకరాలు నిరంతరం ఉంటాయని అన్నారు.అనంతరం రెస్టోరెంట్ నిర్వహాకులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, అభిషేక్ రెడ్డిలకు పుష్ప గుచ్చం అందచేసి సాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే తనయుడు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మాదగోని జంగయ్య గౌడ్,వెంకటేష్ యాదవ్, బుగ్గరాములు, లింగం గౌడ్, యాదగిరి,సిపిఐ నాయకులు కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## బిసి రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదించాలి

ఆప్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి, నేతల అరెస్టు




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదించి,రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీన్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆప్ అధ్వర్యంలో 'చలో రాజభవన్' కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆప్ శ్రేణులు ప్లకార్డులు చేబూని రాజ్‌భవన్‌వైపు దూసుకెళ్లగా పోలీసులు అడ్డుకొని, అరెస్టు చేసి, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిసి బిల్లులను గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించడమైందన్నారు. కానీ, కేంద్రం కానీ, రాష్ట్రపతి కానీ స్పందించకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ఎంపిలు దీనిపై పార్లమెంట్‌లో ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే, రాష్ట్రంలో భూకంపం సృష్టిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆప్ నేతలు ఎండి. మజీద్, డా.అన్సారీ, అబ్దుల్ ముక్తధీర్, జావేద్ షరీఫ్, సుధారాణి, రమ్యగౌడ్, జె.నాగరాజు, రాకేశ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'భీమ్ పేమెంట్స్' యాప్‌లో గోల్డెన్ వీక్ పోటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎన్‌పిసిఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్బీఎస్ఎల్ ) రూపొందించిన భీమ్ యాప్ తమ డిజిటల్ చెల్లింపుల వ్యాప్తిని మరింత విస్తరించేందుకు గేమ్‌షో' కౌన్ బనేగా కరోడ్‌పతి' (కెబిసి) ద్వారా సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌తో భాగస్వామ్యం చేసుకున్నామని ఎన్.బి.ఎస్.ఎల్ ప్రతినిధి లలితా నటరాజ్ తెలిపారు. భీమ్ పేమెంట్స్ యాప్ వినియోగదారుల కోసం మాత్రమే, సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్ తొలిసారిగా ప్రత్యేక వారపతిప్ కేబీసీ ని అందిస్తోందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'గోల్డెన్ వీక్' రిజిస్ట్రేషన్‌ను సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10 వరకు, ప్రత్యేకంగా భీమ్ పేమెంట్స్ యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుందని వివరించారు. ఇందులో పది మంది పోటీదారులను ఎంపిక చేసి, వారికి కెబిసి సెట్‌లోకి వచ్చి అమితాబ్ బచ్చన్‌తో గేమ్ ఆడే గోల్డెన్ ఎంట్రీ లభిస్తుందని పేర్కొన్నారు. దీని కోసం భీమ్ పేమెంట్స్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, యాప్‌లోని ప్రత్యేక 'కె బిసి గోల్డెన్ వీక్ విత్ భీమ్' సెక్షన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

## రాంనగర్‌లో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి కార్యక్రమాన్ని ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ గౌడ సంఘం నాయకులు భిక్షపతి గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, జంగయ్య గౌడ్, లక్ష్మ ణ్ గౌడ్, మహేందర్ గౌడ్, బాబు గౌడ్, శివనంద్ గౌడ్, శివకుమార్ గౌడ్, శ్రీను గౌడ్, బాల్‌మల్లేష్ గౌడ్, ముత్యాలు గౌడ్, రామకృష్ణ గౌడ్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జలమండలిలో కారుణ్య నియామకాలు

బాధిత కుటుంబాలకు న్యాయం చేయండి

అధిక పని చేసిన ఉద్యోగులకు ఓటి చెల్లించాలి

ఎండికి కార్మిక సంఘాల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టి బాధిత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సి. సతీష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హైదరాబాద్ వాటర్ వర్క్స్, సీవరేజ్ కామ్‌గార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కల్లెం రాజ్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. హైదరాబాద్ జలమండలి కార్యాలయంలో సోమవారం జలమండలి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. కారుణ్య నియామకాల విషయంలో సర్క్యులర్లలో సూచించిన విధంగా బాధిత కుటుంబానికి తక్షణ ఉపశమనం అందించడానికి దరఖాస్తు సమర్పించిన పది పని దినాలలోపు కారుణ్య నియామక ప్రతిపాదనను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, మరణించిన ఉద్యోగులపై ఆధారపడిన వారిని నియమించాలని నియామక అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎన్‌పిఎస్ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ గ్రాట్యూటి, డెత్ గ్రాట్యూటి వెంటనే అందజేయాలని, అధిక పని చేసిన ఉద్యోగులకు ఓవర్ టైమ్ అలవెన్స్ చెల్లించాలని, డైలీ వేజ్ ఉద్యోగులకు ఎస్‌ఎస్‌ఆర్ రేట్స్ ప్రకారం వేతనాలు చెల్లించి ఈఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి యాజమాన్యంతో పరిష్కారం కాని కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు అల్లి శ్రవాన్ కుమార్, ఎండి.జాంగిర్, బి.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18 నుండి నవంబర్ 17 వరకు విజిలెన్స్ అవగాహన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఈ నెల 18 నుంచి నవంబర్ 17 వరకు నెల రోజుల పాటు విజిలెన్స్ అవగాహనపై ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజైన సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో అధికారులతో కలిసి రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతకై తీసుకోవలసిన చర్యలపై సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా షార్ట్‌కట్ మెథడ్స్ లను పూర్తిగా నివారించాలని అధికారులకు ఆయన సూచించారు. రైళ్లు సజావుగా నడపడానికి జోన్ వ్యాప్తంగా చేపట్టిన భద్రతా డ్రైవ్‌లను ఆయన సమీక్షించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి సరైన సమయం, విరామంలో సరైన విశ్రాంతి అందించడంపై దృష్టి సారించి ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ చేతనా నంద్ సింగ్, ఈ నెల 18 నుండి నవంబర్ 17 వరకు జోన్ చేపడుతున్న విజిలెన్స్ అవగాహన ప్రచారంపై క్లుప్తంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రచార సమయంలో దృష్టి సారించవలసిన వివిధ అంశాలను ఆయన వివరించారు. ఈ సమీక్షాసమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు మరియు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డిఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల నిరసనల మధ్య ఓడరేవుల బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ:** భారత ఓడ రేవుల బిల్లు–2025కు రాజ్యసభ సోమవారం ఆమోదం తెలియజేసింది. ఓడరేవులకు సంబంధించిన చట్టాన్ని ఈ బిల్లు ఆమోదం ద్వారా సమీకృతం చేసింది. ఈనెల 12వ తేదీన ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. బీహార్‌లో చేస్తున్న ఓటర్ల జాబితాల అక్రమ సమీక్షకు వ్యతిరేకంగా రాజ్యసభలో ప్రతిపక్షాల తీవ్ర నిరసనలమధ్య ఈ బిల్లు ఆమోదం పొందింది. ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాల ఎంపీలు రాజ్యసభ నుండి వాకౌట్ చేశారు. ఈ బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర రేవులు, నౌకలు, జల రవాణామంత్రి సర్బనంద సోనోవాల్ సమాధానం చెబుతూ, కాంగ్రెస్ ప్రభుత్వకాలంలో 2004 నుండి 2014 వరకూ పది సంవత్సరాలపాటు ఈ మంత్రిత్వశాఖ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ఈ మంత్రిత్వశాఖ ద్వారా ఒకేఒక్క కొత్త బిల్లును కాంగ్రెస్ ఆమోదించిందన్నారు. శాసనపరమైన సంస్కరణలు తీసుకురావాలన్న ఆలోచనే కాంగ్రెస్‌పార్టీకి లేదని అన్నారు. ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేసి వెళ్ళిపోవడంపై మంత్రి తీవ్రంగా మండిపడుతూ, కాంగ్రెస్‌పార్టీ, వా రి మిత్రపక్షాలు జాతిపట్ల కనీస గౌరవ సంస్కారాన్ని పెంపొంచుకోవాలని, ఎందుకంటే వారు కూడా ఈ దేశంలో పౌరులుగా ఉన్నారన్నారు.

## సెప్టెంబర్ 9 నుంచి ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ -2025

ఆతిథ్యం ఇస్తున్న తెలంగాణ జైళ్ల శాఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్2025 హైదరాబాద్‌లో సెప్టెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్యమిశ్ర తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌ఐసిఎ)లో జరిగిన ఈ సమావేశంలో అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌ను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ ఆతిథ్యం ఇస్తుందని సౌమ్యామిశ్ర తెలిపారు. ఈ మేరకు డ్యూటీమీట్‌ను విజయవంతం చేసేందుకు అధికారులతో సౌమ్యమిశ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం, క్రీడల పోటీలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఇప్పటివరకు 22 రాష్ట్రాలు పాల్గొనడాన్ని అంగీకరించాయని, వీటిలో 13 రాష్ట్రాలు ఇప్పటికే డ్యూటీమీట్‌లో పాల్గొనే క్రీడాకారుల పేర్ల జాబితాను తమకు అందించారన్నారు.ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 1200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజిలు రాజేష్,ఎన్.మురళీ, డిఐజిలు డాక్టర్ డి.శ్రీనివాస్, ఎం. సంపత్‌తో పాటు జైళ్ల శాఖకు చెందిన రిటైర్డ్ సీనియర్ అధికారులు, సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు పాల్గొన్నారు.




# జిఎస్‌టిలో కేంద్ర రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం

ఆదాయం సమాన పంపిణీ

**న్యూఢిల్లీ:** వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)లో కేంద్ర రాష్ట్రాలు సమాన భాగస్వాములుగా ఉంటాయని, ఈ రెండు ఆదాయాన్ని సమానంగా పంచుకుంటాయని ప్రభుత్వ వర్గాలు సోమవారం చెప్పాయి. రెండు శ్లాబుల విధానం ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వం తదుపరి జనరల్ జిఎస్‌టిలో అనుసరించే మధ్యతరగతి అనుకూలత ఆదాయంపై చూపించే ప్రభావం గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతున్న తరుణంలో ఈ ఆదాయాన్ని కేంద్రం, రాష్ట్రాలలో ప్రభుత్వాలు సమానంగా పంచుకుంటాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రాబోయేకాలంలో భారీగా వినియోగం పెరగుతుందని, అందువల్ల ఆదాయాలు కూడా గణనీయంగా పెరుగుతాయన్న అంచనాలతో ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది. ఇప్పటి వరకూ జిఎస్‌టిలో నాలుగు శ్లాబులు (5,12,18,28 శాతాలు) ఉన్నాయి. కొత్త విధానం అమలులోకి వస్తే రెండు శ్లాబులు (5 శాతం, 18 శాతం) మాత్రమే ఉంటాయి. ప్రజల ఆరోగ్యానికి, సమాజ మనుగడకు హాని కలిగించేవాటిపై 40 శాతం శ్లాబు విధిస్తారు. దీపావళినాటికి ఈ కొత్త శ్లాబులు అమలులోకి వస్తాయని అంచనావేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వస్తుసేవల పన్ను విధానం ప్రకారం, కేంద్ర రాష్ట్రాలు సమాన భాగస్వాములుగా ఉన్నాయి. అదనంగా 41 శాతం కేంద్రం వాటాను ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రాలకు పంచుతున్నది. ''జిఎస్‌టిలో ఏం వసూలు జరుగుతోంది, ఎంత వసూలు చేయాలనే విషయంపై కేంద్రానికి కూడా సమాన ఆందోళన, ఆలోచన ఉంటుంది. జిఎస్‌టి మండలి సభ్యులుగా కేంద్రం, రాష్ట్రాలు ఇందులో సమాన భాగస్వాములు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒక దాతస్థానంలో కూర్చుని రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించడం ఎంతవరకూ సబబు?'' అని ప్రభుత్వ వర్గాలు ప్రశ్నించాయిఇ. ప్రస్తుతం జిఎస్‌టిలో నాలుగు శ్లాబులున్నాయి. ఆహారం, నిత్యావసర వస్తువులపై పన్నులు వేస్తారు, లేదా అస్సలు వేయరు, లేదా ఐదుశాతం వేస్తారు, లగ్జరీ, వస్తువులు, హాని కలిగించే వస్తువులపై ప్రస్తుతం 28 శాతం శ్లాబు విధించారు. ఐదుశాతం శ్లాబు అంటే మొత్తం జిఎస్‌టి ఆదాయంలో ఏడు శాతం కాగా, 18 శాతం శ్లాబు అంటే జిఎస్‌టి మొత్తం ఆదాయంలో 65 శాతం. అంటే జిఎస్‌టి ఆదాయంలో 12 శాతం, 28శాతం శ్లాబులు వరుసగా 5 శాతం, 11 శాతం వాటా ఇస్తాయి. ఇ Zకమీదట రెండు శ్లాబులు అమలు చేస్తారు. ప్రామాణికతగల వస్తువులు, సేవలకు ఈ శ్లాబులు వర్తిస్తాయి.

ప్రస్తుతం రాష్ట్రాలకు భూమి, పెట్రోలియం ఉత్పత్తులపైన ప్రత్యేకంగా పన్నులు విధించే హక్కులున్నాయి. కేంద్రం కూడా ప్రత్యేక సహాయ పథకం కింద మూలధన వ్యయాలకింద రాష్ట్రాలకు 50 సంవత్సరాలు వడ్డీలేని రుణాలు ఇస్తోంది. దీంతోపాటు విద్య, ఆరోగ్య సుంకాలు, ఇతర సుంకాలను కేంద్రం వసూలు చేసుకుంటోంది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ అవసరాల నిమిత్తం వీటిని ఫండింగ్ చేస్తుంది. నష్టపరిహార సుంకం మొత్తం రాష్ట్రాలకే చెందుతోంది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఛత్తీస్‌గఢ్‌లో మందు పాతర పేల్చిన మావోయిస్టులు

### ఒక జవాన్ మృతి, ముగ్గురు జవాన్లకు గాయాలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాల్లో మావోయిస్టులు తెగబడ్డారు. ఇద్రావతి జాతీయ ఉద్యాన వన సమీపంలో మావోయిస్టు కదలికలు ఉన్నట్లు సమాచారం అందడంతో డిఆర్‌జి జవానుల్ ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున కూంబింగ్ మొదలుపెట్టారు. ఆ బలగాలను టార్గెట్‌గా చేసుకుని మావోయిస్టులు శక్తివంతమైన ఐఇడి బాంబులు పేల్చారు. ఈ ఘటనలో దినేష్ నాగ్ అనే జవాన్ అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్గురు జవాన్లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్ తెలిపారు. మావోయిస్టుల కోసం బలగాలు అడవుల్లో పెద్ద ఎత్తున మోహరించాయని, ఆపరేషన్ ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు.

## సంక్లిష్టకాలం దాటి ముందుకు వెళదాం

### చైనా మంత్రి వాంగ్ యీతో జైశంకర్ సమావేశం



**న్యూఢిల్లీ:** సరిహద్దుల సమస్య పరిష్కారానికి చర్చ ల నిమిత్తం చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ భారత్ పర్యటనకు వచ్చారు. సోమవారం న్యూఢిల్లీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈనెలాఖరులో జరిగే షాంఘై సహకార సదస్సు (ఎస్‌సిఓ)లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చైనా పర్యటనకు వెళ్ళే ముందు ఆ దేశ విదేశాంగమంత్రి వాంగ్‌యీ సోమ, మంగళవారాల లో న్యూఢిల్లీలో చేస్తున్న చర్చలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. సరిహద్దు సమస్యపై రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులమధ్య తదుపరి విడత చర్చలు నిర్వహించడానికి అనువైన వాతావరణం సృష్టించేందుకు వాంగ్‌యీ ప్రధానంగా దేశంలో పర్యటిస్తున్నారు. సరిహద్దుల సమస్య పరిష్కారంపై చర్చ లు జరిపేందుకు వాంగ్ యీ–అజిత్ దోవల్ ఇద్దరూ చైనా, భారత్‌ల తరపున ప్రత్యేక ప్రతనిధులుగా నియమితులయ్యారు. తొలుత వాంగ్ యీ తో విదేశాంగమంత్రి జైశంకర్ సమావేశమయ్యా రు. ఆయనకు ఆహ్వానం పలుకుతూ సంక్లిష్టమైన కాలాన్ని దాటుకుని ముందుకు ప్రయాణం చేయాలని రెండు దేశాలూ కోరుకుంటున్నాయని జైశంకర్ అన్నారు. రెండు దేశాలమధ్యా ఉన్న విభేదాలు వివాదాలుగా మారకూడదని ఆయన ఉద్ఘాటి స్తూ, సంబంధాలలో సంక్లిష్టమైన కాలాన్ని చూసిన తర్వాత దానిని దాటుకుని రెండు దేశాలూ ముం దుకు ప్రయాణం చేయాలని కోరుకుంటున్నాయన్నారు. ఇందుకోసం రెండు వైపుల నుండీ స్వచ్ఛమైన, నిష్కపటమైన, నిర్మాణాత్మకమైన వైఖరిని ప్రదర్శించాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకతను జైశంకర్ ప్రముఖంగా ఈచర్చల్లో ప్రస్తావించారు. 2020లో గా ల్వన్ లోయలో రెండు దేశాలమధ్యా ప్రాణాంతకమైన ఘర్షణలు జరిగిన తర్వాత సంబంధాల పునరుద్ధరణకు జరుగుతున్న కృషిలో భాగంగా చైనామంత్రి వాంగ్‌యీ భారత్‌లో పర్యటిస్తున్నారు.

### జవానుల అమరత్వాన్ని అవమానిస్తున్నారు




మూడు నెలల క్రితమే ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు ఆయుధ వ్యవస్థ, నిఘా సమాచారాన్ని అందజేసిన చైనా దేశ విదేశాంగ మంత్రి రావడం పట్ల కేంద్రప్రభుత్వాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ నిలదీశారు. ఇప్పటికే గల్వాన్ అంశంపై చైనాకు ప్రధాని నరేంద్రమోదీ క్లీన్‌చిట్ ఇవ్వడం ద్వారా అక్కడ అమరులైన 200 మంది జవానుల అమరత్వాన్ని అవమానించారన్నారు. ''కేవలం మూడు నెలల క్రితం ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా ఆయుధ, నిఘా సాయం అందజేసినట్లు , జె–106 సైనిక విమానాలు, పిఎల్ –15 ఆకాశం నుంచి ఆకాశంలో ప్రయోగించే మిస్సైల్స్‌ను సరఫరా చేసిందని భారత డిప్యూటీ ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ చెప్పారని జైరామ్ రమేశ్ తన'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

## మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా అవకతవకలు

### విఎఫ్‌డి స్వతంత్ర నివేదిక వెల్లడి

**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీకి గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో భారీగా అవకతకలు చోటు చేసుకున్నట్టు 'ఓట్ ఫర్ డెమోక్రసీ' (విఎఫ్‌డి) అనే స్వతంత్ర సంస్థ తన నివేదికలో పేర్కొంది. అసెంబ్లీలోని 288 నియోజకవర్గాలకు సంబంధించిన వివరాలను ఆ నివేదికలో అందించింది. 'భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) వైఫల్యాలు, ఎన్నికల ఆయుధీకరణ' అనే అంశంపై అధ్యయనం చేసిన ఈ నివేదిక, పలు అంశాలను ప్రస్తావించింది. ఎన్నికల కమిషన్, ప్రధాన ఎన్నికల అధికారి, పోలింగ్ సిబ్బందితోపాటు ఓటర్ల నుంచి కూడా సేకరించిన డేటాను పరిశీలించిన తర్వాత, పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్టు తెలిపింది. విఎఫ్‌డిలో కీలకంగా వ్యవహరిస్తున్న సిటిజెన్స్ కమిషన్ ఆన్ ఎలక్షన్స్ కోఆర్డినేటర్, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎంజి దేవసహాయం, పంజాబ్ యూనివర్సిటీ మాజీ డీన్ ప్యారా లాల్ గార్గ్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ నిపుణుడు మాధవ్ దేశ్‌పాండే, కాన్పూర్ ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ హరీష్ కార్నిక్ నేతృత్వంలో జరిగిన అధ్యయనం ప్రకారం, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, పోలింగ్ చివరి క్షణాల్లో హఠాత్తుగా బూత్‌ల వద్ద ఓటర్ల సంఖ్య పెరిగింది. ఆ రోజు సాయంత్రం 5 గంటల వరకూ జరిగిన పోలింగ్ 58.22 శాతం మాత్రమే. కానీ, అకస్మాత్తుగా ఓటర్లు బూత్‌ల వద్ద బారులుతీరగా, అర్ధరాత్రి వరకు 66.05 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే 7.83 శాతం పెరుగుదల నమోదైంది. సుమారు 48 లక్షల మంది ఓటర్లు సాయంత్రం ఐదు గంటల తర్వాత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఆకస్మిక పెరుగుదల నాందేడ్, జల్గావ్, హింగోలీ, షోలాపూర్, బీడ్, ధులే ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించింది. అంతకు ముందు జరిగిన ఎన్నికల పోలింగ్ సరళితో పోలిస్తే, చివరి క్షణాల్లో ఇంతటి పెరుగుదల ఎన్నడూ నమోదుకాలేదని స్పష్టమవుతుంది. కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద సాయంత్రం 5 గంటల తర్వాత 600లకు పైగా ఓటర్లు క్యూకట్టారు. దీనితో పోలింగ్ అదనంగా మరో 10 గంటలు కొనసాగింది. అంతకు ముందు ఎన్నడూ ఆ స్థాయిలో పోలింగ్ సమయాన్ని పొడిగించాల్సిన అవసరం రాలేదు. కాగా, మరో కీలక అంశాన్ని కూడా ఈ నివేదిక ప్రస్తావించింది. సుమారు 25 నియోజకవర్గాల్లో, 3000 లేదా అంతకంటే తక్కువ ఓట్ల తేడాతోనే జయాపజయాలు ఖరారయ్యారు. 60 నియోజకవర్గాల్లో ఈ తేడా 10,000 వరకూ ఉంది. విజయాలను తెచ్చిపెట్టిన ఈ తేడాను చివరి క్షణాల్లో పెరిగిన ఓటర్ల సంఖ్య ప్రభావంగా పేర్కొవచ్చు. 2024 మే మాసంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే, అదే ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి ఒక్కసారిగా 46 లక్షలకుపైగా ఓట్లు పెరిగాయి. ఈ భారీ తేడా 85 నియోజకవర్గాల్లో, 12,000 పోలింగ్ బూత్‌ల పరిధిలో కనిపించింది. ఇవన్నీ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి పరాజయం ఎదుర్కొన్న ప్రాంతాలే కావడం గమనార్హం.

ఇది ఇలావుంటే, కేంద్ర ఎన్నికల కమిషన్, మహారాష్ట్ర చీఫ్ ఎలక్షన్ అధికారి (సిఇఒ) వెల్లడించిన లెక్కలు వేరువేరుగా ఉన్నాయి. 2024 ఆగస్టు 30వ తేదీ నాటికి 9.64 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించగా, అదే తేదీ నాటికి 9.53 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని మహారాష్ట్ర సిఇఒ పేర్కొన్నారు. కొన్ని వారాల్లోనే ఈ లెక్కలు కూడా భారీగా మారిపోయాయి. 2024 అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 30వ తేదీ మధ్యకాలంలో ఏకంగా 16 లక్షల ఓటర్లు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. కాగా, అస్మాత్తుగానేగాక, అసమానంగా పెరిగిన ఓట్ల శాతం కొన్ని పార్టీలకు లాభాన్ని చేకూర్చిన అంశాన్ని కూడా ఈ నివేదిక గుర్తించింది. లోక్‌సభ ఎన్నికల్లో, ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌లో బిజెపికి సగటున 88,713 ఓట్లు లభించాయి.





అసెంబ్లీ ఎన్నికల సమయానికి, ఒక్కో సెగ్మెంట్ సగటు ఓట్లు 1,16,064కు పెరిగింది. అంటే సగటున ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపికి సుమారు 28,000 ఓట్లు అదనంగా లభించాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్యకాలంలో జనాభా వృద్ధి ఆ స్థాయిలో లేదనే విషయాన్ని ఇక్కడ గుర్తించాలి. కామ్తీ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓట్లు సుమారు 1.35 లక్షలు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య పెద్ద తేడా లేదు. కానీ, బిజెపి మాత్రం ఏకంగా 56,000 ఓట్లు అదనంగా సంపాదించుకుంది. అదే విధంగా కరాద్ (ఈస్ట్)లో బిజెపికి 41,000 ఓట్లు అదనంగా లభించాయి. గత ఐదేళ్లలో ఆ పార్టీ ఇంతగా ఎప్పుడూ లాభపడలేదు.

సాంకేతికపరమైన వైఫల్యాలు, పోలింగ్ స్టేషన్ల సమీపంలో రూటర్లు, కౌంటింగ్ సమయంలో హఠాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, స్ట్రాంగ్ రూమ్‌లకు ఇవిఎంలు ఆలస్యంగా చేరుకోవడం, సిసిటివి వ్యవస్థ పనిచేయకపోవడం వంటి అంశాలను కూడా ఈ నివేదిక ప్రస్తావిస్తూ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చోటు చేసుకున్న అవకతవకలను ఎండగట్టింది.

## ఉభయసభల్లోనూ నిరసన వెల్లువ

### ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చ చేపట్టాల్సిందేనని పట్టుబట్టిన ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఐదు రోజుల విరామం అనంతరం సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. అయితే బిహార్‌లో ఇసి చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చ చేపట్టాల్సిందేనంటూ ప్రతిపక్ష ఎంపిలు తమ పట్టు వీడలేదు. ఇతర అంశాలపైనా చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ఉభయసభల్లోనూ ఆందోళనకు దిగారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభలో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజ్యసభలో వాయిదా తీర్మానాలు డిప్యూటీ చైర్మన్ తిరస్కరించడంతో విపక్ష సభ్యులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఉభయసభలను స్పీకర్, డిప్యూటీ చైర్మన్ మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. లోక్‌సభ మధ్యాహ్నం తిరిగి సమావేశమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు 'ఓటు చోర్, గద్దీ చోడ్ (ఓటు దొంగ, కుర్చీని ఖాళీ చేయండి) అనే నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ఈ క్రమంలోనే చైర్‌పర్సన్‌గా ఉన్న బిజెపి సభ్యురాలు సంధ్యా రాయ్ పార్లమెంటరీ పత్రాలను సమర్పించడానికి, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతించారు. జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును సెలెక్ట్ కమిటీకి సూచించాలనే తీర్మానాన్ని లోక్‌సభ విపక్ష సభ్యుల కోలాహలం మధ్య ఆమోదించింది. అంతకు ముందు, ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు, కాంగ్రెస్ సభ్యులు సహా ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు చేస్తూ, బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియపైచర్చ కోసం తమ డిమాండ్‌తో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. స్పీకర్ ఓం బిర్లా సభా కార్యకలాపాలను ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించడానికి ప్రయత్నించారు. కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలకు సంబంధించిన ఆరు ప్రశ్నలు అడగడానికి సభ్యులు అనుమతించారు. సుమారు 15 నిమిషాల కార్యకలాపాల తర్వాత, స్పీకర్ నిరసన తెలుపుతున్న సభ్యులను వారి సీట్లకు తిరిగి వెళ్లమని కోరారు. ప్రభుత్వ ఆస్తులను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ప్రతిపక్ష ఎంపిలు తన విన్నపాలను పట్టించుకోకపోవడంతో, స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

### రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యుల వాకౌట్

రాజ్యసభలో వివిధ అంశాలపై ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 19 వాయిదా నోటీసులను తిరస్కరించడంపై ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేయడంతో సోమవారం రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైన వెంటనే, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నాగాలాండ్ మాజీ గవర్నర్ లా గణేషన్‌ను ఉద్దేశించి సంతాప సందేశం ఇచ్చారు. ఆ తర్వాత జాబితాను సభ్యుల ముందుంచారు. నియమం 267 కింద నాలుగు అంశాలపై 19 నోటీసులు వచ్చాయని డిప్యూటీ చైర్మన్ చెప్పారు. 11 నోటీసులలో సరైన నిబంధనలతో కూడిన తీర్మానం లేదని, 10 నోటీసులలో తేదీని ప్రస్తావించలేదని, 11 నోటీసులలో సభ్యులు సస్పెండ చేయాలని కోరుకునే నియమాలు లేవని, 13 నోటీసులలో 'సబ్‌జుడీకి సంబంధించిన విషయం'పై చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నారని ఆయన అన్నారు. ఏవీ నిబంధనల అవసరాలకు అనుగుణంగా లేనందున, ఏ నోటీసులను అంగీకరించడం లేదని ప్రకటించారు. హరివంశ్ తర్వాత జాబితా చేయబడిన జీరో అవర్‌ను చేపట్టడానికి ప్రయత్నించారు.

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ అంశంపై చర్చకు డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష ఎంపిలు, వివిధ అంశాలపై తాము ఇచ్చిన 19 వాయిదా నోటీసులను చైర్ తిరస్కరించడాన్ని నిరసిస్తూ లేచి నిలబడ్డారు. డిప్యూటీ చైర్మన్ నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులను సభను పనిచేయనివ్వాలని కోరారు. అయితే, ప్రతిపక్షం ఊరుకోకపోవడంతో, మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు చైర్మన్‌గా ఉన్న బిజెడి సభ్యుడు సస్మిత్ పాత్రా, గనులు, ఖనిజాలు (అభివృద్ధి మరియు నియంత్రణ) సవరణ బిల్లు, 2025పై చర్చకు వ్యాపార సలహా కమిటీ మూడు గంటలు కేటాయించాలని నిర్ణయించిందని శాసనసభ్యులకు తెలియజేశారు. లోక్‌సభ ఆమోదించిన తర్వాత, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2025 పరిశీలన, ఆమోదం కోసం కమిటీ ఒక గంట సమయం ఆమోదించిందని కూడా ఆయన అన్నారు. ఆ తర్వాత సభలో జాబితా చేయబడిన ఎజెండాలో ప్రస్తావించబడిన ఇండియన్ పోర్టుల బిల్లు, 2025ను ప్రవేశపెట్టాలని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్‌ను పాత్రా కోరారు. సోనోవాల్ ఆ తర్వాత గందరగోళం మధ్య బిల్లును ప్రవేశపెట్టారు. ఇంతలో, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే లేచి నిలబడి బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ((ఎస్‌ఐఆర్)పై చర్చకు డిమాండ్ చేశారు. ఈ అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ ఇతర ప్రతిపక్ష సభ్యులు కూడా ఆయనతో పాటు వచ్చారు. అయితే, ఈ విషయాన్ని చేపట్టడానికి చైర్ నిరాకరించారు. దీనితో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. చర్చకు డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూ సభలో వాకౌట్ చేశారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ 'ఓట్ చోరీ'కి కొత్త ఆయుధం

### ఎక్స్‌లో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ 'ఓట్ చోరీ'కి కొత్త ఆయుధమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. 'ఒక వ్యక్తి, ఒక ఓటు' సూత్రాన్ని పరిరక్షిస్తానమని ప్రతిజ్ఞ చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన వ్యక్తులతో సమావేశంపై రాహుల్ మాట్లాడుతూ ఆయన తన వాట్సాప్ ఛానెల్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఆదివారం బిహార్‌లోని ససారంలో ఓటు అధికార్ యాత్రను ప్రారంభించిన సందర్భంగా గాంధీ ఆ బృందాన్ని కలిశారు. సమావేశ ఫొటోలను రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సర్' అనేది ఓటు దొంగతనానికి కొత్త ఆయుదమమన్నారు. ఫొటోలో తనతో పాటు నిలబడి ఉన్న వ్యక్తుల ఓట్లు దొంగతనానికి గురయ్యానడానికి వీరే సజవ రుజువు అని ఆయన ఎక్స్‌లో రాసుకోచ్చారు. వీరందరూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు వేశారని, అయితే బిహార్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే సమయానికి, వారి గుర్తింపు, వారి ఉనికి భారత ప్రజాస్వామ్యం నుండి తుడిచిపెట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారు 'బహుజనులు', పేదలు అయిన బిజెపి, ఎన్నికల కమిషన్ కుట్ర పన్ని వారిని శిక్షిస్తోందని, మన సైనికులను కూడా వదిలిపెట్టరని మండిపడ్డారు. వారికి ఓటు ఉండదు, గుర్తింపు లేదా హక్కులూ ఉండవు అని ఆయన అన్నారు. సామాజిక వివక్ష, ఆర్థిక పరిస్థితుల కారణంగా వారు వ్యవస్థ కుట్రకు వ్యతిరేకంగా పోరాడలేకపోతున్నారన్నారు. 'ఒక వ్యక్తి, ఒక ఓటు' అనే అత్యంత ప్రాథమిక హక్కును కాపాడటానికి తాము వారికి అండగా నిలబడతామన్నారు. ఇది హక్కులకు, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యానికి సంబంధించిన ప్రశ్న అని ఆయన అన్నారు, తాము దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంతం కానియ్యబోమన్నారు.

## డిలీట్టైన ఓటర్ల పేర్లు వెల్లడించిన ఇసి

**పాట్నా :** బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ కింద 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించిన విషయం తెలిసిందే. అయితే ఆ 65 లక్షల మంది ఓటర్ల పేర్లను సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ ఓటర్ల జాబితాను రిలీజ్ చేశారు. ఆగస్టు 19వ తేదీలోగా డిలీట్ అయిన పేర్లను వెల్లడించాలని సుప్రీం ఆదేశించింది. ఆగస్టు 22వ తేదీలోగా ఆ నివేదికను కోర్టు ముందు సమర్పించాలని సుప్రీం పేర్కొన్నది. సవరించిన ఓటర్ల జాబితాలో.. ఆబ్‌సెంట్, షిఫ్ట్, డెడ్ ఓటర్లు ఉన్నారు. ఎఎస్‌డి జాబితాను రోహతాస్, బెగుసురాయి, అర్వాల్ పోలింగ్ బూత్‌ల్లో ప్రదర్శించినట్లు బిహార్ సిఇఒ తెలిపారు.

## 'ఎస్‌ఐఆర్'కు వ్యతిరేకంగా పెరుగుతున్న మద్దతు

### పార్లమెంట్ వద్ద విపక్షాల ఆందోళన : ఓట్ చోర్, గద్దీ చోర్, 'ఓట్ చోరీ బంద్ కరో' అంటూ నినాదాలు




**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా పలు పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. ఈ అంశంపై పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విపక్ష ఎంపిలు రోజుకో రకంగా ఆందోళన నిర్వహిస్తున్నారు. సోమవారం కూడా ఇండియా బ్లాక్ పార్టీలకు చెందిన అనేక మంది ప్రతిపక్ష ఎంపిలు నిరసన తెలిపారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపిలు 'ఓట్ చోర్, గద్దీ చోర్, 'ఓట్ చోరీ బంద్ కరో' అనే నినాదాలు చేశారు. అలాగే 'స్టాప్ ఓటు చోరీ' అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్‌ఐఆర్' అని డిమాండ్ చేస్తూ పోస్టర్‌లను కూడా చేబూనారు. కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, వామపక్ష పార్టీలు, ఆర్‌జెడి, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు పార్లమెంటు మకర్ ద్వార్ వెలుపల పోస్టర్లు, బ్యానర్‌లను పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. వెనుకబడిన వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లను ఎన్నికల కమిషన్ తొలగించిందని ఆరోపిసూ సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు కొందరు తమ నాయకుడు అఖిలేష్ యాదవ్ ఇసికి ఇచ్చిన అఫిడవిట్ కాపీలను కూడా చేబూనారు. 'ఇసిఐ తన రాజ్యాంగ విధి నుంచి తప్పించుకోకూడదు. రాజకీయ పార్టీలు సంధించిన నిజమైన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేయకూడదు. 'ఓటు హక్కు' అనేది భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ఏ ప్రయత్నాన్నైనా భారతదేశం నిరసిస్తుంది' అని ఖర్గే ఎక్స్‌లో ప్రతిపక్ష నిరసన వీడియోను షేర్ చేస్తూ అన్నారు. 'ఓటు హక్కు మనకు రాజ్యాంగం ద్వారా ఇవ్వబడింది. దానిని తొలగించే హక్కు ఎవరికీ లేదు. ఇసిఐ మమ్మల్ని బెదిరిస్తోంది, భయపెడుతోంది. కానీ మేము వారి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు. మేము ప్రజాస్వామ్యం కోసం పోరాడుతూనే ఉంటాము' అని ఆయన మరొక పోస్ట్‌లో అన్నారు.

కాగా, మౌర్య, పాల్, భగేల్, రాథోడ్ వర్గాలతో సహా అనేక వెనుకబడిన వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లను బిజెపికి ప్రయోజనం చేకూర్చడానికి జాబితా నుండి తొలగించారని అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. 'వాస్తవం ఏమిటంటే వారి ఓట్లు తొలగించబడుతున్నాయి. ఎస్‌పి ఇంతకుముందు కూడా ఈ అంశాన్ని లేవనెత్తింది. కానీ వెనుకబడిన తరగతుల ఓట్లను తగ్గించడానికి ఉద్దేశపూర్వకంగా ఇలా జరిగిందని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఈ ఓట్లు వేరే చోటికి వెళ్తున్నాయని అంచనా వేస్తుంది' అని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. తక్కువ తేడాతో ఓడిపోయిన, ఓటర్ల తొలగింపు జరిగిన నియోజకవర్గాలను తమ పార్టీ గుర్తించిందని యాదవ్ పేర్కొన్నారు. దీనిని తాము అతి తక్కువ సమయంలో గుర్తించగలిగామని, కావలసిన ఫార్మాట్‌లో ఓటర్ల జాబితాలు అందితే అలాంటి మరిన్ని కేసులకు సంబంధించిన వివరాలను అందిస్తామన్నారు. 2019లో వేసిన ఓట్లు 2022 నాటికి తొలగించబడ్డాయని, ఓటరు ఐడిని సృష్టించడానికి సరైన విధానం ఉన్నప్పటికీ కానీ దానిని విస్మరిస్తున్నారని ఆయన ఆరోపించారు. తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఆయన చేశారు.

## ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పని ఇసి : సిపిఐ

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాలో అక్రమాలపై భారత ఎన్నికల సంఘం నిర్వహించిన మీడియా సమావేశం తీవ్రంగా నిరుత్సాహపరిచిందని, ప్రతిపక్షా లు లేవనెత్తిన ఏప్రశ్నకూ సమాధానం రాలేదని సిపిఐ రాజ్యసభ సభ్యుడు పి.సందోష్ కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాతో భారీ అక్రమాలు, అవకతవకలు, ఏకపక్ష తొలగింపులు, చేర్పులను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థగా తక్కువగా, భారత పౌరుల పేర్లు తొలగించే వ్యవస్థగా ఎక్కువగా పని చేస్తోందని ఆయన ఒక ప్రకటనలో ఎద్దేవా చేశా రు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే విశ్వాసానికి ద్రోహం చేసిందన్నారు. ఎన్నికల మోసాల స్థాయి దిగ్భ్రాంతి కలిగిస్తుందని, చిన్నగదిలో వందల ఓటర్ల పేర్లను నమోదు చేసిన విషయాలు బిహార్, కర్నాటకలో బైటపడ్డాయని, ఈ సాక్ష్యాలు సరిపోతాయని చెప్పారు. దీనిపై ఎన్నికల సంఘం బాధ్యత తీసుకోవాల్సింది పోయి, ఉద్దేశ్యపూర్వకంగా ఓట్లు తొలిగించే పథకాన్ని చేపట్టిందనేది వాస్తవమని విమర్శించారు. కమిషన్ ద్వంద్వ వైఖ రి స్పష్టంగా కనపబడుతోందని, ప్రతిపక్ష నాయకు డు కర్నాటకలోని అవకతవకలను లేవెనెత్తితే, ప్రమాణపూర్వక అఫిడవిట్ దాఖలు చేయమని అడగటమేమిటని ప్రశ్నించారు. అలాంటి ఆరోపణలే చేసిన బిజెపి నాయకుడిని మాత్రం ఆధారాలను అడగడం లేదన్నారు. ఇది అధికార బిజెపి పట్ల బహిరంగంగా మొగ్గు చూపడమే అవుతోందన్నారు. సిపిఐ సహా ప్రతిపక్షపార్టీలు వేసిన సుప్రీం కోర్టులో పిటిషన్ వేయకపోతే ఏమయ్యేదోనని సందోష్ కుమార్ అన్నారు. ఒక్క బిహార్ రాష్ట్రంలోనే 65 లక్షల పేర్లును ఏకపక్షంగా తొలగించారని, వారికి కనీసం ఎలాంటి నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఇది కేవలం సాంకేతిక లోపాలు కావ ని, పౌరుల నుంచి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను లాగేసుకోవడమే అవుతుందని మండిపడ్డా రు. కేంద్రప్రభుత్వానికి పూర్తిగా నియంత్రణ కలిగే విధంగా ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామక) చట్టం వచ్చాకే 2003 లో ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ నియమితుడైన విషయాన్ని మరిచిపోవద్దన్నారు. ఓటరు జాబితా అక్రమాలను పూర్తిస్థాయిలో బహిర్గితం చేయాలని, తొలగించిన పేర్ల పునరుద్ధరించాలని, పౌరుల



రాజ్యాంగ హక్కులను కాలరాచిన వారి పట్ల జవాబుదారీతనం కావాలని సిపిఐ డిమాండ్ చేస్తోందన్నారు.

### ఓట్ అధికారి యాత్రలో సిపిఐ నేతలు

బిహార్‌లో ''ఒక వ్యక్తి – ఒక ఓటు''ను కోరుతూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సాగుతున్న ''ఓటర్ అధికార్ యాత్ర''లో సిపిఐ తరుపున జాతీయ నాయకులు పాల్గొంటున్నారు. ఆ వివరాలను జాతీయ సమితి సోమవారం వెల్లడించింది. ఈ నెల 17 జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'' ప్రారంభోత్సవానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎంపి పి.సందోశ్ కుమార్ పాల్గొనగా, ఆగస్టు 18, 19తేదీలలో జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్‌బాలచంద్ర కాంగో, 21నుంచి 24వరకు జాతీ య కార్యదర్శి డాక్టర్ గిరీశ్, 26 నుంచి 29వ తేదీ వరకు జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, 29–30 తేదీలలో జాతీయ కార్యదర్శి అన్నీ రాజా పాల్గొంటారు. సెప్టెంబర్ 1వ వతేదీన జరిగే ము గింపు సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారు.

ప్రజాపక్షం
మంగళవారం, 19 ఆగస్టు

# సిఇసి ఎదురుదాడి!

భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కు సారథులుగా వ్యవహరించే ప్రధాన ఎన్నికల అధికారి (సిఇసి), ఇద్దరు కమిషనర్ (ఇసి)ల తటస్థత ఆ రాజ్యాంగ సంస్థ విశ్వసనీయతకు గీటురాయి. అయితే అది రానురాను రాజకీయ పక్షపాతం ఆరోపణలకు గురికావడం దురదృష్టకరం. ఏ ఎన్నికల షెడ్యూలు ప్రకటనకో తప్ప మీడియా ముందుకు రాని సిఇసి, ఓటర్ల జాబితాల్లో బిజెపికి అనుకూలంగా ఓట్ల చేర్పులు లేదా తొలగింపులపై ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సాగిస్తున్న 'ఓటు చోరీ' ఆందోళనకు జవాబు చెప్పటానికి లేదా ఆరోపణలపై వివరణ ఇవ్వటానికి కాకుండా ఎదురుదాడికై ఆదివారం మీడియా సమావేశం నిర్వహించడం అరుదైన విషయం. తమకు రాజకీయపార్టీలన్నీ సమానమేనంటూ, తాము చెప్పేదానికి లేదా చేసేదానికి వ్యతిరేకంగా నోరెత్తరాదన్నట్లుగా రాహుల్‌గాంధీపై ధ్వజమెత్తారు: ''మీరు చేసిన ఆరోపణలపై అఫిడవిట్ దాఖలు చేయాలి, లేదా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఏడు రోజుల్లోగా అఫిడవిట్ ఇవ్వనట్లయితే మీ ఆరోపణలు తప్పు అని భావించాల్సి వస్తుంది''. అని గంభీరమైన సమస్యను తేల్చి పారేశారు. మీడియా సమావేశం ద్వారా ప్రతిపక్ష నాయకునికి సమాధానమివ్వడం, సవాలు విసరడమే తగని పని. అయితే అందుకు ఎంచుకున్న సమయం ప్రశ్నార్థకం. బిహార్ 'ముమ్మర ఓటర్ల రివిజన్' (ఎస్ఐఆర్)ను ప్రశ్నిస్తూ దానిని దళితులు, బడుగు బలహీనవర్గాల ఓట్లు ఏరివేసి పాలక కూటమికి మేలు చేసే చర్యగా రాహుల్‌గాంధీ నాయకత్వంలో 1300 కిలోమీటర్ల 'ఓటర్ అధికార్ యాత్ర' ససారం నుంచి ప్రారంభమవుతుండగా సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఢిల్లీలో మీడియా సమావేశం జరిపి ఆయనపై ఎదురుదాడి చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి బలహీనంగా ఉన్న అనేక నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో దొంగ ఓట్లు చేర్చి, నరేంద్ర మోదీ తిరిగి అధికారంలోకి రావడానికీ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి రావడానికి ఎన్నికల కమిషన్ సహకరించిందనేది రాహుల్ గాంధీ ఆరోపణ. దీన్నే ఆయన 'ఓట్ చోరీ, గద్దీ చోరీ' అన్నారు. కర్ణాటకలో మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో పెరిగిన, పోలైన ఓట్లు బిజెపి గెలుపునకు ఎలా తోడ్పడ్డాయో తమ అధ్యయనాన్ని ఆయన దేశం ముందుంచారు. మహారాష్ట్రలో లోక్‌సభ–అసెంబ్లీ ఎన్నికల మధ్య ఆరు మాసాల వ్యవధిలో 70లక్షల ఓటర్లు ఎలా పెరిగారని ప్రశ్నించారు. ఒకే ఇంటి నెంబర్‌లో, అసలు నెంబర్ లేని ఇంట్లో 70–80 మంది ఓటర్లు ఎలా వచ్చారు, ఓటు చేశారని ప్రశ్నించారు. సాయంత్రం 5 గంటల తర్వాత చాలా బూత్‌లలో పెద్ద ఎత్తున ఓటింగ్ ఎలా జరిగిందని రాహుల్ ప్రశ్నించారు.

వ్యూహాత్మకంగా పోలింగ్ ఏర్పాట్లు చేసే కొందరు నాయకులు, కార్యకర్తలు లేదా ఆర్గనైజ్డ్ సంస్థలు ఒక్కొక్క రాష్ట్రంలో పలు దశల్లో పోలింగ్‌ను తమకు అనుకూలంగా ఉపయోగించుకుని ముందు నుంచే–ఓట్ల చేర్పింపు దశ నుంచే పథకం నడిపి ఉండవచ్చు. ఎన్నికల అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు, తారుమార్లు జరిగే అవకాశం ఉండదు. రాహుల్ గాంధీ కోరిన లేటు ఓటింగ్ సిసిటివి ఫుటేజీ, యంత్రంపై చదవదగిన ఓటింగ్ జాబితాలను సిఇసి 'ఓటర్ల గోప్యత'ను రక్షించడమనే సాంకేతికతతో తిరస్కరించడంలోనే వారి బ్యూరోక్రటిక్ దృక్పథం బయటపడింది. అక్రమాలు జరిగితే మీ పోలింగ్ ఏజెంట్లు ఏం చేస్తున్నారు, చట్ట ప్రకారం గడువులోగా ఎన్నికల పిటిషన్‌లు ఎందుకు దాఖలు చేయలేదు అంటూ ఓటర్ల జాబితాల దగ్గర నుంచి పోలింగ్ దాకా అక్రమాలన్నింటికీ రాజకీయ పార్టీలదే బాధ్యత తప్ప తమకేమీ సంబంధం లేదన్నట్లు పలాయనవాదం పఠించారు.

గత ఎన్నికల్లో అక్రమాలు ఇప్పుడు వెలికితీయడం వల్ల వాటి ఫలితాలేవీ మారవు. అయితే తప్పులు ఎక్కడ జరిగాయో లోతుగా అధ్యయనం చేస్తే భవిష్యత్‌లో కుమ్మక్కులను నివారించవచ్చు. సిఇసి సాంకేతికంగా తప్పించుకుంటూ ఎదురుదాడి చేసి ఎన్నికల కమిషన్ ప్రతిష్టను దిగజార్చే బదులు, రాహుల్ గాంధీ, అఖిలేష్‌యాదవ్, ఒడిసాలోని బిజెడి పార్టీ తదితరులు లేవనెత్తిన అంశాలను తమ యంత్రాంగం ద్వారా కూలంకుష పరిశీలన చేయించి వాస్తవాలు తెలుసుకొని ఉంటే ఆయన ప్రతిష్ట పెరిగేది.

ఇదే అంశంపై 16–17 రోజులుగా పార్లమెంటు ఉభయసభలను ప్రతిపక్షాలు స్తంభింపచేస్తున్నాయి. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదు. పైగా ఎన్నికల కమిషన్‌ను బిజెపి నేతలు సమర్థించడం వారిని లబ్ధిదారులుగా ప్రజల ముందు ఉంచుతున్నది. ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి 'ఒక మనిషి–ఒక ఓటు' అనే రాజ్యాంగ హక్కు రక్షణ కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగిస్తున్న పోరాటం దేశ ప్రజలను జాగృత పరుస్తుంది. 300 మంది ఇండియా కూటమి ఎంపిలు తమను కలుసుకునే ప్రయత్నాన్ని సిఇసి నిరాకరించడం కార్యాలయానికి, వారి ప్రదర్శనను పోలీసులు అడ్డగించడం ప్రతిపక్షం ఆరోపిస్తున్న 'కుమ్మక్కు'కు బలం చేకూర్చుతున్నది.

# ఒబిసిల పట్ల బిజెపి ప్రేమలో నిజాయితీ ఏది!



ఎం.కోటేశ్వరరావు

తెలంగాణా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను 42శాతానికి పెంచేందుకు రాష్ట్రపతికి పంపిన బిల్లుకు ఆమోదం లేదా తిరస్కారం చేస్తున్నట్లు చెప్పలేదు. ఆర్డినెన్స్ ద్వారా అమలు చేద్దామని చూస్తే గవర్నర్ దాన్ని కేంద్రానికి సలహా కోసం పంపటంతో దాని పరిస్థితీ అంతే. దీని వెనుక బిజెపి రాజకీయం పక్కాగా కనిపిస్తున్నది. ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నందున అంగీకరించే సమస్యే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ బయట చెబుతారు. రాజ్యాంగబద్ధంగా అలాంటి అవకాశం ఉంటే కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్రపతి కూడా తిరస్కరించవచ్చు. రాష్ట్రాన్ని వివరణ అడగవచ్చు. అదేమీ చేయకుండా తొక్కి పెట్టారు. అసలు నరేంద్రమోడీ, బిజెపికి బిసి రిజర్వేషన్ల మీద ఉన్న చిత్తశుద్ధి ఎంత అన్నది ప్రశ్న. పద్నాలుగుసార్లు గడువు పొడిగించిన తరువాత 2023 జూలై 31 నాటికి ఒబిసి రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై జస్టిస్ రోహిణీ కమిషన్ నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందచేసి రెండు సంవత్సరాలు దాటింది. అసలు ఆ నివేదిక వెలుగు చూస్తుందా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. 2017 అక్టోబరు రెండవ తేదీన ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జి రోహిణీ అధ్యర్యంలో కమిషన్ ఏర్పడింది. ఆమెతో పాటు నలుగురు సభ్యులు ఉన్నారు.

రామనాథ్ కోవింద్ హయాంలో ఏర్పాటు చేసిన ఈ కమిషన్ కేవలం మూడు మాసాల్లో నివేదిక ఇవ్వాలని నిర్దేశించగా ఆరేండ్లు పట్టించారు. ఈ నివేదిక ఇంకా తమకు అందలేదని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయశాఖ 2025 మార్చి 26న లోక్‌సభకు తెలియచేసింది. తమ దగ్గర ఉన్న సమాచారం మేరకు 2011 నాటి సామాజిక, ఆర్థిక కులగణన వివరాలను అందచేయాలని రోహిణీ కమిషన్ నుంచి ఎలాంటి విన్నపం అందలేదని కూడా ప్రభుత్వం చెప్పింది. ఈ ఏడాది ఆగస్టు ఐదవ తేదీన కూడా అడిగిన ప్రశ్నకు అదే సమాధానాన్ని పార్లమెంటుకు తెలిపింది. అనేక రాష్ట్రాలలో బిసి కుల సర్వేలు జరిగిన పూర్వరంగంలో నివేదికలోని అంశాలు వెల్లడయితే దేశ సామాజిక, రాజకీయ రంగాలపై భూకంప ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. అందుకే రెండు సంవత్సరాలైనా వెలుగు చూడటం లేదా ? పార్లమెంటు ఉభయ సభలకు సమర్పించకుండా నివేదికను వెల్లడించటానికి కుదరదని 2024 మే మొదటి వారంలో అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రయోజనవాజ్యం మీద తీర్పు నిచ్చింది. అందువలన కోర్టుల ద్వారా కూడా అది వెలుగు చూసే అవకాశం లేదన్నది తేలిపోయింది. దీనికి ముందు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ 2015లోనే అత్యంత వెనుకబడిన, బాగా వెనుకబడిన, వెనుకబడిన తరగతులుగా మూడుగా విభజించి రిజర్వేషన్లు అమలు జరపాలని చేసిన సిఫార్సును మోడీ సర్కార్ పట్టించుకోలేదు. జాప్యం చేసే ఎత్తుగడతో రెండు సంవత్సరాల తరువాత రోహిణీ కమిషన్ ఏర్పాటు చేశారు. మండల్ కమిషన్ 1979లో ఏర్పాటు కాగా 1980లో నివేదిక ఇచ్చింది. పదేండ్లకు అది అమల్లోకి వచ్చింది. రోహిణీ కమిషన్ 2017లో ప్రారంభం కాగా 2023లో నివేదిక సమర్పించింది. 2019లోనే ముసాయిదా నివేదిక సిద్ధంగా ఉన్నట్లు కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి రాసినా గడువు పొడిగించటం గమనించాలి. 2015 నుంచి తీరుతెన్నులను చూస్తే ఇప్పటికే పదేండ్లు దాటింది, ఒబిసి వర్గీకరణ మొత్తంగా 15 సంవత్సరాల తరువాతైనా జరుగుతుందా అన్నది అనుమానమే.

వెయ్యి పేజీలకు పైగా ఉన్న రోహిణీ కమిషన్ నివేదిక రెండు భాగాలుగా ఉంది, మొదటి భాగంలో ఓబిసి వర్గీకరణ ఎలా జరపాలి అని పేర్కొనగా, రెండవ భాగంలో దేశమంతటా గుర్తించిన 2,633 కులాల జాబితా ఉన్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. 2015 నుంచి 2018 వరకు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలలో లక్ష ప్రవేశాలు, లక్షా 30వేల ఉద్యోగాలను ఎలా ఇచ్చారన్నది కమిషన్ పరిశీలించినట్లు చెబుతున్నారు. నాలుగోవంతు వాటాను కేవలం పది ఓబిసి కులాల వారే దక్కించుకున్నారని, మరో నాలుగోవంతును 38 కులాల వారు, మరో నాలుగోవంతు 102కులాలు దక్కించుకున్నాయని, మరో 22.3శాతం 506 కులాలు పొందినట్లు, 994 కులాలకు కేవలం 2.68శాతం దక్కగా 983 కులాలకు అసలు ఎలాంటి లబ్ధి దక్కలేదని తేలినట్లు వెల్లడైంది. విద్యా, ఉద్యోగ రంగాల వనరుల పంపిణీలో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ కొందరు మాత్రమే ఏ విధంగా వాటిని దక్కించుకుంటున్నారో ఈ వివరాలు వెల్లడిస్తున్నాయి. దళితుల వర్గీకరణతో కొంత మేరకు పరిష్కారం కుదిరినా ఇంకా అమల్లోకి రాలేదు. బిసి, గిరిజనుల్లో ఇంకా అలాంటి అంతరాలు ఎక్కువగా ఉన్నాయి. రోహిణీ కమిషన్ బిసిలను నాలుగు తరగతులుగా వర్గీకరించాలని సిఫార్సు చేసినట్లు వార్తలు వచ్చాయి.

దేశవ్యాపితంగా బిసి జనాభా సంఖ్య అంచనాకు సర్వేచేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని రోహిణీ కమిషన్ కేంద్రానికి రాసినా పట్టించుకోలేదు. 2018లో నాటి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2021 జనగణనలో ఓబిసి వివరాలు ఉంటాయని చెప్పారు తప్ప కులగణన చేస్తామని నిర్దిష్టంగా ప్రకటించలేదు. వెనుకబడిన తరగతుల కులగణన జరగాలన్న డిమాండ్‌కు ఇటీవలి సంవత్సరాలలో మద్దతు పెరుగుతున్నది. రాష్ట్రాలకు గణన చేసే అధికారం లేదు గనుక సర్వేల పేరుతో వారెంత మంది ఉన్నారో సుమారుగా లెక్కించేందుకు కొన్ని రాష్ట్రాలు చర్యలు తీసుకున్నాయి. వాయిదాపడిన 2021జనగణనలో కులగణన చేయాలన్న డిమాండ్‌ను బిజెపి, కేంద్ర ప్రభుత్వం మొండిగా తిరస్కరించాయి. రాష్ట్రాల మీద నెట్టాలని చూశాయి. మెజారిటీ రాష్ట్రాలలో తామే ఉన్నామని చెప్పుకొనే బిజెపి తమ పాలిత రాష్ట్రం ఒక్కదానిలో అయినా సర్వే చేసిందా అంటే లేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి కులగణన అంశాన్ని, రిజర్వేషన్లపై 50 పరిమితి ఎత్తివేయాలన్న నినాదాన్ని ముందుకు తెచ్చింది. జనాల నుంచి వస్తున్న ఒత్తిడి, బిహార్ ఎన్నికల కారణంతో 2027లో చేపట్టే జనగణనలో కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. అప్పటి నుంచి బిజెపి నేతలు కొత్త పల్లవి అందుకున్నారు. ఎలాగూ జనగణనలో కులాల వివరాలు వస్తాయి గనుక ఆ తరువాతే చర్యలు తీసుకోవచ్చు కదా అని చెబుతున్నారు. 2011 ఫిబ్రవరిలో గణన జరిగితే 2013 ఏప్రిల్‌లో అంతిమంగా దాన్ని ఖరారు చేశారు. ఇప్పుడు డిజిటల్ అంటున్నారు గనుక ఆ లెక్కన చూసినా 2028 వరకు ప్రతిపాదిత జనాభా గణన ఖరారయ్యే అవకాశం లేదు. అప్పటి వరకు రోహిణీ కమిషన్ నివేదిక వెలువడదా లేక ఒత్తిడికి తట్టుకోలేక వెల్లడించినా దాని మేరకు చర్యలు తీసుకొనే అవకాశం లేదా అన్నది ప్రశ్న. ఈలోగా 2029 పార్లమెంటు ఎన్నికలు వస్తాయి. ఇప్పుడు తొమ్మిది దశాబ్దాల నాటి (1931) కులగణన ఆధారంగా బిసిలు ఇంత మంది ఉండవచ్చని అంచనాగా చెబుతున్నారు. తరువాత జరిగిన సామాజిక మార్పులలో అనేక తరగతుల్లో జనాభావృద్ధిలో వచ్చిన హెచ్చు తగ్గులను పరిగణనలోకి తీసుకొనేందుకు సమాచారం లేదు.

2027 జనాభా లెక్కల్లో ఎవరెంత శాతం అన్నది తేలుతుంది తప్ప కులాల సంఖ్య, వాటిలో ఉన్న జనాభా స్థితిగతులు మారే అవకాశమే లేదు. అందువలన సదరు నివేదికను విడుదల చేసి పార్లమెంటు, అసెంబ్లీలు, ప్రజావేదికల మీద చర్చ చేస్తే తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి ఎవరేమనుకుంటున్నదీ వెల్లడి అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1953లో నాటి నెహ్రూ ప్రభుత్వం తొలిసారిగా కాకా కలేల్‌కర్ (దత్తాత్రేయ బాలకృష్ణ కలేల్‌కర్) వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటు చేసింది. అది 2,399 కులాలను ఓబిసిలుగా గుర్తించింది, 70శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, 1961లో కులగణన చేయాలని సిఫార్సు చేసింది. ఆ నివేదికను గోడౌన్‌లో భద్రపరిచారు. తరువాత జనతా పార్టీ హయాంలో బిపి మండల్ ఆధ్వర్యాన 1979లో రెండవ కమిషన్ ఏర్పాటు చేశారు. 1980లో ఆ నివేదిక వచ్చే సరికి ఇందిరా గాంధీ తిరిగి అధికారానికి వచ్చారు. దాన్ని కూడా గోడౌన్‌కు పంపారు. నేషనల్ ఫ్రంట్ నాయకత్వాన ఏర్పడిన ప్రభుత్వం 1990 ఆగస్టులో నాటి ప్రధాని విపి సింగ్ ఆ నివేదికను వెలికి తీయించి అమల్లో భాగంగా 27 శాతం రిజర్వేషన్లను ప్రకటించారు. బిల్లు ఆమోదం పొందినప్పటికీ అది కోర్టు వివాదాలకు దారితీసింది. న్యాయవాది ఇంద్రా సహానే ప్రభుత్వ ఉత్తరువులను సవాలు చేశారు. దాని మీద విచారణ జరిపిన సుప్రీం కోర్టు 1992 నవంబరు 16న ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు చెప్పింది. తొమ్మిది మంది సభ్యులున్న ధర్మాసనంలో ఆరుగురు అనుకూలంగా, ముగ్గురు వ్యతిరేకంగా మెజారిటీ తీర్పు వచ్చింది. సరిగ్గా ఈ సమయంలోనే దేశంలో నూతన ఆర్థిక విధానాల పేరుతో నయా ఉదారవాద విధానాలకు తెరలేచింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాల రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని అవి కూడా ప్రభుత్వరంగంలో మాత్రమేనని, ప్రయివేటు రంగానికి వర్తించవని పేర్కొన్నది. ఆ తీర్పు ఇప్పటికీ అమల్లో ఉంది. తరువాత 2007లో రిజర్వేషన్లను విద్యా సంస్థలకూ వర్తింపచేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 2019లో నరేంద్రమోడీ సర్కార్ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 103వ రాజ్యాంగ సవరణ చేసింది. దాన్ని కోర్టులో సవాలు చేయగా 2022 నవంబరు ఏడున 3:2 మెజారిటీతో సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది.

రిజర్వేషన్లు ఉన్నప్పటికీ ఉన్నత పోస్టులలో తగిన సామాజిక న్యాయం జరుగుతున్నదా, ఆ మేరకు ఆయా తరగతుల వారు లబ్ధి పొందుతున్నారా అన్నది ప్రశ్నార్థకంగా మారిన పూర్వరంగంలో 2017లో రోహిణీ కమిషన్ను ఏర్పాటు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల మాదిరిగానే మోడీ సర్కార్ ఇప్పటికి వ్యవహరించింది తప్ప భిన్నంగా లేదు. పద్నాలుగుసార్లు నివేదిక పొడిగింపుతో వ్యవధి పెంచటం, నివేదిక సమర్పించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటం దాన్నే సూచిస్తున్నది. అది అమల్లోకి వస్తే తాను ఎంతో కాలంగా సాగిస్తున్న సోషల్ ఇంజనీరింగ్ పేకమేడలా కూలిపోతుందని బిజెపికి తెలుసు కనుక ఇంత జాగు చేస్తున్నది. ఆర్థికంగా వెనుకబడిన వారి రిజర్వేషన్లను ఎన్నికల కోసం ఎంతో వేగంగా తీసుకువచ్చిన వారు ఇబిసిల విషయంలో ఎందుకు జాగుచేస్తున్నట్లు ? బిసి కులగణన చేస్తే హిందూ సమాజంలో చీలికలు వస్తాయని గతంలో చెప్పిన మాటలను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలి. మొత్తంగా చూసినపుడు ఓబిసి, షెడ్యూలు కులాలు, తెగలు దేశంలో అణచివేత, దోపిడీకి గురవుతున్న సామాజిక తరగతులే. అయితే ఇతర కులాల్లో పేదలు ఉన్నట్లే ఈ సామాజిక తరగతుల్లో కూడా ధనికులు, ముందున్న తరగతులు లేకపోలేదు. అందుకే రిజర్వేషన్ల ఫలాలను కొందరే ఎక్కువగా అనుభవిస్తున్నారు. రోహిణీ కమిషన్ నివేదిక దాన్నే నిర్ధారించినట్లు తెలుస్తున్నది. పద్నాలుగు సార్లు గడువు పొడిగించినా, ఆరు సంవత్సరాల పాటు విచారించిన కమిషన్ అడిగిన కీలక సమాచారాన్ని ప్రభుత్వ శాఖలు ఇవ్వలేదనే ఒక విమర్శ మీడియాలో వచ్చింది. ఐఐటి, ఐఐఎం, ఐఐఎస్ వంటి అగ్రశ్రేణి విద్యా సంస్థలలో ఓబిసి రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగటం లేదనే విమర్శలు ఉన్నాయి. అదే గనుక నిజమైతే ఆ నివేదిక వెల్లడైన తరువాత దాన్ని వివాదాస్పదంగా మార్చే అవకాశం లేకపోలేదు.


అనివార్యమైన స్థితిలో బిజెపిని వ్యతిరేకించే పార్టీలు సామాజిక న్యాయ నినాదాన్ని తీసుకున్నాయి. దాన్ని ఎదుర్కొనేందుకు నరేంద్రమోడీ తన మంత్రివర్గంలో, వివిధ రాష్ట్రాల బిజెపి మంత్రివర్గాల్లో ఓబిసిలకు గణనీయ ప్రాతినిధ్యం కల్పించి దాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నది. ఇది మిశ్రమ ఫలితాలను ఇచ్చినట్లు చెప్పవచ్చు. వెనుకబడిన తరగతుల్లో వర్గీకరణ ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు జరుగుతున్నది. రోహిణీ కమిషన్ నివేదికలో లోపాల గురించి చెప్పాల్సి వస్తే 2018 తరువాత జరిగిన నియామకాలకు సంబంధించి ఎలాంటి పరిశీలన కమిషన్ చేయలేదు. వెల్లడి తరువాత కొన్ని సవాళ్లు కూడా ఎదురుకానున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో చేనేత, దూదేకటం వంటి కొన్ని వృత్తులు చేసే ముస్లింలు, బీహార్‌లో దర్జీలు ఓబిసి జాబితాలో ఉండగా హిందువులు లేరని రోహిణీ కమిషన్ గుర్తించినట్లు నిర్ధారణగాని వార్త. వివిధ రాష్ట్రాలలో ఇలాంటి సమస్యలు, బిజెపి మత అజెండాకు దీనికి ఘర్షణ తలెత్తవచ్చు. అందుకే వెల్లడించటానికి జాగు చేస్తున్నట్లా !

# డిండి ఎత్తిపోతలకు శ్రీకారం

నల్లగొండ జిల్లాలో తరచుగా కరువు కాటకాలకు గురవుతు, ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులవుతున్న దేవరకొండ, మునుగోడు, నల్గొండ నియోజకవర్గ గ్రామాలకు కృష్ణా జలాలు సాగు, త్రాగునీటికి అందించాలని గత మూడు దశాబ్దాలుగా జిల్లా ప్రజలు ఉద్యమించిన నేపథ్యంలో శాశ్వత పరిష్కారంలో భాగంగా డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టుటకు ఆనాటి ముఖ్యమంత్రి వైయస్సార్ జిఓ.నెం. 159 తేదీ. 7–7–2007న సర్వేకు ఆదేశించారు. మొదట్లో ఎస్ఎల్‌బిసిలో అంతర్భాగంగా నక్కలగండి రిజర్వాయర్ నుండి ఎగువ డిండికి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టుటకు సర్వే చేపట్టడం జరిగింది. నక్కలగండి నుండి ప్రస్తుతం ఉన్న డిండి ప్రాజెక్టు 200 మీటర్ల ఎత్తులో ఉంది. దీనికి మధ్యలో 100 మీటర్ల ఎత్తులో(మధ్య డిండి) రిజర్వాయర్ కట్టి అక్కడికి ఎత్తిపోసి, అటు నుండి ఎగువ డిండికి ఎత్తిపోయటం ద్వారా.. గ్రావిటి ద్వారా నల్గొండ జిల్లాలో ఎగువభాగమైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ గ్రామాలతోపాటు అచ్చంపేట నియోజకవర్గములో 3.50 లక్షల ఎకురాలకు సాగునీరుతో పాటు త్రాగు నీరు అందించవచ్చని ఈ ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని నిపుణుల కమిటీ ప్రతిపాదించింది. దీనిపై అధ్యయనం చేయాలనీ ఆనాటి ప్రభుత్వం నిర్ణయించింది. డిండి ప్రాజెక్టు కృష్ణా ఉపనదియైన దుందుభి నదిపై 1943లో నిజాం పాలనలో రూ.40 లక్షల వ్యయంతో 1.25 టీఎంసీల సామర్థ్యంతో 12,835 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే విధంగా చేపట్టబడినది. ఇది నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దుల్లో ఉంది. ఎగువన ఉన్న కృష్ణానది నుండి జలాలు డిండికి ఎత్తిపోయాలని చాలకాలంగా డిమాండు ఉన్నది. 2014లో అధికారం చేపట్టిన బిఆర్ఎస్ ప్రభుత్వం.. ఇది ఎక్కువ ఖర్చుతో కూడుకున్నదని, ఫీజాబిలిటీ లేదని నిర్ణయానికి వచ్చి.. ఈ పథకాన్ని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా చేర్చడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో తీవ్ర కరువు ప్రాంతం, వలసల ప్రాంతంగా పేరొందిన పాలమూరు జిల్లాకు 10 లక్షల ఎకరాలకు సాగు, త్రాగునీరు అందించే విధంగా కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జిఓ నెం.105 తేదీ. 10.6.2015న రూ.35,200 కోట్లతో సాంక్షన్ ఇస్తూ 11–6–2015న శంకుస్థాపన చేశారు. దీనికి శ్రీశైలం లోతట్టు నుండి రోజుకు 2 టీఎంసీల చొప్పున 60 రోజుల పాటు 120 టిఎంసిల నీటిని ఎత్తిపోతల ద్వారా 90 టీఎంసీలు పాలమూరు–రంగారెడ్డికి, 30 టీఎంసీలు డిండి ఎత్తిపోతలకు 0.5 టీఎంసీలు చొప్పున 3 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని 2015 ఆగస్టులో ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ శివన్నగూడెం దగ్గర చర్లగూడెం రిజర్వాయర్ (మర్రిగూడెం మండలం)కు శంకుస్థాపన చేశారు. సింగరాజుపల్లి, గొట్టిముక్కుల, కిష్టరాయన్‌పల్లి, చర్లగూడెంలలో 12 టీఎంసీల కెపాసిటీతో 4 రిజర్వాయర్లను చేపట్టి పనులు జరుగుతున్నవి. ఇంకా కొన్ని స్థానికంగా ఉన్న చెరువుల కెపాసిటీ పెంచాలని నిర్ణయించడం జరిగింది. పూర్తిస్థాయి నిధులు విడుదల చేయకపోవటంతో రిజర్వాయర్ల కొరకు ఇంకా కొంత భూ సేకరణ చేయవలసి ఉంది. ప్రధాన కాలువల పనులకు భూసేకరణ పూర్తి చేయక మిగిలి ఉన్నవి. శంకుస్థాపన చేసి ఎనిమిది సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ డిండి ఎత్తిపోతలకు డిపిఆర్ లేకపోవటము కాలయాపన జరుగుతూ వచ్చింది.

## సిపిఐ ఆందోళన కార్యక్రమాలు

డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి కరువు, ఫ్లోరోసిస్ ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు, నల్గొండ నియోజకవర్గ గ్రామాలకు సాగు, త్రాగు నీరందించాలని.. కల్వకుర్తి ఎత్తిపోతలను చేపట్టినందున దానిని డిండి వరకు పొడిగించాలని కోరుతు సిపిఐ నల్గొండ జిల్లా అధ్వర్యాన 2003 సెప్టెంబర్‌లో 500 మందితో డిండి నుండి నల్గొండ వరకు 120 కి.మీ. ఆరు రోజుల పాదయాత్ర నిర్వహించటం జరిగింది. దానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి నాయకత్వం వహించారు. అదే తేదీలలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి పాదయాత్రలు నల్గొండకు చేరుకొని వేలాది మందితో ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించనైనది. 2005 లో ఎస్ఎల్‌బిసిని పూర్తి చేసి, డిండి ఎత్తిపోతలు చేపట్టాలని నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చెప్పడం జరిగింది. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎస్ఎల్‌బిసి పనులు చేపట్టుటకు ఆదేశించారు. పనులలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని.. జిల్లాలో సిపిఐ, ప్రజా సంఘాలు అనేక ఉద్యమాలతోపాటు, జిల్లాలో పాదయాత్రలు, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. 2014లో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభు త్వం ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతలను పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా చేర్చినప్పటికీ.. పనులు పూర్తిగా నిర్లక్ష్యం చేయటాన్ని నిరసిస్తూ జిల్లాలో దేవరకొండ, మునుగోడు, నల్గొండ నియోజకవర్గ గ్రామాలలో 2023 ఏప్రిల్ నెలలో 15 రోజుల పాటు సీపీఐ పాదయాత్రలు, సభలు చేపట్టడం జరిగింది. డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టినా, ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవడానికి రేవంత్ రెడ్డి మంత్రివర్గం ఆమోదం తెలుపుతూ.. ఈ పథకానికి రూ.1800 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. నల్గొండ జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు హర్షం తెలుపుతున్నారు.



## ఏదుల నుంచి డిండికి నీరు :

శ్రీశైలం నుంచి వరద జలాల నుండి రోజు 2 టిఎంసి చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీల నీటిని ఎత్తిపోతలలో భాగంగానే డిండి పథకానికి రోజుకు 0.5 టిఎంసి చొప్పున నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాలోని 3.41 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే.. పనులు చేపట్టుటకు ఆమోదం తెలిపింది. శ్రీశైలం నుంచి నీటిని తీసుకొని ప్రస్తుతం ఉన్న డిండి రిజర్వాయర్‌కు మళ్ళించి అక్కడ నుంచి గ్రావిటి ద్వారా ఆయకట్టుకు నీరందించడం ఈ పథకం ఉద్దేశం. దీనిపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులు వ్యతిరేకత తెలుపుతున్న నేపథ్యంలో.. రాష్ట ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులను ఆపకుండా.. వాటికి ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని జిల్లా ప్రజలకు తెలిపింది.

## నీటి మళ్లింపు ఇలా..

వనపర్తి జిల్లాలోని ఏదుల వద్ద ఉన్న వీరాంజనేయ రిజర్వాయర్ వెనుక భాగంలో హెడ్ రెగ్యులేటర్ నిర్మిస్తారు. ఇందులో భాగంగా అప్రోచ్ ఛానల్, తర్వాత 2.5 కీ.మీ. ఓపెన్ కెనాల్, 16 కీ.మీ సొరంగ మార్గం, మళ్లీ 3.25 కిమీ. ఓపెన్ కెనాల్ త్రవ్వాల్సి ఉంటుంది. మొత్తం 87 కి.మీ కాలువలు త్రవ్వాలి. దీనికి 4 ప్యాకేజీలుగా పనులు, సొరంగ మార్గం పనులుగా విభజించి పనులు నడుస్తున్నాయి. డిండి వాగు ద్వారా ఉల్పర సమీపంలో పోతిరెడ్డిపల్లి వద్ద నిర్మించే బ్యారేజీకి మళ్లించి డిండి ఎత్తిపోతల పథకానికి నీరందిస్తారు. పనులతో పాటు జీఎస్టీ ఇతర పనులు కలిపి రూ.1,800 కోట్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు.

## ఎస్ఎల్‌బిసి పనులు తిరిగి ప్రారంభం:

నాలుగు దశాబ్దాల క్రితం చేపట్టిన ఎస్ఎల్‌బిసి పథకం నత్తనడకలో సాగుతున్నది. దీనిని పూర్తి చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలం గడిపింది. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయుటకు గత బడ్జెట్లోనే రూ.800 కోట్లను కేటాయించి.. త్రవ్వక పనులు తిరిగి మొదలైన వెంటనే సొరంగంలో 23 కి.మీ వద్ద మట్టి పెళ్లలు విరిగి కూలిపోవడం.. సైటు ఇంజనీర్‌తోపాటు 8 మంది చనిపోవడం.. పనులు ఆగిపోయిన నేపథ్యంలో.. ఆరు మాసాలుగా పనులు నిలిచిపోయినవి. దీనిపై సమీక్షించిన రాష్ట్ర క్యాబినెట్ నూతన టెక్నాలజీతో సైటు మార్చుతూ తిరిగి పనులు మొదలు పెట్టాలని నిర్ణయించడం జరిగింది. ఈ రెండు పథకాలకు పూర్తి స్థాయి నిధులు కేటాయించి.. భూసేకరణ, భూములు కోల్పోతున్న వారికి పూర్తి నష్టపరిహారం అందించి.. యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

– ఉజ్జిని రత్నాకర్‌రావు
9590952646

## 'సింగరేణిలో ఆగిపోయిన పింఛన్‌లు, డిపెండెంట్

# ఉద్యోగాలకు మోక్షం ఎప్పుడు?

సింగరేణి అంటేనే ఉక్కుపాదం. అది నిజాం సంస్థానమైన, అవిభక్త ఆంధ్రప్రదేశ్ అయిన, స్వరాష్ట్ర తెలంగాణానైన కార్మికుల మీద ఉక్కుపాదం మోపబడుతుంది. విధి నిర్వహణలో గాయాలకు గురైన కార్మికుడికి కూడా నీవు అజాగ్రత్తగా పని చేసి దెబ్బ తాకించుకున్నావని ఛార్జ్‌షీట్ ఇచ్చే చట్టాలున్నవి. బొగ్గుబాయిలల్లో బండ కింద, పెళ్లల కింద పడి చనిపోతున్న తోటి కార్మికులను చూసి భయపడి పారిపోకుండా పోలీస్ పహారా పెట్టిన రోజులు ఉన్నవి. బొగ్గు బాయిలల్లో పని చేయడానికి భయపడిన రోజులలో బస్కీలు తీసి లాడీస్ పయ్యలెత్తి, బస్తాలు మోసిన వారిని ఉద్యోగంలో భర్తీ చేసుకున్నారు. మోసాలు చేయడంలో పేరుగాంచిన ప్రభుత్వ యంత్రాంగం తన ఫోటోను అతుకుపెట్టి ఇచ్చిన ఎంప్లాయిమెంట్ కార్డ్‌ను, వాళ్లు చెప్పిన పేరుతో ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగంలో భర్తీ అయినారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులైన సన్నకారు రైతులు, చేతి వృత్తులు, వ్యవసాయ కూలీలు, పాలేర్లు బొగ్గుబాయి కొలువులలో నియామకమైనారు. అప్పటి సింగరేణి పరిస్థితి బుక్కెడు అన్నం పెట్టే కొలువు చాలని కార్మికులు భావించారు. ఏ పిల్లి అయితేంది ఎలుకను పట్టడానికని ప్రభుత్వం/యాజమాన్యం ఉద్యోగాల నియామకం పేరుతో బొగ్గు బాయిలల్లో పని చేయించుకున్నారు. ఆ సమయమున దంచినమ్మకు బుక్కిందే దక్కిందన్నట్లుగా కార్మికుల పరిస్థితి ఉండేది. అనేక పోరాటాల ఫలితంగా 1981లో మెడికల్ అన్‌ఫిట్ ప్రతిపాదికన డిపెండెంట్ ఉద్యోగ నియామకాలు ప్రారంభమై 1996 వరకు కొనసాగి తెలుగుదేశం పాలనలో బ్రేక్ పడింది. మరల స్వరాష్ట్రం తెలంగాణలో కూడా పోరాటాలు, సమ్మెలు చేసిన పిదప 2017లో పునరుద్ధరింపబడినవి. అప్పటివరకు మారు పేరు కార్మికులు అనారోగ్యానికి గురైనా, లేదా సర్వీస్‌లో ఉండగానే చనిపోయిన వాళ్ల కుమారులను అల్లుడిగా డిపెండెంట్ ఉద్యోగాలలో భర్తీ చేసుకున్నారు. ఇది బహిరంగ రహస్యం. కాలక్రమంలో ప్రభుత్వం, యాజమాన్యం ఉద్యోగ నియామకాలపై ఉక్కుపాదం మోపింది. డిపెండెంట్ ఉద్యోగ నియామకాల ప్రక్రియపై విజిలెన్స్ పేరుతో విరుచుకుపడింది. దానితో దాదాపు 1000 మంది మారుపేరు కార్మికుల డిపెండెంట్ ఉద్యోగ నియామకాలు ఆగిపోయినవి. ఇక ''కోల్‌మైన్స్ పెన్షన్ స్కీమ్ 1998 ఏప్రిల్' నుండి అమలులోకి వచ్చింది. దీనికి ముందు సర్వీస్‌లో ఉన్నపుడు కేవలం చనిపోయిన కార్మికుల భార్యలకు మాత్రమే వితంతు పెన్షన్ వచ్చేది. అది కూడా నెలకు రూ.200 నుండి రూ.400లోపు పొందేవారు. ఇప్పుడు కూడా కోల్‌మైన్స్ పింఛన్ పొందుచున్న వారికి కనీసం వారి రోజు వారి భోజనానికి కూడా సరిపోవడం లేదంటే అతిశయోక్తి కాదు. నెలకు రూ.1,000లను కనీస పెన్షన్‌గా చెల్లించాలని 2024 ఏప్రిల్‌లో చట్టాన్ని సవరించారు. ఇప్పుడు సింగరేణివ్యాప్తంగా 8,349 మంది కనీస పెన్షన్‌గా నెలకు రూ.1,000 పొందుచున్నారంటే పెన్షన్ దుస్థితికి అద్దం పడుతుంది. ప్రభుత్వాలు ఇచ్చే ఆసరా పెన్షన్ కంటే బొగ్గుబాయి పెన్షన్ అధ్వాన్నంగా ఉంది. ''కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్), సింగరేణి కంపెనీ, ఇంకా ప్రైవేటు బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల వేతనం నుండి ప్రతి నెల 7 శాతం రికవరీకి యాజమాన్యం కూడా తమ వాటాగా 7 శాతాన్ని కలిపి 14 శాతం డబ్బులు పెన్షన్ కార్పస్ ఫండ్‌లో జమ అవుతాయి. ఇప్పుడు కార్పస్ ఫండ్‌లో డబ్బులు లోటు ఉన్న కారణంగా కోల్ కంపెనీలు టన్ను బొగ్గుపై రూ.20/కూడా జమచేస్తున్నారు. కార్మికులు పదవి విరమణ పొందిన చివరి 10 నెలల (బేసిక్, స్థిర, మారేడు కరువు భత్యాలు) వేతనాన్ని సరాసరిగా, ఆవరేజీగా చేసిన నెల వేతనంపై 25 శాతాన్ని జీవిత కాలం కోల్‌మైన్స్ పింఛన్ రూపకంగా చెల్లిస్తారు. కార్మికుడు పొందిన పెన్షన్‌లో 60 శాతం వితంతు పెన్షన్ గా చెల్లిస్తారు. సింగరేణిలో రిటైర్డ్ అయిన 'మారు పేర్ల కార్మికులు 2016 వరకు' సక్రమంగానే కోల్ మైన్స్ పింఛన్‌లను పొందినారు. 2016 మార్చి 3న పార్లమెంటులో ''నా ఆధార్ నా గుర్తింపు'' ఆధార్ కార్డ్ ద్రవ్య బిల్లుగా ప్రవేశపెట్టబడి, 2017 ఫిబ్రవరి నుండి ఆధార్‌కార్డ్ అనుసంధానంగా బయోమెట్రిక్ లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించడం మొదలైన నుండి సింగరేణి మారు పేర్ల కార్మికుల పెన్షన్‌లు ఆగిపోయినవి. ఎందుకంటే? సింగరేణిలో ''మారు పేర్లతో ఉద్యోగం చేసిన కార్మికుల పేర్లు కాకుండా వాళ్ల జన్మతః పేర్లనే పిల్లల చదువులలో తండ్రిగా నమోదు చేయించుకున్న కారణంగా, సామాజిక బంధుత్వాలు, పెండ్లి సంబంధాలు, స్థిర ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు అన్నీ జన్మతః పేరునే ఉన్నందున ఆధార్ కార్డులను కూడా జన్మతః పేర్లనే తీసుకున్నారు. అందువలన మారు పేరుతో బయోమెట్రిక్ లైఫ్ సర్టిఫికెట్‌ను ఆధార్ కార్డ్‌తో అనుసంధానం చేయటం సాధ్యం కానందున మిన్నకుంటున్నారు. దానితో కోల్‌మైన్స్ పింఛన్‌ను నిలిపివేశారు. ''సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్'' సెక్రటరీ అళవంధార్ వేణు మాధవ్‌కు సమాచార హక్కు చట్టం 2005 ద్వారా ఇచ్చిన సమాచారం ప్రకారంగా సింగరేణి వ్యాప్తంగా 2025 మార్చి 31 నాటికి 82,387 మంది కార్మికులు కోల్‌మైన్స్ పింఛన్ లను పొందుచున్నారు.ఇందులో 8,349 మంది కేవలం రూ.1,000/ మాత్రమే కనీస పెన్షన్‌గా పొందుచున్నారు. బయోమెట్రిక్ లైఫ్ సర్టిఫికెట్‌లను సమర్పించని కారణంగా 5,058 మంది కార్మికుల కోల్ మైన్స్ పింఛన్‌లు ఆగిపోయినవి.

సింగరేణిలో కార్మికుల మారు పేర్ల సమస్యను సామాజికంగా, రాజకీయంగా పరిష్కరించే అవకాశం ఉంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మారు పేర్ల సమస్యను పరిష్కారం చేస్తానని గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల మానిఫెస్టోలో భరోసా ఇచ్చి 2017 అక్టోబర్ 5న గద్దెనెక్కాడు. కాని మారు పేర్ల సమస్య పరిష్కారానికి చొరవ చూపలేదు. 2023 నవంబర్ 30న జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాగంగా కోల్ బెల్ట్ జిల్లాల ప్రచార సభలలో కాంగ్రెస్ పార్టీ సింగరేణి మారు పేర్ల కార్మికుల సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి సంవత్సరంనర అవుతున్నా ఇంకా న్యాయ సమస్యగానే నలుగుతుంది. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి మారు పేర్ల కార్మికులపై ఆమ్నెస్టీగా, మానవత దృక్పథంతో వ్యవహరించి పరిష్కారానికి పూనుకోవాలి.

అందులో (1) ఆధార్ కార్డ్ అనుసంధానంతో ఇచ్చే బయోమెట్రిక్ లైఫ్ సర్టిఫికెట్‌ను ఇచ్చే విధానానికి బదులుగా పాత పద్ధతిలో మారు పేరు కార్మికులకు వాళ్లు రిటైర్డ్ అయిన కోల్ మైన్ అధికారి ధృవీకరణతో లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చే అవకాశాన్ని కల్పించి ఆగిపోయిన కోల్‌మైన్స్ పింఛన్ డబ్బులను ఇప్పించాలి.

(2) లేదా మారు పేరు కార్మికుల విషయంలో జన్మతః పేరుతో పాటుగా సింగరేణి ఉద్యోగంలో కొనసాగిన మారు పేరును కూడా అలియాస్‌గా ధృవీకరించి కొత్త ఆధార్ కార్డ్ తీసి బయోమెట్రిక్ ఇచ్చే అవకాశమైన ఇవ్వాలి.

(3) డిపెండెంట్ ఉద్యోగ నియామకాల విషయంలో ఇప్పుడున్న ప్రక్రియల్లో కుమారుడికి, అల్లుడికి, బిడ్డకి ఉద్యోగం ఇచ్చే అవకాశం ఎట్లాగూ ఉన్నందున మారు పేరు కార్మికుల కొడుకుల ఉద్యోగ నియామకాల్లో ''అల్లుడి డిపెండెంట్''గా ఉద్యోగ నియామకాలకు అవకాశం ఇవ్వాలి.

(4) లేదా సింగరేణి మారుపేర్ల కార్మికుల సెల్ఫ్ డిక్లరేషన్ కింద వాళ్ల సూచించిన డిపెండెంట్‌ను ఉద్యోగ నియామకం చేసుకునే వెసులుబాటు కల్పించాలని యావత్తూ సింగరేణి కార్మికులు కోరుతున్నారు.

– మేరుగు రాజయ్య
9441440791

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/బీబీనగర్ : భారీ వర్షాలకు షామీర్పేట వాగు నుండి వచ్చే వరద ఉధృతం కావడంతో బీబీనగర్ మండల కేంద్రంలో గల చిన్ననీటి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు చెరువులు పొంగిపొర్లుతున్నాయని దీంతో కొన్నిచోట్ల రహదారులు మూసివేయడం జరిగిందని ఆయన తెలిపారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండి వాగులు దాటవద్దని నీటి ప్రవాహం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో వైస్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## యువత క్రికెట్‌లో రాణించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట : యువత క్రికెట్‌లో రాణించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో బీసీసీఐ మాజీ చీఫ్ సెలక్టర్, మాజీ భారత క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీని ఆయన తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ సూర్యాపేటకు రావడం అభినందనీయమన్నారు. గ్రామీణ క్రీడాకారులకు అకాడమీని అందుబాటులోకి తీసుకవచ్చిన ఎంఎస్‌కె ప్రసాద్‌ను అభినందించారు. పట్టుదలతో సాధన చేస్తే ఏ రంగంలోనైనా విజయం తథ్యమన్నారు. అనంతరం ద్రోణాచర్య అవార్డు గ్రహీత, ఫిజకల్ ఫిటెన్స్ ట్రైనర్ రమేష్‌ను శాలువాతో సత్కరించారు.





## పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాపక్షం/చౌటుప్పల్ : పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడుతాయని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్సు ప్రాంగణం ఎదుట ఏర్పాటు చేసిన నవ చేతన సంచార పుస్తకాలయాన్ని సోమవారం మున్సిపల్ కమీషనర్ చేతుల మీదుగా ప్రారంభించి మాట్లాడారు. పుస్తకం సమాజాన్ని మార్చుతుందని ఎంతోమంది మేధావులు, నిపుణులు తమ మేథస్సును మధనం చేసి రచించిన పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. పిల్లలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, యువతకు ఆత్మ విశ్వాసాన్ని, పెద్దలకు ఆధ్యాత్మికతను, ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, మహిళలకు ఉపయోగపడే రకరకాల పుస్తకాలు ఒక చోట లభించే సంచార పుస్తకాలయాన్ని ప్రజల ముంగిట్లోకి తెచ్చినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంచార పుస్తకాలయం ఇన్చార్జి తలారి లక్ష్మయ్య, సిబ్బంది ప్రభాకర్, యాదయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగొని గాలయ్య, పురపాలిక కమిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, నాయకులు టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, బోయ మంకులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



ప్రజాపక్షం/యాదాద్రి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 36 ఆర్జీలను, జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డితో కలసి ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. స్టేట్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 23, జిల్లా పంచాయతీ 4, జిల్లా శిశు సంక్షేమ శాఖ 4, మున్సిపాలిటీ, విద్యా, డిఆర్‌డిఓ, లీడ్ బ్యాంక్, ఎంప్లాయిమెంట్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పిడి విజయసింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వర్ణరథం ప్రారంభోత్సవం



ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్వర్ణరథం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సోమవారం హర్యానా తాజా మాజీ గవర్నర్ దత్తాత్రేయ తో కలిసి వాసవి మాత అమ్మవారిని వేద పండితులచేత ప్రత్యేక పూజలు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొన్నారు దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్. వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం మాడ వీధుల చుట్టూ తిరిగేందుకు ఏర్పాటు చేసిన స్వర్ణ రథం అద్భుత శిలాకళా నైపుణ్యంతో అద్భుతంగా ఉందన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు దేవరకొండ నియోజకవర్గ ప్రాంత ప్రజలపై ఉండి, ఆయురారోగ్యాలతో , సుఖ సంతోషాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## వినూత్నంగా ఆలోచించిన.. చిన్నారి ఆవేదన...

లేఖ రూపంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి



ప్రజాపక్షం/నందికొండ: తన మనసు బాధించిందో ఏమో కానీ పాఠశాలకు బయలుదేరే సమయంలో తను, తనతో పాటు చదువుతున్న తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు ఎంత ఇబ్బంది పడుతున్నారో ఆ ఇబ్బందిని ఒక లేఖ రూపంలో తెలియజేశాడు. వివరాల్లోకి వెళితే స్థానిక మున్సిపాలిటీ లోని ఇండియన్ ప్రిన్సెస్ స్కూల్ రోడ్డు కంకర తేలి గుంతలు పడి అస్తవ్యస్తంగా ఉందని కొత్త సిసి రోడ్డు నిర్మించాలంటూ ఇండియన్ ప్రిన్సెస్ స్కూల్ లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి గొట్టిముక్కల రోహిత్ నందికొండ మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశాడు. ఇండియన్ ప్రిన్సెస్ స్కూల్ రోడ్డు కంకర తేలి గుంతలు పడి అస్తవ్యస్తంగా మారిందని వర్షాకాలంలో నీరు గుంతల్లో చేరడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు స్కూలుకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని, ద్విచక్ర వాహనదారులు వెళ్లేటప్పుడు గుంతల్లో ఉన్న వర్షపు నీరు తమ స్కూల్ డ్రెస్సులపై, పుస్తకాలు, ఒంటిపై పడి తాము అసహనానికి, అనారోగ్యానికి గురవుతున్నామని, తడిచిన బట్టలతో స్కూలుకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని, గుంతలలో నిలిచి ఉన్న మురుగు నీరు వలన దోమలు చేరి సీజనల్ వ్యాధులకు తరచూ గురవుతున్నామని, తమ బాధలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సిసి రోడ్డును నిర్మించాలని నందికొండ మున్సిపాలిటీ 2వ వార్డుకు చెందిన గొట్టిముక్కల రోహిత్ వినూత్నంగా ఆలోచించి నందికొండ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశాడు.

# మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

హుజూర్‌నగర్‌లో సిటిస్కాన్,డయాలసీస్ సెంటర్లను ప్రారంభించిన మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యసేవలను అందించడమే లక్ష్యంగా హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కావాల్సిన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రూ.3కోట్ల 60లక్షలతో నిర్మించనున్న నూతన ఔట్‌పేషంట్ బ్లాక్, దోబీ ఘాట్,పార్కింగ్ షెడ్లకు ఆయన శంకుస్థాపనలు చేశారు. రూ. 1కోటి 25లక్షలతో నిర్మించిన డయాలసీస్,రక్తనిధి కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. రూ.3కోట్ల తో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ సెంటర్‌ను మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సదుపాయాల కోసం తపస్సులా యజ్ఞం చేస్తున్నామన్నారు. విద్య,వైద్యం, త్రాగు,సాగునీరు,విద్యుత్,రహదారులు అన్నింటిలో ప్రగతిని సాధిస్తున్నామని మంత్రి చెప్పారు. హుజూర్‌నగర్‌లో జూనియర్,డిగ్రీ కళాశాలలను నిర్మించడంతోపాటుగా, ఫణిగిరి సీతారామస్వామిగట్టు వద్ద 2160 జిప్లస్‌వన్ గృహాలను నిర్మిస్తున్నామన్నారు. గరిడేపల్లిలో రూ.2కోట్ల 50 లక్షలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరీ చేయించామని, రూ.4కోట్లతో హుజూర్‌నగర్లో నూతన బస్‌స్టాండ్ మంజూరీ చేయించామని,అందరి జీవితాలలో వెలుగులు నింపి జీవనప్రమాణాలు మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామన్నారు. మట్టపల్లిలో కొలువైన శ్రీలక్ష్మీ నృసింహస్వామి,జాన్‌పహాడ్ దర్గాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తెచ్చామని, క్రిస్టియన్ బరేల్‌గ్రౌండ్‌తో పాటు,గుట్టపైకి రూ. 10 లక్షలతో రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు.

**అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ**



డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలోనే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం తెలంగాణ సామాజిక న్యాయం వైపు పయనిస్తుందని తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ డివిజన్ ఎలక్ట్రిసిటి కార్యాలయం ముందు ఎలక్ట్రిసిటి ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఉత్తమ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ డీఈ వెంకటకృష్ణయ్య,ఏడీఈ, ఏఈ,సిబ్బంది పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న ఇండ్లను ఖాళీ చేయించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను, ఇండ్లను గుర్తించి వాటిని ఖాళీ చేయించాలని అధికారులను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో, మున్సిపాలిటీలలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు నిర్వహించాలని, అలాగే నీటి ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 62 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని వాటిని వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిపిఓ యాదగిరి, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీ ప్రతినిధులతో ప్రీ రివిజన్ కార్యక్రమం**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్స్ జాబితా ప్రక్రియ, 1200 దాటిన పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, కొత్త పోలీసు స్టేషన్ల ఏర్పాటు, కొత్త బిఎల్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్‌వైజర్స్ ఏర్పాటు చేయడం, జిల్లాలో కొత్తగా 27 పోలింగ్ స్టేషన్స్ ఏర్పాటు అవుతున్నందున దీనికి సంబంధించి వివరాల గురించి చర్చించారు. ప్రతి పోలీసు స్టేషన్‌కు బిఎల్‌ఏలను ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరినారు. ఓటర్ దరఖాస్తు ఫారం పెండింగ్ అలాగే బిఎల్‌ఓల పనితీరు గురించి చర్చించారు. కొన్ని పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లు చాలా దూరం నుండి వచ్చి ఓటు వేయడం జరుగుతుందని, దగ్గర పోలింగ్ స్టేషన్స్ కేటాయించాలని రాజకీయ నాయకులు కలెక్టర్‌కు సూచించారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల కొత్త పోలింగ్ స్టేషన్‌లపై సలహాలు, సూచనలు స్వీకరించటం జరిగిందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

: సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి

ప్రజాపక్షం /నల్లగొండ(కనగల్) : మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి పిలుపునిచ్చారు.మంగళవారం కనగల్‌లో నిర్వహించిన సిపిఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోవందేళ్ళ ప్రస్థానంతో కార్మి కులు కర్షకులు అణగారిన వర్గాల ప్రజలతో కోసం అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిన ఘనమైన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరికి ఇళ్ల స్థలాలు, ఇల్లు ఇచ్చే విధంగా లిస్టులు తయారు చేయడం సరైనది కాదని, అందరికీ పక్క గృహాలు ఇవ్వాలని కోరారు.రైతులకు సరిపడా యూరియా కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, సహాయ కార్యదర్శిలు చిలకరాజు రాములు,దోటి పాండరి, జోగు సురేందర్, గట్టిగుండ్ల నరసింహ, జినుకుంట్ల అంజనేయులు,వెంకటేశ్వర్లు, సిం గం నరసింహ, నాగమ్మ, యాదయ్య పాల్గొన్నారు.

## నల్లగొండలో యూరియాకు కొరత లేదు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకే సుమారు 70 శాతం మంది రైతులు యూరియాను కొనుగోలు చేశారని,జిల్లాలో ప్రణాళిక ప్రకారం యూరియాను రైతులకు అందించడం జరుగుతున్నదని అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో యూరియా, ఇతర ఎరువుల లభ్యత, నియంత్రణలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి, ఇతర అధికారులతో సమీక్షిస్తూ యూరియాను వ్యవసాయేతర పనులకు వాడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకవేళ ఎవరైనా వ్యవసాయానికి కాకుండా పరిశ్రమలు, ఇతర పనులకు వాడినట్లయితే అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. యూరియా పక్కదారి పట్టకుండా పోలీస్ ,రెవిన్యూ ,ఇతర అధికారులు,సిబ్బందితో ఏర్పాటుచేసిన టాస్క్ ఫోర్స్ కమిటీలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. యూరియా కొరతను అధిగమించేందుకు రైతులు ఒక పంట కాలంలో నానో యూరియాను వినియోగించాలని, నానో యూరియా వల్ల మంచి ఫలితాలను పొందవచ్చని, ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తదితరులు ఉన్నారు.





## గీత కార్మికుల హక్కుల కోసం పాపన్న గౌడ్ పోరాటాలు

ప్రజాపక్షం/ఉండవెల్లి : తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అల్లంపూర్ నియోజకవర్గంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకలను చేపట్టారు. ఈ సందర్భంగా గౌడ్ సంఘం నాయకులు రవి ప్రకాష్ గౌడ్, మాట్లాడుతూ గీత కార్మికులకు కోసం ప్రభుత్వాలతో పోరాటం చేసి న్యాయమైన హక్కులు సాధించడంలో ఆయన సాటి మరి ఎవరు లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంగౌడ్, శేషంగౌడ్, ప్రకాష్ గౌడ్, జనార్ధన్ గౌడ్, కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

### పాపన్న గౌడ్ ఆశయాలు బిఎస్పితో సాధ్యం

ప్రజాపక్షం/ఎర్రవల్లి: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపోగు రాంబాబు అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ధర్మవరం రాముడు ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పాపన్న గౌడ్ స్ఫూర్తితో బహుజన రాజ్యం నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, శివన్న, వడ్డే కృష్ణ, గోపాల్, తిక్కయ్య పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ ఫ్రిక్వెన్సీ కేబుల్ చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

రూ.2లక్షల 75వేల నగదుతోపాటు రూ.40వేల విలువైన 270మీటర్ల రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్ స్వాధీనం..


జిల్లా ఎస్పి నరసింహ్మ వెల్లడి



ప్రజాపక్షం/సూర్యాపేట : మునగాల, నడిగూడెం మండల్లాలో బిఎస్ఎన్ఎల్ ఫ్రిక్వెన్సీ కేబుల్ చోరీకి పాల్పడ్డ ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ.2లక్షల 75వేల నగదుతో పాటు, రూ.40వేల విలువైన 270 మీటర్ల రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి ఉపయోగించిన పరికరాలను సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పి కె నరసింహ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జూన్ నెలలో మునగాల, నడిగూడెం మండల్లాలో బిఎస్ఎన్ఎల్ టవర్స్‌కు సంబంధించి ఫ్రిక్వెన్సీ కేబుల్ దొంగతనానికి గురైనట్లు సంబంధిత అధికారులు ఆయా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు జిల్లా ఎస్పి తెలిపారు. వారి ఫిర్యాదుమేరకు మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ధర్యాప్తు చేయగా సోమవారం ఉదయం 8 గంటలకు మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌కు అందిన నమ్మదగ్గ సమాచారంతో ఆకుపాముల గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకొని విచారించినట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండలం రాజాపురం గ్రామానికి చెందిన మహంకాళి శ్రీనాథ్, అదే గ్రామానికి చెందిన బద్దుల వంశీకృష్ణలు కోదాడ పట్టణములోని బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. నాలుగు నెలలుగా తొమ్మిది బిఎస్ఎన్ఎల్ పై నిఘా పెట్టారు. ఇందులో మునగాల, కోదాడ టౌన్, హాలియా, చిలుకూరు, నేలకొండపల్లి, హుజూర్‌నగర్, నడిగూడెం, మిర్యాలగూడ టు టౌన్, గరిడేపల్లిలో ఫ్రీక్వెన్సీ కేబుల్స్‌ను చోరీ చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. వీరు ఇద్దరే కాకుండా కోదాడ పట్టణానికి చెందిన చలిగంటి శ్రవణ్‌కుమార్ కూడా ఉన్నారని ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. కేబుల్ చోరీ చేసిన తర్వాత కాల్చి దానిలో నుండి కాపర్ వైరును తీసి బస్తాలలో ప్యాక్ చేసి హైదరాబాద్‌లోని జీడిమెట్ల, పఠాన్‌చెర్వు ప్రాంతాలలో అమ్మి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇలా తొమ్మిది చోరీలకు పాల్పడ్డారని మొత్తం రూ.3లక్షల 25వేల విలువైన బిఎస్ఎన్ఎల్ టవర్ కేబుల్స్ దొంగలించగా వారి వద్ద నుండి రూ.2లక్షల 75వేల నగదు, నడిగూడెం స్టేషన్‌కు సంబంధించిన కేసులో 270 మీటర్ల కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీకి ఉపయోగించిన ఫోర్డ్ కారు, కట్టర్, హ్యాక్సా బ్లేడ్‌ను స్వాధీనం చేసుకొని నింధితులను కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ కేసును చాకచక్యంగా చేధించిన మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది కొండల్, యం రామారావులను ఎస్‌పి అభినందించి, రివార్డును అందించారు.



# సాగర్ ప్రాజెక్టుకు భారీ వరద



ప్రజాపక్షం/నందికొండ: లక్షకు పైన ఇన్‌ఫ్లోతో రాష్ట్ర మంత్రుల ఆధ్వర్యంలో జులై 29న మొదటిసారి తెరచుకున్న ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లు సోమవారం అకస్మాత్తుగా ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగటంతో అందునా అది 331699 క్యూసెక్కుల పైన ఉండటంతో ప్రాజెక్ట్ అధికారులు వెంటనే అప్రమత్తమై మొదట 4 గేట్లు 10 అడుగుల మేర పైకి లేపిన అధికారులు వరద అదుపులోకి రాకపోవడంతో మరలా 8 గేట్లను 10 అడుగుల18 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి మొత్తం 26 గేట్ల ద్వారా 251582 క్యూసెక్కుల నీటిని స్పీల్ వే ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సీజన్లో ఇంత పెద్ద ఇన్ ఫ్లో రావటం ఇదే తొలిసారి కావడం గమనార్హం.పక్షం రోజుల వ్యవధిలో ప్రాజెక్టు మొత్తం 26 గేట్లు తెరు చుకోవడం ఇది మూడవ సారి. స్పీల్ వే కుడి ఎడమ, కాలువలు, ,జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి, 293663 క్యూసెక్కుల నీటిని మొత్తం అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు సోమవారం సాయంత్రానికి 585.80 అడుగులుగా ఉన్నది. సెలవు రోజులు కాకపోయినా సాగర్ అందాలను తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకుల తాకిడి, వాహనాల రద్దీ ఏమాత్రం తగ్గలేదు దీనితో 26 గేట్ల ద్వారా సాగర్ ప్రాజెక్ట్ స్పీల్ వే మంచి జాలువారుతున్న అందాలను పర్యాటకులు సెల్ఫీ లతో తమ ఫోన్లలో బంధిస్తు ఆనందిస్తున్నారు పర్యాటకులు భారీగా పెరగడంతో హిల్ కాలనీలో ఉన్న , ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త వంతెనల వద్ద పర్యటకులతో కళకళలాడింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తూ ఉన్నారు. ప్రాజెక్టు అందాలను దగ్గర నుండి తిలకించడానికి ప్రాజెక్టు పైకి ఎవరిని అనుమతించకపోవడంతో పర్యాటకులు వెనుతిరుగుతున్నారు.

## వర్షానికి ధ్వంసమైన రోడ్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**ప్రజాపక్షం/కొత్తకోట :** ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తకోట మున్సిపాల్టీ పరిధిలోని 5, 6 వార్డులో ఇంటర్నల్ రోడ్స్ ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలుగా మారి, బురదమయమై, ధ్వంసమైన , రోడ్లను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దండుగేరి చౌరస్తా నుండి అంగన్‌వాడీ స్కూల్ భవనం ముందు నుండి కుమ్మరి కుంట మెయిన్ రోడ్డును కలుపుతూ ఎస్సీ హాస్టల్ , కృష్ణ టెంపుల్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచన చేయడం జరిగిందన్నారు. రోడ్డు వేసే సందర్భంలో మురుకు కాలువలు వాళ్లకు సంబంధించిన స్లాబ్ కలవట్లు వరద నీరు వెళ్లేందుకు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాందాపురం లక్ష్మ య్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మేస్త్రీ శ్రీను, జేసిబి రాములు, పి. రాంమోహన్ రెడ్డి, సాయిరాం, వెంకటేష్ , కమిషనర్ సైదయ్య, ఏఈ ప్రశాంత్ , రవిరెడ్డి, ఊసన్న, రాజు, కొత్త కోట పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రానికి చెందిన జంగిలివసంత రాష్ట్ర పుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.25,500 చెక్కును సోమవారం బిఆర్ఎస్ నాయకులు జంగిలి ఆనంద్ ఆధ్వర్యంలో వసంతకు అందజేశారు. ఈసందర్భంగా అనారోగ్యానికి గురైన వసంత మాట్లాడుతూ అనారోగ్యానికిగురై ఆస్పత్రిలో చేరానని, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రావడానికి సహకరించినవారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జ్యోతినిరంజన్, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపిటిసి లింగంముది రాజ్, బిఆర్ఎస్ నాయకులు మాడ్గుల శంకర్, ప్రవీణ్, సత్యం, పోలే అశోక్, రవి, శ్రీనివాస్, వెంకట్,రామచంద్రయ్య,సంజీవ, రాజు,దాసు పాల్గొన్నారు.



## ఆధునిక వృత్తి విద్యా కోర్సులు, స్పాట్ అడ్మిషన్లు


### అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రస్తుతం బాగా డిమాండ్ ఉన్న వృత్తి విద్యా కోర్సుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు చేసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ సూచించారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో ఎటిసి గోడ పత్రికను అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఐటిఐ ప్రిన్సిపల్ రమేష్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పి వాటిలో ప్రస్తుతం బాగా డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టిందన్నారు. వనపర్తి జిల్లాలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ 34, బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫైయర్ మెకానికల్ ఇంజినీరింగ్ డిజైన్, అడ్వాన్స్డ్ సిఎన్‌సి మిషన్ టెక్నీషియన్ ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ ఉన్నాయని తెలిపారు. ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కె. రమేష్ బాబుతో పాటు జిల్లా లేబర్ ఆఫీసర్ బి.వేణుగోపాల్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి జానీ పాషా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి పెట్టండి**

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 22 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాపన్న గౌడ్ జయంతి



**ప్రజాపక్షం/మద్దూర్ :** మున్సిపాలిటి పట్టణ కేంద్రంలో సోమవారం రోజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఘనంగా జరుపుకున్నారు.ఈ సంధర్భంగా కొడంగల్ తాలుక గౌడ సంఘం అధ్యక్షుడు విరేష గౌడ్ మాట్లాడుతూ బహుజన తొలి రాజ్యధికార పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. బహుజన రాజుగా చరిత్ర పుటల్లోకి ఎక్కిన సర్దార్ పాపన్నగౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ మండల గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు ఇలా.... వెళ్లేదెలా?



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల కేంద్రంలో మార్కెట్ యార్డు నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు నడకమార్గంలో వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలోకి చేరడం వల్ల ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## బాధితులకు సత్వర న్యాయం :ఎస్పీ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 06 మంది ఫిర్యాదుదారులు నేరుగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుల పై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై మొదటగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అనంతరం క్షేత్ర స్థాయిలో బాధితుల గ్రామాలకు వెళ్లి విచారించి తదుపరి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఎస్పీ తెలిపారు. భూతగాదాలకు సంబంధించిన ఫిర్యాదులను రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి త్వరితగతిన కేసులను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. బాధితుల యొక్క ఫిర్యాదులను ఆన్లైన్లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## మాజీ ఎమ్మెల్యే జయంతి

**ప్రజాపక్షం/మక్తల్ :** దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి 72 జయంతి సందర్భంగా వారి కుమారుడు కొత్తకోట సిద్ధార్థ రెడ్డి వారి అభిమానులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులు , నాయకులు మక్తల్ పట్టణంలోని పడమటి అంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తకోట దయాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుమారుడు కె. సిద్ధార్థ రెడ్డి తండ్రి జ్ఞపకార్థం గురుకుల పాఠశాల నందు ఉపాధ్యాయ బృందం విద్యార్థుల కోరిక మేరకు ఆ పాఠశాలకు 30 ఫ్యాన్లు 30 ట్యూబ్‌లైట్స్ ఇవ్వడం జరిగింది. తదుపరి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ వాడ్వట్, బలరాం రెడ్డి, సిద్ధార్థ రెడ్డి, రాకేష్, శ్రీనివాస్ రెడ్డి, కురుమయ్య గౌడ్, చెన్నయ్య గౌడ్, ఆంజనేయులు గౌడ్, మోహన్ రెడ్డి, గుర్లపల్లి శేఖర్ రెడ్డి, ఎల్ల గౌడ్, నరిసింహారెడ్డి, గుండప్ప, నరేందర్ రెడ్డి, సంగం బండ, లక్ష్మి నారాయణ గౌడ్, సద్దాం హుస్సేన్, బాల్ రెడ్డి జక్లేర్, బాల్ రెడ్డి మక్తల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దుందుభినది, కేసరిసముద్రం చెరువును పరిశీలించిన కలెక్టర్



రాకపోకలను పూర్తిగా నిషేధించండి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ పట్టణంలోని కేసరిసముద్రం చెరువును, సిర్సవాడగ్రామపరిధిలో ప్రవహిస్తున్న దందుభినది ప్రవాహాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీవర్షాల నేపథ్యంలో చెరువు తూము, అలుగు పరిశీలించి ముంపు ప్రాంతాల వద్ద 24/7 సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండబెట్ల గ్రామం నుండి నాగర్‌కర్నూల్ పట్టణానికి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిఘా ఉంచాలని ఆదేశించారు. మత్స్యకారులు చెరువులోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటిమట్టాన్ని ప్రతిరోజు పరిశీలించి నివేదిక ఇవ్వాలని నీటిపారుదల శాఖను ఆదేశించారు. అనంతరం తాడూరు మండలపరిధిలోని సిర్సవాడ గ్రామపరిధిలో ప్రవహిస్తున్న దుందుభినది ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీచేశారు. సిర్సవాడ, మాదారం ఉధృతంగా ప్రవహిస్తున్న సందర్భంగా రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధితశాఖల అధికారులు ఉన్నారు.

**ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలి :**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని పంపించవద్దని పాల్గొనాలని స్పష్టం చేశారు. 30వినతులు అందగా వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఐటిఐల్లో విద్యార్థుల నమోదుకు ప్రాధాన్యత ఇవ్వాలి**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి, మన్ననూరులో ఉన్న ఐటిఐ అడ్వాన్స్ టెక్నాలజి సెంటర్లలో ప్రవేశాలను పెంచేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. విద్యార్థులు ఐటిఐలలో నమోదు చేసుకోవడాన్ని జిల్లా అధికారులు ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశమందిరంలో ఐటిఐలో ఖాళీల భర్తీకై వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పి.అమరేందర్, దేవసహాయంలతో కలసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ నమోదు అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో యువత ఆకోర్సులలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా టిజిఎటిఈ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా కన్వీనర్ మన్ననూర్ ఐటిఐ ప్రిన్సిపాల్ లక్ష్మ ణ్ స్వామి, ఐటిఐ కల్వకుర్తి ప్రిన్సిపాల్ జయమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి మెంబర్ రాఘవేంద్రసింగ్, జిల్లాకార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఘనంగా సర్వాయిపాపన్నగౌడ్ జయంతి వేడుకలు**

బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ సబ్బండ వర్గాల సమానత్వం, వారి సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో వెనకబడిన తరగతులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్‌సర్వాయిపాపన్నగౌడ్ 375వ జయంతిసందర్భంగా సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లావెనకబడిన తరగుతల సంక్షేమశాఖ అధికారి ఖాజానజీమ్‌ఆలీ అప్సర్, కులసంఘాల నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒక్క విద్యుత్ ప్రమాదం కూడా జరగకుండా చూడాలి



అధికారులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాలు

**ప్రజాపక్షం/జడ్చర్ల:** మరోవారం పదిరోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చెరువుల కట్టలు బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి కోరారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల పట్టణంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా మరో 20 ఏళ్ల వరకు సరిపోయే ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ అధికారులను కోరారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట వివరాలను తనకు తక్షణం తెలియజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూ, మున్సిపల్, ప్రజారోగ్య శాఖల అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగానే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా నియోజకవర్గంలోని అన్ని చెరువుల నుండి అలుగులు పారుతున్నాయని, అయితే ఈ వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగితే బలహీనమైన చెరువు కట్టలు తెగిపోయిన ఈళ్లంతా వృధాగా వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడటం కోసం రూ.11 కోట్లతో సేఫ్టీ, బడ్జెట్‌ను ప్రభుత్వానికి పంపామని, ఆ నిధులు త్వరగా వచ్చేలా చూడాలని అధికారులు కోరగా, ఈ విషయం గురించి తక్షణ చర్యలు తీసుకోవాలని అనిరుద్‌రెడ్డి విద్యుత్ శాఖ సీఎండీని ఫోన్ లో కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే నియోజకవర్గంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ అధికారులను అనిరుధ్ ఆదేశించారు.

# కర్ని వెళ్ళే దారిలో ఎవరినీ రానివ్వొద్దు

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలం కర్ని గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టుపై పారుతున్న వరద నీటి ఉధృతి తగ్గే వరకు ప్రజల రాకపోకలను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం మక్తల్ మండలం నుండి గ్రామాలకు వెళ్ళే దారి కర్ని చిట్యాల పంచదేవ్ పహాడ్ పారేవు ముస్లేపల్లి అనుగొండ గ్రామాల వెళ్లే దారిలో కల్వర్టుపై పారుతున్న వరద నీటి ప్రవాహాన్ని ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కర్నీ గ్రామానికి ఎగువ ప్రాంతంలో ఎన్నపల్లి, రుద్రసముద్రం, గొల్లపల్లి గ్రామాల చెరువులు నిండి అలుగు పడుతున్నాయని, ఆయా చెరువుల అలుగు నీరు కర్నీ గ్రామ కల్వర్టుపైకి చేరి మోకాళ్ళ లోతు వరకు ఉధృతంగా పారుతోందని, ఇలాంటి సమయంలో అటు వైపు ఉన్న గ్రామాల ప్రజలు ఇటు మక్తల్ వైపు రావడం ప్రమాదకరమని కలెక్టర్ తెలిపారు. కల్వర్టుకు రెండు వైపుల సిబ్బందిని ఉంచి ప్రజల రాకపోకలను నిలిపివేయాలని ఎంపీడీఓ రమేష్‌ను ఆదేశించారు. అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మక్తల్ తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో రమేష్‌లకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంకట ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ఉన్నారు.

**మక్తల్ మినీ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్**

మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో అధునాతనంగా స్టేడియాన్ని నిర్మించేదుకు క్రీడల శాఖ మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి ఆదేశాల నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మక్తల్ మినీ స్టేడియం నిర్మాణం కోసం ఎన్ని ఎకరాల స్థలం అవసరం? ప్రస్తుతం మైదానం ఎన్ని ఎకరాలలో ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతన మినీ స్టేడియం మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్ ప్రస్తుతమున్న స్టేడియంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం భవనాలను తొలగించే విషయమై ఆమె అధికారులతో చర్చించారు. మైదానంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనాలను కలెక్టర్ వర్షంలోనే పరిశీలించారు. జూనియర్ కళాశాలకు సంబంధించిన ఒక భవనం శిథిలావస్థకు చేరిందని, మరో భవనం బాగుందని డీవైఎస్ఓ వెంకటేష్ కలెక్టర్‌కు తెలపగా భవనాలను ఆమె చూశారు. కలెక్టర్ సూచించడంతో జూనియర్ కళాశాలను సమీపంలోనే ఉన్న ఓ ప్రైవేట్ భవనంలోకి షిఫ్ట్ చేసేందుకు మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించినట్లు డీవైఎస్ఓ కలెక్టర్‌కు తెలిపారు. అలాగే డిగ్రీ కళాశాలను కూడా ప్రైవేట్ భవనంలోకి మార్చాల్సి వస్తుందని అందుకు అనుకూలమైన భవనాన్ని చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మైదానంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని కూడా ఆమె పరిశీలించారు. నూతన మినీ స్టేడియం నిర్మాణానికి ఉన్నత విద్యా శాఖ, క్రీడా శాఖ ఉన్నతాధికారుల సమన్వయం అవసరమని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో రమేష్, మున్సిపల్ కమిషనర్ శంకర్, పీఆర్‌డిఈ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం



కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృతి జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు స్థానికి సంస్థల అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు.


**గురుకుల విద్యా సంస్థలు, హాస్టళ్లు తనిఖీ చేయాలి**

రెసిడెన్షియల్ పాఠశాలలు, కె,జి.బి.వి.లు సంక్షేమ హాస్టళ్లు మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు కేటాయించిన హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కె.జీ.బి.వి.లు తనిఖీ చేసి సమస్యలను గుర్తిస్తే రిపేర్, మౌలిక వసతులు, అత్యవసర పనులను వెంటనే అంచనా వేసి మంజూరు తీసుకొని పనులు చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్‌లు తనిఖీ చేపట్టకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి వారికి షోకాజ్ జారీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ న ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు పి.ఎం.ఏ వై సర్వే చేసి అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యతగా భావించి ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రతి రోజు 10 ఇండ్లు చేయాలని, అప్పుడే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ మంజూరు అవుతుందని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ఎం.పి.డి.ఓ.లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వాతావరణ శాఖ సూచనలు వర్షాలు పడుతున్నందున అనుసరించి మండల ప్రత్యేక అధికారులు, ఏం.పి.డి.ఓ.లు తహశీల్దార్‌లు, జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జడ్‌పి సిఈఓ వెంకట్‌రెడ్డి, డి ఆర్.డి.ఓ నర్సింహాల గృహ నిర్మాణ శాఖ పి.డి. వైద్యం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను మరమ్మతులు చేస్తాం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఇరిగేషన్ శాఖ మంత్రితో మాట్లాడి అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి హన్వాడ మండలంలోని అన్ని చెరువులను మరమత్తులు చేసి శాశ్వత పరిష్కారం చూపిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మహబూబ్‌నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలం, ఇబ్రహీంబాద్‌లోని హేమ సముద్రం గండి పడిందని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే సోమవారం హేమ సముద్రాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులతో, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండి పడిన విషయం తెలిసిన వెంటనే హేమ సముద్రం మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీరియర్ నాయకులు ఎన్.పి.వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, బుద్దారం సుధాకర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్మాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, డిసిసి కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, నాయకులు సత్యారెడ్డి, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, గంగిరెడ్డి, సుధాకర్ రెడ్డి తహసిల్దార్ కిష్టయ్య నాయక్, ఎంపిడిఓ యశోద, రైతులు తదితరులు పాల్గొన్నారు.





## చలో మేడ్చల్ గోడపత్రికలు విడుదల

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలకేంద్రంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల గోడపత్రికలను సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివశంకర్, సిపిఐ తాడూరు మండల సహాయ కార్యదర్శి దాంగట్ల వెంకటస్వామి విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఏర్పడిన సిపిఐపార్టీ నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తూ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తుందన్నారు. కమ్యూనిస్టుపార్టీ పేదల పక్షనా నిరంతరం పోరాడుతూ అధికారం ఉన్నా లేకున్నా వందోసంవత్సరంలోకి అడుగుపెట్టిన చరిత్ర సిపిఐకి దక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను ప్రశ్నించి నిలదీసి నిర్బంధాలుచేసే అనేక చట్టాలను సాధించినపెట్టిన సిపిఐకే దక్కిందన్నారు. కార్యక్రమంలో తాడూరు గ్రామశాఖ కార్యదర్శి ఎనుపోతుల స్వామి, కురుమూర్తి, తాడూరు గ్రామశాఖ సహాయ కార్యదర్శి గొర్లసత్యం, సైదులు, పెద్దకుర్మయ్య పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** హైదరాబాద్ మేడ్చల్ జిల్లాలో జరిగే భారత కమ్యూనిస్టుపార్టీ(సిపిఐ) 4వరాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కొమ్ము భరత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తాడూరు మండలం అంతారం గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామశాఖ మహాసభలు మండలశాఖ, జిల్లా మహాసభలు పూర్తిచేసుకొని రాష్ట్ర మహాసభలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈమహాసభలలో గతమూడు సంవత్సరాలుగా నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని సాధించిన విజయాలను ప్రజలకోసంచేసిన పోరాటాలను నెమరువేసుకొని భవిష్యత్తుపోరాట కార్యక్రమాన్ని రూపొందించుకోవడం ,నూతన కమిటిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈమహాసభలకు జాతీయప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు, జాతీయకార్యవర్గసభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయనాయకులు పల్లావెంకట్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కావున జిల్లాలోని నలుమూలలనుండి కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొమ్ము కృష్ణయ్య, లక్ష్మణ్, బసవయ్య, భీమయ్య, ఆంజనేయులు, బహుగుణ, రాహుల్, అనిల్, స్వామి, నాని పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అమరచింత :** సిపిఐ పార్టీ రాష్ట్ర 4వ మహసభలు రేపటి నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలో జరగనున్న సభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ అమరచింత మండల కేంద్రంలో సోమవారం సిపిఐ పార్టీ శ్రేణులు గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సిపిఐ పార్టీ అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మహసభలకు జాతీయ, రాష్ట్ర స్థాయి సిపిఐ పార్టీ అగ్ర నాయకులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ మహసభలను జయప్రదం జేయాలని వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.భాస్కర్, శ్యాం సుందర్, ఎర్రన్న, సౌలు తదితరులు పాల్గొన్నారు.

## దంచి కొడుతున్న వానలు..

**ప్రజాపక్షం/మాగనూర్ :** ఎడతెరిపి లేకుండా వర్షం దంచి కొట్టడంతో మాగనూర్ మండలంలో వాగులు ఉప్పొంగుతున్నాయి. ఎగువున ఉన్న కర్ణాటక రాష్ట్రంలో భారీగా వర్షాలు కురడంతో చిన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో మాగనూరు మండల కేంద్రం నుండి వర్కూర్ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షానికి తోడు సోమవారం సంఘం బండ బాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి ఐదు గేట్లు ఎత్తి నీరు దిగువకు విడుదల చేయడంతో మాగనూరు పెద్దవాగు ఉగ్రరూపం దాల్చింది నేరడగం బ్రిడ్జిపై నుండి నీర ప్రవహిస్తుండడంతో బైరంపల్లి, ఉజ్జెలి, నేడుగం, నుండి మక్తల్ కు రాకపోకలు బంద్ అయ్యాయి. సత్యారం బ్రిడ్జిపై నుంచి నీరు పారుతుండడంతో సత్యారం, కొల్పూరు, మందిపల్లి, గజరందొడ్డి, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద వచ్చిన ప్రతిసారి బ్రిడ్జి మునగడం రాకపోకలు బంద్ కావడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హై లెవెల్ బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రభుత్వ అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.

# క్రీడ

## ఫైనల్ చేరిన ఇటలీ కెరటం



వరల్డ్ మాజీ సీడ్ ఇగా స్వియాటెక్ కోర్టులో యూఎస్ ఓపెన్ సన్నాహక టోర్నీలో జోరు చూపిస్తోంది. ఈమధ్యే వింబుల్డన్ విజేతగా నిలిచిన ఆమె సిన్సినాటి ఓపెన్ టోర్నమెంట్ ఫైనల్లో అడుగుపెట్టింది. ఉత్కంఠగ సాగిన సెమీఫైనల్లో ఎలీనా రిబాకినాను చిత్తుగా ఓడించింది. రెండో సెమీస్‌లో ఏడోసీడ్ జాస్మినె పాలొని అతికష్టమ్మీద గెలిచింది. తద్వారా రెండోసారి డబ్ల్యూటీఏ 1000 ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో రిబాకినా హోరాహోరీగా తలపడ్డారు. తొలిసెట్‌ను 75తో గెలుచుకున్న స్వియాటెక్ రెండో సెట్‌లో మరింత దూకుడు కనబరిచింది. రెండో ఫైనలిస్ట్ జాస్మినే పాలోని (ఇటలీ) మాత్రం చెమటోడ్చాల్సి వచ్చింది. అన్‌సీడెడ్ వెరోనికా కుదెర్మోటోవా ధాటికి రెండో సెట్ కోల్పోయినా.. ఆ తర్వాత పుంజుకొని మూడో సెట్ కైవసం చేసుకుంది. పాలోని – స్వియాటెక్ మ్యాచ్ విషయానికొస్తే.. మెరుగైన రికార్డు ఉంది. ఇప్పటివరకూ ఇరువురు ఐదుసార్లు తలపడగా అన్నింటా విజయం సాధించింది. ఆగస్టు 24నుంచి యూఎస్ ఓపెన్ ప్రారంభం అవుతుంది.

## ఆ ఇద్దరిలో ఒకరికి ఛాన్స్..!

### ఆసియా కప్‌లో గిల్, జైస్వాల్‌కు చోటు కష్టమే..



టీమిండియా వచ్చే నెలలో ఆసియా కప్‌లో ఆడనున్నది. ఈ టోర్నీలో జట్టు కూర్పుపై చర్చలు సాగుతున్నాయి. యువ టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌కు టీ20 జట్టులో చోటు కల్పిస్తారా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఆసియా కప్ యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరుగనున్నది. టీమిండియా శుభ్‌మన్ గిల్ సారథ్యంలో ఇంగ్లాండ్‌లో అద్భుతంగా రాణించింది. జైస్వాల్ సైతం తనదైన ముద్రవేశారు. అయితే, టెస్ట్ సిరీస్‌లో రాణించిన ఇద్దరికి టీ20 జట్టులో చోటు దక్కించుకోవడం కష్టంగానే కనిపిస్తున్నది. ఈ టోర్నీ కోసం భారత జట్టును సెలక్షన్ కమిటీ మంగళవారం ప్రకటించే అవకాశాలున్నాయి.

నివేదికల ప్రకారం.. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో గతంలో పలుసార్లు రాణించిన ఆటగాళ్లపైనే ఆధారపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గంభీర్ హెచ్‌కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక భారత జట్టు 15 టీ20 మ్యాచుల్లో 13 గెలిచింది. ఈ సారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరిగే విషయం తెలిసిందే. భారత కొత్త టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు. 25 ఏళ్ల యువ టీ20 కెప్టెన్ జట్టును అద్భుతంగా నడిపించడంతో పాటు బ్యాట్‌తోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌తో ఐదుమ్యాచుల సిరీస్‌ను భారత్ 22 తేడాతో డ్రా చేరసుకుంది. ఈ పర్యటనలో గిల్ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. 754 పరుగులు చేశాడు. 75.40 సగటుతో పరుగులు చేయగా.. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. బెస్ట్ సోర్క్ 269 పరుగులు, అద్భుతమైన బ్యాటింగ్‌తో జులై నెలలో ఐసీసీ బెస్ట్ ఆటగాడిగా ఎంపికయ్యాడు. ఈ ఏడాది గిల్ మొత్తం సగటు 64.94తో 20 ఇన్సింగ్స్‌లో 1234 పరుగులు చేశాడు. ఇందులో ఆరు సెంచరీలు ఉన్నాయి. రెండు హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. ఈ సంవత్సరం అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఇంతకు ముందు బెన్ డకెట్ ఈ ఘనత సాధించాడు. 23 మ్యాచ్‌ల్లో 47.77 సగటుతో 1290 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, ఎనిమిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 165 పరుగులు. సమాచారం.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) యొక్క స్లో పిచ్‌లపై బాగా ఆడగల అనుభవజ్ఞుడైన మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ కోసం జట్టు మేనేజ్‌మెంట్ వెతుకున్నది. శ్రేయాస్ అయ్యర్, జితేశ్ శర్మలో ఎవరో ఒకరు టీ20 జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ప్రో కబడ్డీ 12వ సీజన్‌కు సిద్ధం



ప్రో కబడ్డీ లీగ్ పదకొండో సీజన్ ఛాంపియన్ హర్యానా స్టీలర్స్ మరో టైటిల్ కోసం పక్కాగా సన్నద్ధమవుతోంది. 12వ సీజన్‌లోనూ ట్రోఫీతో చరిత్ర సృష్టించాలనుకుంటున్న హర్యానా ఫ్రాంచైజీ సూపర్ డిఫెండర్ జైదీప్ దహియాకు మరోసారి కెప్టెన్సీ అప్పగించింది. తొలిసారి తమ జట్టు పీకేఎల్ విజేతగా అవతరించడంలో కీలక పాత్ర పోషించిన దహియాకు.. రాహుల్ సేథ్‌పాల్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడని యాజమాన్యం తెలిపింది. మ్యాచ్ సమయంలో వేగంగా, తెలివిగా నిర్ణయాలు తీసుకోగల నైపుణ్యం ఉన్నందున ఈ ఇద్దరిని ఎంపిక చేశామని కోచ్ మన్‌ప్రీత్ సింగ్ వెల్లడించాడు.

'కబడ్డీ ఆటలో ఐకమత్యంతో పాటు వేగంగా నిర్ణయం తీసుకునే నేర్పు ఉండాలి. జైదీప్, రాహుల్‌కు ఈ రెండు నైపుణ్యాలు ఉన్నాయి. ఇద్దరూ మ్యాట్ మీద ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేయడంలో ఇద్దరు ది బెస్ట్. క్రమశిక్షణ, నిలకడ.. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గత సీజన్‌లో మా జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో జైదీప్, రాహుల్ కీలక పాత్ర పోషించారు. ఈ ఏడాది కూడా మేము టైటిల్‌పై కన్నేశాం' అని కోచ్ మన్‌ప్రత్ సింగ్ అన్నాడు.

పీకేఎల్ స్టార్ అయిన జైదీప్ దహియా హర్యానా జట్టుకు కొన్నాళ్లుగా ఆడుతున్నాడు. 87 మ్యాచుల్లో 231 రైడ్ పాయింట్లు సాధించిన దహియా.. డిఫెన్స్‌లోనూ సత్తా చాటి 227 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. రాహుల్ కూడా హర్యానా బెస్ట్ ప్లేయర్. గత సీజన్‌లో అతడు 24 మ్యాచుల్లో 73 టాకిల్ పాయింట్లతో రాణించాడు.

### హర్యానా స్టీలర్స్ స్క్వాడ్

**రైడర్స్ :** నవీన్ కుమార్, శివం పతారే, వినయ్ తెవాటియా, షాహన్ షా మహమ్మద్, ఘనశ్యామ్ రోకా మగర్, మయాంక్ సైనీ, జయసూర్య ఎన్ఎస్, విశాల్ తటే, వికాస్ జాదవ్. **ఢిఫెండర్లు :** జైదీప్ దహియా, రాహుల్ సేథ్‌పల్, రాహుల్ అహ్రి, రితికా గుర్జర్, జుబైర్ మాలిక్, హర్దీప్ కండోలా, అంకిత్ ధుల్, సచిన్ దహియా, ఎన్ మణికందన్. **ఆల్‌రౌండర్లు :** అశిష్ నర్వాల్, సహిల్ నర్వాల్.

# ఫోకస్ యువతరంగం

## శక్తివంతమైన విభాగాలు..



కృత్రిమ మేధస్సు (ఎఐ), మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటివి భవిష్యత్ సాంకేతికాలు. భవిష్యత్తు ప్రపంచాన్ని ఆకారమిస్తోన్న శక్తివంతమైన శాస్త్ర విభాగాలు ఇవే. ఇవి ఉద్యోగ రంగాన్ని, జీవన శైలిని మారుస్తున్నాయి. అందుకే వాటి పట్ల అవగాహన కలిగి ఉండటం, పోటీతత్వ ప్రపంచంలో నిలవడానికి కీలకం. ఎఐతో వాయిస్ అసిస్టెంట్లు, ఛాట్‌బాట్‌లు, డేటా విశ్లేషణ, ఆరోగ్య, ఆర్థిక రంగాల్లో విస్తృత వినియోగంతోపాటు ఉద్యోగాల స్వభావం కూడా మారుతున్నదనేది వాస్తవం. డేటాను విశ్లేషించి, నిర్ణయాలు తీసుకునే సాంకేతికత మరింత ఖచ్చితమైన రిపోర్టింగ్, పర్సనలైజ్డ్ సర్వీసులు అందించడం ఇప్పుడు సాధ్యమవుతున్నది. రోబోటిక్స్ నేడు ఫ్యాక్టరీలు, హెల్త్‌కేర్, రక్షణ రంగాల్లో విస్తరణమానవ శ్రమను తగ్గిస్తున్నాయి. ఈ వేగవంతమైన సాంకేతిక మార్పులు మన సామాజిక, ఆర్థిక జీవన శైలిని ప్రభావితం చేస్తున్నాయి. కాబట్టి విద్యార్థులకు, యువతకు దీన్ని గురించి విద్యాసంస్థల స్థాయిలోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఫలితంగా సాంకేతిక విజ్ఞానానికి విద్యా వ్యవస్థలో ప్రాధాన్యం పెరుగుతున్నది. ఇప్పటి విద్య విధానం టెక్నాలజీ ఆధారితంగా మారుతోంది. కానీ టెక్నాలజీ వాడకం మాత్రమే కాదు, దాని ప్రాథమిక సూత్రాలు, బాధ్యతాయుత వినియోగం గురించికూడా విద్యార్థులలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. టెక్నాలజీ ఆధారిత బోధన అత్యవసరమైంది. డిజిటల్ బోర్డులు, స్మార్ట్ క్లాసులు, ఆన్‌లైన్ పరీక్షల వేదికలు రంగప్రవేశం చేశాయి. టెక్నాలజీలో నైపుణ్యం భవిష్యత్తుకు తప్పనిసరిగా మారింది. అందుకే, :కోడింగ్, డిజిటల్ గణితండేటా విశ్లేషణ నైపుణ్యంఆన్‌లైన్ అభ్యాసం పట్ల తగిన శిక్షణప్రాథమిక స్థాయిలోనే టెక్నాలజీ పట్ల ఆసక్తి కలిగేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.



మన దేశంలో అంతగా ప్రచారంలో లేదుగానీ, చాలా దేశాల్లో స్కేట్‌బోర్డ్‌ను ఒక హాబీగానూ, క్రీడగానూ భావిస్తుంటారు. అయితే, ఈ స్కేట్‌బోర్డ్‌పై బ్యాలెన్స్ తప్పకుండా ముందుకు వెళ్లడం కష్టం. ఇక విన్యాసాలు చేయడమంటే ప్రాణాలతో చెలగాటం ఆడడమే. కానీ, ఆసక్తి, అదే స్థాయిలో కృషి ఉండాలేగానీ సాధించలేనిది ఏమీ లేదని జపాన్‌కు చెందిన ఎమా కవాకామి నిరూపిస్తున్నాడు. స్కేట్‌బోర్డ్‌పై అసాధారణ విన్యాసాలు ప్రదర్శిస్తూ, గిన్నిస్ రికార్డును నెలకొల్పిన ఆ బాలుడి వయసు కేవలం 9 సంవత్సరాలు. అత్యంత కష్టతరమైన స్కేట్‌బోర్డ్ విన్యాసాలు చేయడమే కాదు... ఒక నిమిషంలో అత్యధిక బ్యాక్‌సైడ్ 540 స్కేట్‌బోర్డ్ ట్రిక్స్, 8 జంప్‌లతో ప్రపంచ రికార్డు సృష్టించాడు. స్కేట్‌బోర్డింగ్ పట్ల అతనికి 5వ ఏటి నుంచి ఆసక్తి ప్రారంభమైంది. ఆ వెంటనే శిక్షణ మొదలుపెట్టాడు. అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న కవాకామికి ఇటలీలోని మిలన్‌లో జరిగిన ఒక టీవీ టాలెంట్ షోలో పాల్గొనే అవకాశం లభించింది. భారీగా హాజరైన ప్రేక్షకుల సమక్షంలో కవాకామి తన స్కేట్‌బోర్డింగ్ విన్యాసాలు ప్రదర్శించి, ఏకంగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు సోషల్ మీడియాలో అతనికి లక్షలాది మంది ఫాలోయర్లు కూడా ఉన్నారు. అరుదైన రికార్డును సొంతం చేసుకున్న కవాకామి నేటి యువతకు మార్గదర్శకుడు. నిజమైన యూత్ ఐకాన్.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



## గూడుకట్టుకుంటున్న అసంతృప్తి

యువ ఉద్యోగుల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటున్నది. అభద్రతా భావం పెరుగుతున్నది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) లక్నో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, కార్యాలయ వేధింపులు, నిర్లక్ష్యం చేయడం, అవమానించడం లేదా అమానవీయంగా ప్రవర్తించడం వంటి ప్రతికూల ప్రవర్తనలు వారి సృజనాత్మక ఆలోచనను అడ్డుకుంటున్నాయి. ఉద్యోగులు కొత్త ఆవిష్కరణలకు ఉపయోగపడే ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశాలను తగ్గిస్తున్నాయి. అందుకే చాలా సంస్థల్లో, ఉద్యోగులు మరొకరితో సంబంధం లేకుండా, స్వయంగా, రహస్యంగా వివిధ ప్రాజెక్టులపై పని చేస్తున్నారు. ఆలోచిస్తున్నారు. యాజమాన్యానికి తెలియకుండా వాటికి ఒక రూపాన్నిచ్చి, గణనీయమైన విజయాలను సాధిస్తాయన్న నమ్మకం ఏర్పడిన తర్వాత మాత్రమే వాటిని బహిరంగ పరుస్తున్నారని ఈ నివేదిక పేర్కొంది. సర్వేకు అవసరమైన డేటాను సేకరించడానికి పరిశోధకులు మిశ్రమ పద్ధతిని అనుసరించారు. ప్రయోగాత్మక వాతావరణంపై ఆధారపడి జరిగిన భాగంలో 112 మంది నుంచి సమాచారం సేకరించారు. అదే విధంగా సర్వేలో ఐటి ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న 313 మంది ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. ఈ అధ్యయనం ద్వారా, పని ప్రదేశంలో కనిపించనివంటి ప్రతికూల ప్రవర్తనలు ఉద్యోగుల సృజనాత్మకతను మౌనంగా దెబ్బతీసే విధానాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్టు ఐఐఎం బృందం పేర్కొంది. నిజమైన, సమర్థవంతమైన ఆవిష్కరణలు వెలుగుచూడాలంటే, ఉద్యోగులకు గౌరవం ఇవ్వాలని, మద్దతుగా నిలవాలని, ఒకరి అభిప్రాయాలు మరొకరు పంచుకునే వాతావరణాన్ని పని ప్రదేశాల్లో సృష్టించాలని యాజమాన్యాలకు సూచించింది. 'కార్యాలయ వేధింపులు' సహజంగానే ఉద్యోగులు సృజనాత్మక ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశాలను తగ్గిస్తాయని, అలాగే ప్రతికూల ప్రవర్తనలు ఉద్యోగులు సంబంధ శక్తిని కోల్పోయేలా చేస్తాయని ఈ బృందం తేల్చిచెప్పింది. ఈ అధ్యయనం ప్రకారం, మద్దతు, తగిన గుర్తింపు లభించినప్పుడే ఉద్యోగులు మరింత ఉత్సాహంగా, సర్వశక్తులు కేంద్రీకరించి పని చేస్తారు. అత్యుత్తమ ఫలితాలు రాబడతారు. అందుకు విరుద్ధంగా పని ప్రదేశాల్లో వాతావరణం నెలకొనడంతో, ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి, మరింత అసంతృప్తికి గురవుతున్నారు. సృజనాత్మక ప్రాజెక్టుల్లో పని చేస్తున్న వారు ఎక్కువగా యువతీయువకులే అన్నది నిజం. మేనేజర్లు, ఉద్యోగుల మధ్య స్నేహపూర్వకమైన సంభాషణల వల్ల ఈ సమస్యకు కొంత వరకూ తెరదించవచ్చు. అలాంటి వాతావరణం వల్ల సృజనాత్మక ఆలోచనలు పెరుగుతాయి. నైరాశ్యం తగ్గుతుంది. అసంతృప్తి మాయమవుతుంది. ఇలావుంటే, ఈ పరిశోధనకు డెన్మార్క్‌లోని కొపెన్‌హెగెన్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక 85వ అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎఒఎం) కాన్ఫరెన్స్‌లో 'బెస్ట్ పేపర్ ఇన్ ప్రొసీడింగ్స్' అవార్డు లభించడం విశేషం.

## అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదరరెడ్డి



**ప్రజాపక్షం/మోత్కూర్ :** అమరవీరుల స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదరరెడ్డి కోరారు. సిపిఐ మోత్కూర్ మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో బుజిలాపురం గ్రామంలో సిపిఐ నాయకుడు గుగ్గిల్ల ఎల్లయ్య ఏడో వర్ధంతి సభను అన్నెపు వెంకట్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి దామోదరరెడ్డి హాజరై ఎల్లయ్య స్మారక స్థూపానికి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎల్లయ్య చిన్నతనం నుంచే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితుడై గ్రామ సమస్యలపై పోరాటాలు చేశాడని, ఎఐటియుసి కార్మిక సంఘం నాయకుడిగా, ఆటో సంఘం అధ్యక్షుడిగా, బుజిలాపురం గ్రామ శాఖ కార్యదర్శిగా పనిచేశాడన్నారు. ఎల్లయ్య కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య, గీత పని వారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, పులకరం మల్లేష్, శాఖ కార్యదర్శి చేతురాశి సత్తయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు కార్యదర్శి మొగుళ్ళ తిరుపతిరెడ్డి, దొండ ఎల్లయ్య, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ల శేఖర్‌రెడ్డి, పోచం కన్నయ్య, పెండెం వెంకటేశ్వర్లు, మదూరి సోమిరెడ్డి, గుగ్గిళ్ళ నరసింహ, బోయిన ఉప్పలయ్య, గౌలుసుల యాదగిరి, జంగ లింగం, గంధమల్ల అంజయ్య, మొగుల నర్సిరెడ్డి, మలిపెద్ది మల్లారెడ్డి, గుగ్గిల్ల ఎల్లయ్య, కుమారులు భరత్, శివ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టులే



**ప్రజాపక్షం/దేవరకొండ :** స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీలేనని సిపిఐ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు స్పష్టం చేశారు. ఆగస్టు 20 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో జరగనున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సోమవారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ దేవరకొండ పట్టణ ఏరియా శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలం చెందాయన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అసంపూర్తితో గుంతల మయంగా ఉన్న రోడ్లను పూర్తి చేయాలని, సంవత్సరాలు గడుస్తున్న శిలాఫలకాలకే పరిమితమైన రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని, పట్టణంలో ప్రధాన సమస్యగా మారుతున్న కోతుల సమస్యను నివారించాలన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, నీలా వెంకటయ్య, పట్టణ సహాయ కార్యదర్శులు, ఏరియా శాఖ కార్యదర్శులు నగేష్, జ్యోతిబస్, వెంకటయ్య, మల్లయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలతో సిపిఐ బలోపేతం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ :** ప్రజాఉద్యమాలతో పార్టీని బలోపేతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లాలో బలంగా ఉందని, అన్ని మండలాల్లో పార్టీని బలోపేతం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని ఆయన అన్నారు. నిర్మల్ జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పి.పద్మ కుమారి అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి కలవేన శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని విమర్శించారు. కేంద్రం తీసుకువచ్చిన కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలపై ఉద్యమించాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల సాధనకు పోరాటం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలో కార్మికవర్గ సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. నిర్మల్ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో పార్టీ సభ్యత్వం ఉందని, మూడు నియోజకవర్గల్లో పార్టీ కార్యకలాపాలు విస్తరించి ఉన్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేసి, ప్రజల మధ్యకు వెళ్లాలని కలవేన శంకర్ కోరారు. పార్టీ సిద్ధాంతాలను, లక్ష్యాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను బలోపేతం చేయడంతోనే పార్టీ బలోపేతమవుతుందన్నారు. యువతను, మహిళలను పార్టీలోకి ఆకర్షించడానికి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని ఆయన సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన 4వ సిపిఐ జిల్లా మహాసభలకు సహకరించిన పార్టీ కార్యకర్తలకు, పట్టణ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. నిర్మల్ జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రజలు మరింత సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక...** సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడుగురు సభ్యులతో కూడిన కార్యవర్గంలో ఎస్.ఎన్,రెడ్డి, భుక్య రమేష్, వెంకటేశ్వర్, ఎస్.కైలాస్, పి.పద్మకుమారి, టి.గోపి. పి.ముత్యం ఉన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శిగా భుక్య రమేష్, జిల్లా సహాయ కార్యదర్శిగా వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల ఆగస్టు 20,21,22 తేదీలలో మేడ్చల్‌లో జరగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు శంకర్ పిలుపునిచ్చారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈనెల 19 నుండి 22 వరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని, ఈ సభలకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఎఐటియుసి జిల్లా నాయకులు వై.ఓమయ్య కోరారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం నిర్వహించే పోరాట కార్యక్రమాల రూపకల్పన చేసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిర్వహించబోయే పాత్ర చర్చించుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం బిసిల అభ్యున్నతికి చేసిన 42 శాతం రిజర్వేషన్‌పై చర్చించడంతో పాటు బిసి రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కోసం కార్యక్రమం రూపకల్పన చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర నాయకులు రఘురాం నాయక్, హనుమాండ్లు, సురేష్, ఫిరోస్ అలి, అనిల్, గంగాధర్, భానుచందర్, మహిపాల్, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** గెలుపు అవకాశాలను అధ్యయనం చేసుకుంటూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవ్వాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పల్లెగూడెంలో ఖమ్మంరూరల్ మండల కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. నువ్వుల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో మౌలానా మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం సిపిఐకి బలమైన కేంద్రాలన్నారు. అందుకు తగ్గట్టుగానే ఎన్నికలలో తమకున్న ప్రజా బలంపై కార్యచరణ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. కలిసివచ్చే అంశాలను సద్వినియోగం చేసుకుంటూ ఎర్రజెండా రెపరెపలాడేందుకు ప్రతి కార్యకర్త సైనికుల కృషి చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ మున్నుందు యువతరం సిపిఐలో కీలక భూమిక పోషించబోతున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగానే ఈ ప్రాంత పరిధిలోని యువతను నాయకత్వం దిశగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సంస్థాగతంగా బలోపేతం అయ్యేలా విస్తరణ వైపు ప్రయత్నం చేయాలని గ్రామ నాయకత్వాలకు సూచించారు. జిల్లా పార్టీ నుంచి తమ సహాయ సహకరాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం పార్టీ గుర్తించిన ఎంపిటిసి స్థానాలలో గెలుపు దిశగా తీసుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించారు. ఆయా పరిధిలలో శాఖ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అలాగే ఎదురవుతున్న రాజకీయ ప్రతికూల పరిస్థితులపై కులంకుశంగా సభకు కౌన్సిల్ సభ్యులు విన్నవించారు. వీటిపై నాయకత్వం స్పందిస్తూ పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పరిస్థితులు ఉండేలా మేలైన నిర్ణయాలుంటాయన్నారు. సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమావేశంలో కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, బానోత్ రామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు లింగ వెంకటనారాయణ, ఎడ్లపల్లి శంకరయ్య, పగీళ్ల వీరభద్రం, వెంపటి సురేందర్, ఎఐటియుసి జిల్లా నాయకురాలు సీతామాలక్ష్మి, సీనియర్ నాయకులు తేలపూడి కిషన్‌రావు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సహాయ కార్యదర్శులు కలింగి మోహన్‌రావు, బానోత్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర కోటా మేరకు కేంద్రం యూరియా సరఫరా చేయాలి



### సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** కేంద్రలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర కోటా మేరకు యూరియా కొరత లేకుండా సరఫరా చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. యూరియా సరఫరాపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావాలనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా కొరత చేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కేంద్రం యూరియా కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు రాష్ట్ర కోటా మేరకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్రానికి రైతాంగానికి అన్యాయం జరుగుతుంటే కనీసం నోరు మెదపడం లేదన్నారు. కేంద్ర మం త్రులు, బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు ఉండి తెలంగాణ రైతాంగానికి అన్యాయం జరుగుతుంటే మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి రావలసిన యూరి యా సరఫరా చేయాలని, లేకుంటే బిజెపి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేల ఇల్లు ముట్టడిస్తామని విజయసారథి హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, పెరుగుకుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట వెంకన్న, తండా సందీప్, వీరవెల్లి రవి, మేక వీరన్న, వంకాయలపాటి చిరంజీవి, నక్క నాగార్జున, తండ సతీష్, తండ గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, డి.రమేష్, పెద్ద లింగయ్య, జీ.రమేష్, వంగూరి నాగేంద్రబాబు, నేరెళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలి : ఎంపిడిఓ

ప్రజాపక్షం/యాచారం : ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరగా ఇళ్లు కట్టుకోవాలని ఎంపిడిఓ రాధ రాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి, నజ్దిక్‌సింగారం, కొత్తపల్లి, తక్కళ్ళపల్లి, తక్కళ్ళపల్లి తండా, యాచారం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాధారాణి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు కట్టుకోవాలన్నారు. గడువు లోగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. ఇండ్ల నిర్మాణం విషయంలో ఎలాంటి సమస్య లున్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉన్న లబ్ది దారుల ఇండ్ల ను సందర్శించి ఇండ్ల ప్రగ తిని పరిశీలించాలని ఆదేశించారు. లబ్దిదారులు బిల్లులు బ్యాంక్‌లో పడ్డా యా లేదా అనే విషయాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ ఎఇ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## స్వయంఉపాధితో యువత అభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: విజయ్ జ్యువెలర్స్‌ను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని చత్రపతి శివాజీ చౌక్ వద్ద విజయ్ కాంత్, సుకుమార్‌లు నూతనంగా ఏర్పాటు చేసిన విజయ్ జ్యువెలర్స్‌ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత స్వతం ఉపాధితోపాటు వ్యాపార రంగంలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ఒకేసారి కాకుండా అంచెలంచెలుగా అభివృద్ధి సాధించే విధంగా ముందుకు వెళ్ళాలని పేర్కొన్నారు. అదే విధంగా కొత్తూరు మున్సిపాలిటిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన మారుతి మోడికల్ స్టోర్‌ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మామిడిపల్లి మాజీ సర్పంచ్ శోభారెడ్డి, మాజీ ఎంపిటిసి కట్నా మాధవి రవీందర్, ఎలికట్ట శ్రీనివాస్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ మాదారం నరసింహా గౌడ్, సోమ్లానాయక్, గోవింద్‌రెడ్డి, మాదారం కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీ కాంత్, అభిలాష్, కృష్ణ గౌడ్, శివరాములు గౌడ్, రాజు గౌడ్, ప్రవీణ్, సందీప్‌లు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు



ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వ హించాలని రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు సూచించారు. సోమవారం రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ సుధీర్ బాబు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి జిల్లాలకు సంబంధించి గణేష్ ఉత్సవాలు నిర్వాహణపై అదనపు కలెక్టర్లు, డిసిపిలు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, వాటర్ వర్క్స్, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ నెల 27వ తేది నుండి సెప్టెంబర్ 6వ తేది వరకు నిర్వహించే గణేష్ ఉత్సవాలు ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. మండపాల ఏర్పాటు నిబంధనలకు లోబడి ఏర్పాటు చేయాలని చెప్పారు. అదేవిధంగా మండపాల వద్ద ఎటువంటి విద్యుత్, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం చేసే సమయంలో చెరువుల వద్ద లైటింగ్, క్రేన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, శానిటేషన్ చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడటం జరుగుతుందని తెలిపారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా నుండి పాల్గొన్న ఇంచార్జ్ అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గణేష్ ఉత్సవాలు శాంతిభద్రతల మధ్య శాంతియుతంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సమావేశంలో భువనగిరి అదనపు కలెక్టర్, ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్, మహేశ్వరం డిసిపి సునీతరెడ్డి, విద్యుత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌అండ్‌బి, వాటర్‌వర్క్స్, పోలీసు అధికారులు, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు నూతన బిల్డింగ్ నిర్మించాలి

అదనపు కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని మంథనిగౌరెల్లి ప్రాథమిక పాఠశాలకు నూతన బిల్డింగ్ నిర్మించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ అధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధనపు కలెక్టర్ నారాయణరెడ్డి,జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణ చందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తావునాయక్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల తరగతి గదులు, వంట గది శిథిలావస్థకు చేరిందన్నారు. పాఠశాల బిల్డింగ్ పురాతన భవనం కావడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులు బిక్కు బిక్కుమంటు చదువుకుంటు కాలం వేళ్ళదిస్తున్నారని అన్నారు. తరగతి గదులను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తమ పిల్లలను పంపాలంటే భయపడుతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని తక్షణమే నూతన బిల్లింగ్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో చందునాయక్, ఎస్.బాస్కర్ నాయక్, కుమార్‌నాయక్, జంగయ్య, రవి, గణేశ్ పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి పరామర్శ



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : మహేశ్వరం నియోజకవర్గం ఎన్‌ఎస్‌యుఐ ప్రధాన కార్యధర్శి బండారి సాయి వినయ్ మృతి పార్టీ తీరనిలోటు అని టీపిసిసి ప్రధాన కార్యధర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహరెడ్డి అన్నారు. సోమవారం సరూర్‌నగర్‌లోని సాయి వినయ్ నివాసానికి చేరుకున్న పారిత నర్సింహారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు చింతకింది రంజిత్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## మంటపాలకు అనుమతి తప్పనిసరి



ప్రజాపక్షం/గండిపేట: ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని నార్సింగి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి.హరి కృష్ణారెడ్డి అన్నారు. రాబోయే గణేష్ చతుర్థి దృష్ట్యా మంటపాలకు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాలు నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం కెవిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ మండపాల వద్ద సరైన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. శాంతియుతంగా సాంప్రదాయ బద్ధంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు మునిందర్, మురళీధర్, శ్రీశైలం, గోపి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బహుజన రాజ్యస్థాపన చేసిన సర్వాయి

పాపన్నగౌడ్ జయంతి సభలో కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజన రాజ్యస్థాపన చేసిన సర్వాయి పాపన్నగౌడ్ అందరికీ ఆదర్శనీయుడని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాపన్న గౌడ్ గౌడ కులవృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తూ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత, బహుజన మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని తెలిపారు. కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలనే సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో నాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాటం గొప్ప విషయమన్నారు. జిల్లాలోని బిసి సంక్షేమ హాస్టళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బిసి విద్యార్థులకు విద్యలో నైపుణ్యం కోసం ప్రత్యేకంగా శిక్షణా తరగతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి, డిఆర్ఓ సంగీత, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కేశూరాం, బిసి ఫ్రంట్ నాయకుడు మల్లేష్ యాదవ్, సుధాకర్ గౌడ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ జయంతిని విజయవంతం చేయాలి

క్రీడల మంత్రి వాకాటి శ్రీహరి



ప్రజాపక్షం/హయత్ నగర్: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించనున్న "రాజీవ్ గాంధీ ఖేల్ ఉత్సవ్ రన్ " కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, టీ షర్ట్ లను సోమవారం క్రీడా శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి టిపి సిసి ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, బి సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. రన్ కార్యక్రమంలో క్రీడాకారులు, యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షులు దొంతి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, నాయకులు లింగాల కిషోర్‌గౌడ్, పాశమ్‌అశోక్ గౌడ్, వేణుయాదవ్, గణేష్ నాయక్, కంచర్ల కవిత, భాను, జాంగిర్ బాబా గౌడ్, నిరంజన్ యాదవ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, రేణుగౌడ్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్‌రూామ్ ఇండ్లు

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు పేద మహిళలు వినతిపత్రం అందజేశారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేయండి సారూ అంటూ మహిళలు ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో సౌకర్యాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని త్వరలోనే పూర్తి చేసి లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మరమ్మత్తుల కోసం గతంలో రూ.7కోట్ల నిధులు మంజురు చేయించామని, ఆ నిధులు పెండింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి త్వరలోనే నిధులు మంజూరు చేయించి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మత్తులు చేయించి లబ్దిదారులకు పంపిణీ చేస్తామని వివరించారు. నిధులు లేకపోవడతోనే డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీలు జాప్యం చోటు చేసుకుంటుందని, మంచినీటి సౌకర్యంతోపాటు విద్యుత్ సమస్యలను పరిష్కరించి లబ్దిదారులకు ఇండ్లు అంధిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా త్వరలోనే లబ్దిదారులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, అర్హులైన లబ్దిదారుల జాబితాను సిద్దం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్ ఉన్నారు.

## భారీవర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/హయత్ నగర్ : భారీవర్షలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిహెచ్‌ఎంసి వాటర్, వర్క్స్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో ప్రజలకు ఉత్పన్నం అవుతున్న సమస్యలను వివరించారు. రోడ్లు, శానిటేషన్ వ్యవస్థ సరిగ్గా లేక డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయన్నారు. జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, జిహెచ్‌ఎం సిడిఇ వినయ్ కుమార్, వాటర్ వర్క్స్ ఎఇ రజిత, ఇతర అధికారులు, స్థానిక వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలకు యువత ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాపక్షం/హయత్ నగర్: యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి సూచించారు. వేగంగా ప్రాచుర్యం పొందుతున్న ఆధునిక క్రీడ పికోలెబాల్ ను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన పికోలెబాల్ ఫోర్జ్ ను సోమవారం నర్సింహ్మారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పికిల్ బాల్ ఫోర్జ్ యజమాని బి. మోనీష్ రెడ్డి, పరిసర కాలనీ వాసులు చంద్రశేఖర్, చీర్క నర్సిరెడ్డి,టంగుటూరి నాగరాజు, మోహన్ రెడ్డి, దామోదర్ గౌడ్, వెంకటరమణ, రాంగోపాల్, శ్రీశైలం యాదవ్, షణ్ముఖ చారి, వెంకట్ రెడ్డి మరియు బిజెపి నాయకులు సాయిరాం గౌడ్, జయతేజ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న బిసి గురుకుల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రాష్ట్ర బిసి గురుకుల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమం బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సిఎం రేవంత్‌రెడ్డి, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వివేకాందనగర్ సహారా ఎస్టేట్‌లోని మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ (ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్‌ఈఐఎస్) విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు సభికులను ఆకర్షించాయి. కార్యక్రమంలో సంస్థ జాయింట్ సెక్రటరీ తిరుపతి, ఒఎస్‌డి స్పోర్ట్స్, కల్చరల్ పి.శ్రీనివాస్ గౌడ్, కొరియోగ్రాఫర్‌లు గాయత్రి, సంగీత బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





## పాపన్న గౌడ్ పోరాటాలు భావితరాలకు స్ఫూర్తి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





ప్రజాపక్షం/షాద్‌నగర్ : భూస్వాములు, దొరల గుత్తాధిపత్యాన్ని ఎదిరించి, బడుగుల రాజ్యాధికారాన్ని కాపాడిన మహానీయుడు సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లో సర్థార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని గౌడ యువజన సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సర్థార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాల భావి తరాలకు స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు చెన్నయ్య, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, వన్నాడ ప్రకాష్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, వన్నాడ వెంకటేష్‌గౌడ్, కుమారస్వామిగౌడ్, శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** బహుజన రాజ్య స్థాపకుడు సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లో గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో నేతలు నక్కల వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఈశ్వర్‌రాజు, సుధీర్, పల్లి శేఖర్, జూపల్లి శంకర్, కాట్న మాధవి రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.


**కిషన్‌నగర్‌లో..**ఫరూక్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో కట్టా వెంకటేష్‌గౌడ్, బాల్‌రాజ్, గౌడ సంఘం అధ్యక్షుడు లోకిరేవి ఆంజనేయులు గౌడ్, ఉపసర్పంచ్ నల్ల చెన్నయ్య గౌడ్, కారోబార్ బోనగిరి కృష్ణయ్య, లక్ష్మ య్య, మల్లేష్, నర్సింలు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చాకలి శ్రీశైలం పాల్గొన్నారు.

**కొందుర్గు :** బహుజన సిద్దాంత కర్త, బహుజన మేధావి సర్వాయి పాపన్న గౌడ్ జయంతి మండలంలో ఘనంగా నిర్వమించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు సుబ్బయ్య గౌడ్, శివశంకర్ గౌడ్, లక్ష్మీ నారాయణ గౌడ్, రఘువేందర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** సర్వాయి సర్ధార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలను సోమవారం బిఆర్‌ఎస్ నాయకులు దూసరి మధు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ధార్ పాపన్న గౌడ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన నాయకుడని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గొని శ్రీధర్‌గౌడ్, గడ్డం మల్లేష్ గౌడ్, వేములయ్య గౌడ్, పూర్ణచందర్ గౌడ్, సాయికిరణ్ గౌడ్, కిరణ్ గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**హయత్ నగర్:** సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఎల్‌బినగర్‌లో సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబాల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్ కుమార్ పాల్గొని సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లె గణేష్ గౌడ్, వెంకట రమణ గౌడ్, బొంగు వెంకటేష్ గౌడ్, విశ్వేశ్వర రావు, గాలెయ్య,లక్ష్మీపతి గౌడ్, కిరణ్ గౌడ్,కిషోర్ గౌడ్, రాజు గౌడ్,వెంకటేష్ గౌడ్,శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**శంషాబాద్ :** సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు శంషాబాద్ మండలంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరిగాయి. పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులకు పండ్లు పంపిణీ చేశారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్, గౌడ సంఘం నాయకులు యాదయ్య గౌడ్, శ్రీశైలం గౌడ్, వెంకటయ్య గౌడ్, నరసింహ గౌడ్, కుమార్ గౌడ్, సాత్విక్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.








# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## తూంకుంట ప్రభుత్వ పాఠశాలలో టిఎల్‌ఎం మేళా



**ప్రజాపక్షం/శామీర్‌పేట** ః తూంకుంట మున్సిపాలిటీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టిఎల్‌ఎం మేళాను మండల విద్యాధికారి కమలాకర్ సోమవారం ప్రారంభించారు. శామీర్‌పేట మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు టిఎల్‌ఎం మేళాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను తయారుచేసి విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగశారద, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. టిఎల్‌ఎం మేళాలో పది ఉత్తమ నమూనాలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన తాడి వర్షిక



**ప్రజాపక్షం/శామీర్‌పేట** ః తూంకుంట మున్సిపాలిటీలోని విజ్ఞాన భారతి హైస్కూల్లో నాలుగవ తరగతి చదువుకుంటున్న తాడి వర్షిక హకింపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో నాలుగవ తరగతి ప్రవేశానికి పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో నిర్వహించిన పలు క్రీడల్లో తాడి వర్షిక తన సత్తాచాటి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు గోనె హన్మంతరెడ్డి మాట్లాడుతూ మా విజ్ఞాన భారతి హైస్కూల్ నుంచి హకింపేట స్పోర్ట్స్ స్కూల్‌కు తాడి వర్షిక ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తాడి వర్షికకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జంగా రెడ్డి, ప్రిన్సిపల్ గోనె సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మా కాలనీ రోడ్డు కబ్జా నుంచి విముక్తి కల్పించండి

ధర్నాకు దిగిన కాలనీ వాసులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట** ః మా కాలనీ రోడ్డు కబ్జాకు గురైందని బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు కబ్జా చేశారని రెడ్డి సంఘం కాలనీ వాసులు సోమవారం ఆందోళనకు దిగారు. తూంకుంట మున్సిపల్‌లోని రెడ్డి కాలనీ వాసులు తూంకుంట మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి కాలనీ వాసులు మాట్లాడుతూ తూంకుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 286, 322లలో సుమారుగా 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. గత రెండు నెలల క్రితం గూడూరు సత్తిరెడ్డి, వెంకటరెడ్డిలు వెంచర్‌లో ఉన్న దారిని మూసివేసి ఈ దారి మాదేనని మమ్మల్ని బెదిరించి బోరు వేసి మామిడి చెట్లు నాటారని ఆరోపించారు. మా అవసరాలకు దారి లేకుండా చేశారని మేము బయటకు వెళ్లకుండా వేరే వారి ప్లాట్లల్లో నుంచి వెళ్తే వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇట్టి విషయమై గతంలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు ఇచ్చామని చెప్పారు. ఇంతవరకు మాకు ఏవిధమైన సహాయం కల్పించలేదని అన్నారు. కబ్జాకు గురైన రోడ్డుకు విముక్తి కల్పించాలని అధికారులను కోరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కాలనీ వాసులు, మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## తన భూమిని కబ్జాచేసి నిర్మిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి** : పోలీసులు, హెచ్ఎండిఎ అధికారులతో కుమ్మక్కై అక్రమ లేఅవుట్లతో తన భూమిని సైతం ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు కొనసాగిస్తున్న తుమ్మల శ్రీనివాసరెడ్డి తదితరులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని వాటిని కూల్చివేయాలని మేడ్చల్ మండలం ఖాజీగూడ నివాసి గుర్రల రాజు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన దీనికి తెలియచేసిన వివరాలిలా ఉన్నాయి. ఖాజీగూడ గ్రామ శివారులో ఉన్న 12,13,14,15,16,17,20, 25, 33,34,36 సర్వే నంబర్లలో తన తాత గుర్రల బాలయ్య ద్వారా సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. ఆ తర్వాత ఇదే సర్వే నంబర్లలో 13 ఎకరాల 38 గుంటల భూమిని తుమ్మల శ్రీనివాసరెడ్డి తదితరులు కొనుగోలు చేసి హెచ్ఎండిఏ అధికారులతో కుమ్మక్కై 2020లో అక్రమంగా లేఅవుట్ అనుమతులు పొంది పోలీసుల సాయంతో బెదిరిస్తూ తమ భూమిని సైతం ఆక్రమించుకొని నిర్మాణాలు ప్రారంభించారని ఆరోపించారు. వారి అక్రమ నిర్మాణాలు బఫర్ జోన్‌లో వస్తాయని హెచ్ఎండిఏ నోటిఫికేషన్ జారీ చేసారని తెలిపారు. దీంతో ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆదేశాలను సైతం జారీ చేసారని తెలిపారు. ఇదే విషయమై హైకోర్టు సైతం ఆదేశాలు జారీ చేసార్నారు. వీటన్నింటిని ఏ మాత్రం లెక్కచేయకుండా పోలీసులు, హెచ్ఎండిఏ అధికారులతో కుమ్మక్కైన తుమ్మల శ్రీనివాసరెడ్డి తదితరులు అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నాడంటూ సంబంధింత పత్రాలు సమర్పిస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకొని వాటిని కూల్చివేయాలని కోరారు.

# మైత్రివనం వద్ద వరద ఉధృతిని ఆపేదెలా?

కృష్ణాకాంత్ పార్కు చెరువుకు మళ్లించడంపై అధ్యయనం

క్షేత్రస్థాయిలో అవకాశాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్** : అమీర్‌పేట మెట్రో స్టేషన్, మైత్రివనం వద్ద వరద ఉధృతిని ఆపేదెలా అనే అంశంపై హైడ్రా దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకంగా ట్రంకు లైను ఏర్పాటు చేయడంతో పాటు, తాత్కాలిక ఉపశమనానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై హైడ్రా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సోమవారం అమీర్‌పేట మైత్రివనం పరిసరాల్లో వరద కాలువలకు ఉన్న ఆటంకాలను పరిశీలించారు. అనంతరం కృష్ణాకాంత్ పార్కులోని చెరువును, వర ద కాలువలను తనిఖీ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 10, వెంకటగిరి, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల నుంచి కృష్ణాకాంత్ పార్కు మీదుగా పారే వరద కాలువలను పరిశీలించారు. కృష్ణాకాంత్ పార్కులో ఉన్న చెరువును కూడా తనిఖీ చేశారు. పై నుంచి భారీఎత్తున వస్తున్న వరదను కృష్ణాకాంత్ పార్కులోని చెరువుకు మళ్లిస్తే చాలావరకు వరద ఉధృతిని కట్టడి చేయవచ్చుననే అభిప్రాయానికి హైడ్రా కమిషనర్ వచ్చారు.

**చెరువుకు మళ్లించి వరద కట్టడి..?**

పై ప్రాంతాల నుంచి వచ్చే వరదను కృష్ణాకాంత్ పార్కులో ఉన్న చెరువుకు మళ్లించి కొంతమేర ఉధృతిని తగ్గించవచ్చు అనే అంశంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌గారు పరిశీలించారు. 7 ఎకరాల మేర పార్కులో చెరువు ఉంది. ఆ చెరువును 12 ఎకరాల వరకూ విస్తరించడానికి వీలుంది. ఇలా 120 మిలియన్ లీటర్ల నీటిని కొన్ని గంటలు నిల్వచేస్తే, వర్షం తగ్గిన తర్వాత కిందకు వదిలితే వరద ఉధృతిని కొంతవరకు తగ్గుతుందని భావించారు. ప్రస్తుతం కృష్ణాకాంత్ పార్కులోని చెరువులోకి నీరు వెళ్లకుండా నేరుగా మధురానగర్ మీదుగా అమీర్‌పేటకు వచ్చి చేరడంతో మెట్రో స్టేషన్ కింద భారీ మొత్తంలో వరద నీరు నిలిచిపోతోంది. కృష్ణాకాంత్ పార్కులోని చెరువు నుంచి మధురానగర్ మీదుగా అమీర్‌పేట మెట్రో స్టేషన్ వరకూ 1100 మీటర్ల బాక్స్ డ్రైన్ ఉంది. అమీర్‌పేట వద్ద భూమి సమాంతరంగా ఉండడంతో పై నుంచి భారీమొత్తంలో వచ్చిన వరద కిందకు వెళ్లడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని హైడ్రా అధికారులు కమిషనర్‌కు తెలిపారు. దీనికి తోడు పైనుంచి వచ్చిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా వరద ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయని వివరించారు.

**జిపిఆర్ఎస్ ఆటంకాలను గుర్తించాలి..**

అమీర్‌పేట సంజీవరెడ్డి నగర్ ప్రధాన రహదారిని వరద నీరు దాటేందుకు వేసిన పైపు లైన్లలో ఉన్న ఆటంకాలను గుర్తించేందుకు జిపిఆర్ఎస్ సర్వే చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. దీని ద్వారా పైపులైన్లలో పేరుకుపోయిన పూడికను గుర్తించడం జరుగుతుందన్నారు. తొలగించడానికి వీలు కాని పక్షంలో బాక్సు డ్రైన్ల ఏర్పాటు అంశాన్ని పరిశీలించవచ్చునన్నారు. అప్పటి వరకూ మెట్రో స్టేషన్ కింద ఉన్న పైపులైన్లలోంచి వరద నీరు సాఫీగా సాగేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని హైడ్రా కమిషనర్ సూచించారు. సారథి స్టూడియో పక్క నుంచి, మధురానగర్ మీదుగా వచ్చే వరద కాలువలు రోడ్డు దాటినప్పుడు తలెత్తుతున్న సమస్యలను పరిష్కరిస్తే ఇబ్బందులుండవని అధికారులు తెలిపారు. ఇందుకు దీర్ఘకాలిక ప్రణాళిక, తాత్కాలిక ఉపశమనం కల్పించడంపై దృష్టి పెట్టాలని హైడ్రా అధికారులను కమిషనర్ ఆదేశించారు.

**హైదరాబాద్‌లో నాలా ఆక్రమణల తొలగింపు**

: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కూకట్‌పల్లి మండలంలోని ఎవిబి పురంలో నాలా ఆక్రమణలను హైదరాబాద్ రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ (హైడ్రా) సోమవారం తొలగించింది. దీంతో సాయి బాబా కాలనీ, హెచ్ఏఎల్ కాలనీ, మైత్రి నగర్ ప్రజలకు ముంపు బెడద తప్పింది. పరికి చెరువు నుంచి కూకట్‌పల్లి నాలా లో కలిసే ఈ నాలా అసలు వెడల్పు 10 మీటర్లు. అయితే 3మీటర్లకు పైగా ఆక్రమణకు గురైంది. నాలాపై రెండు షట్టర్ల దుకాణాలు వెలిశాయి. మ్యాన్‌హోల్ పైన కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ దుకాణాల్లో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల విక్రయాలు, మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ అక్రమ కట్టడాల కారణంగా కొద్దిపాటి వర్షానికే వరద నీరు సాఫీగా పారక, ఈ మూడు కాలనీలు నీట మునుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై జలమండలి అధికారులు పరిశీలించి, నివేదిక ఇవ్వడంతో హైడ్రా అధికారులు కూల్చివేత పనులు చేపట్టారు. ఈ చర్య పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.





**వరద ముప్పు తప్పించండి..**

**హైడ్రా ప్రజావాణికి 39 ఫిర్యాదులు**

వర్షాల వేళ నాలాలు, చెరువుల కబ్జాలపై ఫిర్యాదుల సంఖ్య ఎక్కువగా వచ్చాయి. కాలనీలను, రహదారులను వరద ముంచెత్తడానికి కారణమౌతున్న కబ్జాలను వెంటనే తొలగించాలని ఫిర్యాదులలో పలువురు నగరవాసులు పేర్కొన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించడం ద్వారా వరద ముప్పును చాలావరకు తగ్గించవచ్చునని ఉదాహరణలతో తెలిపారు. హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 39 ఫిర్యాదులందగా, నాలాలు, చెరువుల కబ్జాలపైనే ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఇదే సమయంలో పార్కులు, ప్రభుత్వ భూములు, రహదారుల ఆక్రమణలపైనా ఫిర్యాదులందాయి.

## మేడ్చల్ జిల్లాలో పొంగి ప్రవహిస్తున్న వాగులు, చెరువులు

* మూడుచింతలపల్లిలో 141.3 మిమీ
* శామీర్‌పేటలో 75.7 మిమీ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ జిల్లాలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల వద్దకు వెళ్లవద్దని అధికారులు, పోలీసులు హెచ్చరిస్తూ సమీప రహదార్లలో రాకపోకలను నిలిపేసి బ్యారికేడ్లు ఏర్పాట్లు చేసారు. అలియాబాద్ మున్సిపాలిటి పరిధిలోని రామాలయం వద్ద రహదారిపై నుండి వాగు నీరు చెరువును తలపిస్తూ ప్రవహిస్తోంది. లక్ష్మాపూర్ అలుగు పారి ప్రవహిస్తోంది. మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం రాత్రి జిల్లావ్యాప్తంగా కుంభకృష్టి వర్షం పడింది. ఆదివారం జిల్లాలో మూడుచింతలపల్లి మండలంలో 141.3 మిమిగా మొదటి స్థానంగా , శామీర్‌పేట మండలంలో 75.7మిమీగా రెండో స్థానంగా అత్యధిక వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా ఆదివారం నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ మండలంలో 61.1 మిమీ,దుండిగల్‌లో 60.4 మిమీ, బాచుపల్లిలో 55 మిమీ, కుత్బుల్లాపూర్ లో 37.3 మిమీ, కూకట్‌పల్లిలో 37.8 మిమీ, బాలానగర్‌లో 28.2 మిమీ, ఆల్వాల్‌లో 32 మిమీ, మల్కాజిగిరిలో 35.3 మిమీ, ఉప్పల్‌లో 31.6 మిమీ, మేడిపల్లిలో 25.9 మిమీ, కాప్రాలో 33మిమీ, శామీర్‌పేటలో 75.7 మిమీ, కీసరలో 48.7మిమీ, ఘట్‌కేసర్‌లో 64 మిమీ, మూడుచింతలపల్లి లో141.3 మిమీ వర్షపాతం నమోదైంది.

## వినాయక నిమజ్జనం పూర్తయ్యే వరకు సమన్వయంతో పనిచేయాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి** : వినాయ క చవితి వేడుకలు, నిమజ్జనం కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో పూర్తయ్యేలా సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులు, నిర్వాహకులు సమన్వయంతో ప్రణాళికాయుక్తంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్లు హేమంత్, అపూర్వ్, బాలానగర్, మేడ్చ ల్ డిసిపిలు పురుషోత్తం, సుదర్శన్, స్పెషల్ బ్రాంచ్ డిసిపి రహమాన్, డిఆర్‌ఓ హరిప్రియలతో కల్సి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 17 చెరువులోల జరిగే వినాయక నిమజ్జనానికి అవసరమైన రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకొని ఆయా రూట్ల లో రోడ్ల మరమ్మత్తు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలను రవాణా శాఖాధికారులు పరిశీలించి ధృవీకరణపత్రాలను జారీ చేయాలని, నిమజ్జనం సజావుగా కొనసాగేందుకు బందోబస్తుతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, నిమజ్జన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. మంచినీరు. పారిశుద్యం, విద్యుత్ సరఫరా, అంబులెన్స్, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక దళాలు, జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్** ః వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కి వివిధ గ్రామలనుండి వచ్చిన ప్రజల నుండి 45 ధరకాస్తులను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ,అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. పాఠశాలలో జరిగే మైనర్ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు** ః వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్. సుధీర్, సిబ్బంది పాల్గోన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1650లో జన్మించిన ఆయన భూస్వామ్య వ్యవస్థపై తిగురుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత బహుజన మైనార్టీలతో కలిపి ప్రజారాజ్యాన్ని నిర్మించారన్నారు. కుల మతాల వివక్షలేకుండ అన్ని వర్గాలకు రాజ్యాధికారంలోకి భాగస్వామిక స్ఫూర్తితో నాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాటం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ మగ్గిలాల్, ఆర్‌డిఒ వాసుచంద్ర , జిల్లా అధికారి ఉపేందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమని గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. సోమవారం ఇసిఐఎల్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతిని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గౌడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాల ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ జెఏసి రాష్ట్ర కోఆర్డినేటర్ ముత్యం ముఖేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు తాళ్ల ఆనంద్‌గౌడ్, అఖిల భారత గౌడ సంఘం నాయకులు కోళ్ల ఈశ్వర్‌గౌడ్, పి. శ్రీనివాస్‌గౌడ్, రుద్రగోని రాంచందర్‌గౌడ్, పి. శివకుమార్‌గౌడ్, సంకూరి శ్రీనివాస్‌గౌడ్, సాంబమూర్తి గౌడ్, తాళ్ల వెంకటేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**రాంపల్లిలో:** మొగలాయిల దౌర్జన్యాలను ఎదిరించి వారి గుండెల్లో సింహస్వప్నంలా నిలిచిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో సర్వాయి పాపన్న 375వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వరంగల్‌లో నిర్మించే విమానాశ్రయానికి మహాయోధుడు పాపన్న పేరు పెట్టాలని కిలాషాపూర్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సురేష్, గండి అంజయ్యగౌడ్, పెంటయ్యగౌడ్, నాగరాజ్, బలరాం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో:** పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించుకోవచ్చని నిరూపించిన గొప్ప సామాజిక బహుజన విప్లవకారుడు సర్దార్ పాల్వాయి పాపన్న అడుగుజాడల్లో ముందుకెళ్లాలని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునిత పిలుపిచ్చారు. మల్కాజిగిరిలోని యాదవనగర్‌లో ఉన్న సర్దార్ పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన 375వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, జాతి భేదాలు లేని సమాజం కోసం స్వీయ సైన్యంతో పోరాడి తొలి బహుజన రాజ్యస్థాపన చేసాడన్నారు.ఈ కార్యక్రమంలో మేకల రాము యాదవ్, శ్రీనివాసగౌడ్, మల్లేష్ గౌడ్,కరుణం గోపి, చంద్రశేఖర్‌రావు, రమేష్ గౌడ్, కాసర్ల నాగరాజు, పిట్టల భాస్కర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

**బంట్వారంలో:** బంట్వారం మండల కేంద్రంలో సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సోమావారం బస్టాండ్ సమీపంలో చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మొట్ట మొదటి బహుజన వీరుడని, బహుజన చక్రవర్తి అని పాపన్న గౌడ్ చేసిన సేవలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బంట్వారం గౌడ సంఘం నాయకులు, మండల నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



## భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

* సీజన్ ప్రారంభదశలోనే 10వేల ఎకరాలకు పైగా వర్షార్పణం
* ఆదుకోవాలని రైతులు వేడుకోలు



**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో ఎడతెరపిలేని వర్షాలు తీవ్రంగా నష్టపోతున్నారు. వేల ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. పత్తి మొక్కజొన్న పరి ఇతర పంటలు నీటి మునిగిపోయాయి. వేలాది రూపాయల పెట్టుబడి నీటిపాలైనందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం సీజన్‌లో భారీ వర్షాల కారణంగా వేల ఎకారల్లో పంటలు దెబ్బతిన్నాయి. అయితే అదికారులు ప్రభుత్వానికి పంపిణా నివిదికాలో మాత్రం వందల ఎకరాలే ఉన్నాయి. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదికల ప్రకారం జిల్లాలో 283 మంది రైతులకు చెందిన 505 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు. ధారూర్ , తాండూర్ , పరిగి ,దోమ ,పూడుర్ మండలల్లో ఎక్కువకగా నష్టం జరిగింది ,వికారాబాద్ నవాబుపేట్ బొంరాస్‌పేట్ ,బషీరాబాద్ యాలాల్ మండలల్లో కూడా నష్టం వాటిల్లింది అని రైతులు తెలిపారు. రాత్రి నుండి కురూస్తున్న భారీ వర్షంతో జనజివనం అంస్తవ్యస్తం అయింది. ఇంట్లో నుండి బయటకు వేళ్లలేక పోయారు. ప్రకృతి వైపరిత్యాలకు ఏటా పంటలు దెబ్బతింటున్నా పరిహారం అందడంలో దేఇన అన్నదతలు అవేదన వ్యాక్తం చేస్తున్నారు.



అక్ష్యల్లో పెట్బ్బడుతు పెట్టి ఎండనకా వాననకా కష్టపడి పండించి చేతికొచ్చే సమయానికి పంటలు వర్ష్యార్పణమవుతున్నాయి. ఐదేళ్లుగా ఇదే పరిస్థితితో ఉందని పలువురు పేర్కోన్నారు. పంటలు దెబ్బతిన్న సమయంలో మంత్రులు ఎమ్మెల్యేలు అదికారులు పర్యటించి అతర్వత మిన్నకుండిపోతున్నారననే విమర్శలు ఉన్నాయి. ఈ ఏడిది పంటలు ప్రారంభ దశలోనే భారీ వర్షాలకు వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఎకరానికి రూ.25వేల పరిహారం అందింయాలని ప్రతిపక్షాలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటిలగే ఈ సారి కూడా అధికారులు క్షేత్రాస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

ఏటా పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం నుంచి పరిహారం మాత్రం అందడంలేదు ఐదేళ్లుగా ఇదే తంతు సాగుతోందని అన్నాదతులు ఆరోపిస్తున్నారు. ఐదేళ్లగా ఇదే తంతు కోనసాగుతుండటంతో రైతులు అవమానం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 2020నుండి 2025వరకే 105లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. గతసంవత్సరం 1.500ఎకరాల్లో మాత్రమే పరిహారం అందించి 2023లో హైకోర్టు పంటలు నాష్ట పోయిన రైతులను పరిహారం ఇచ్చి అఉకోవాలని ప్రభుత్వని అదేశించింది. గత 15రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి. తమను అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రీల్

## సినిమా ఆగితే.. పస్తులతో పడుకోవాల్సిందే

### దర్శకుడు వి.ఎన్. ఆదిత్య



ఒక్క వ్యక్తి సినిమాల్లోకి వచ్చి, డబ్బులొస్తేనే తీస్తాను, రాకపోతే వేరే వ్యాపారంలో పెడతాను అనుకోకుండా, లాభమొచ్చినా సినిమాలే తీస్తూ, నష్టమొచ్చినా సినిమాలే తీస్తూ తన బయటి వ్యాపారాలలో వచ్చిన లాభాలు కూడా సినిమా రంగం మీదకే మళ్లిస్తూ ఈ రంగంలో పదేళ్లలో దాదాపు వెయ్యికోట్ల పైగా పెట్టుబడి పెట్టుకుని, ఫ్లాపుల్ని, ట్రోలింగులని ఎదురీదుతూ మొండిగా తట్టుకుని నిలబడితే.. ఆయన్ని ఎంకరేజ్ చేసి మరిన్ని మంచి సినిమాలు చేసేలా ప్రోత్సహించాల్సింది పోయి, అబద్ధపు ప్రచారాలతో, స్వార్ధపూరిత రాజకీయాలతో, కుల వివక్షలతో ఈ రంగం మీద పెట్టుబడిని బయటి రంగాలకి మళ్లించేలా మన ప్రవర్తన ఉంటే ఎవడికి నష్టం. యాభై సినిమాలకు రెండొందల మందికి పైగా పదేళ్లలో ఆయన పెట్టిన మూడు పూటల భోజనం ఖర్చు మాత్రమే ఒక పది పెద్ద సినిమాల బడ్జెట్టు. కారు డ్రైవర్లకి, ప్రొడక్షన్ బాయ్స్‌కి డబ్బులెగ్గొట్టి, హీరో, హీరోయిన్స్‌కి మాత్రమే డబ్బులిచ్చి, బడా ప్రొడ్యూసర్స్ లా మార్కెట్‌లో పోజు కొట్టే చాలామందిని ఒక్క మాట అనలేని యూనియన్ లీడర్లు ఈయన మీద మాత్రం విరుచుకు పడిపోతారు.ఏ కార్మిక సంఘం అయినా వర్కర్ కి అన్యాయం చేసిన ప్రొడ్యూసర్ పై పడాలి.వేలమంది వర్కర్స్‌కి పని కల్పించే ప్రొడ్యూసర్స్ మీద కాదు.. ఈ సమ్మె వల్ల కడుపులు కాలుతున్న కార్మికులు లక్షల్లో ఉన్నారు తెలుగు ఇండస్ట్రీలో.. వాళ్ల ఆకలి బాధలకు ఏ యూనియన్ నాయకుడు సమాధానం చెప్తాడు అని ప్రముఖ దర్శకుడు విఎన్ ఆదిత్య ప్రశ్నించారు. రాబోయే పెట్టుబడులు మరో వేయి కోట్ల పైనే.నా వల్ల వచ్చిన గౌరవం మ్పు రెండు జాతీయ,అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు. ఇంతకన్నా అర్హత కావాలా మాట్లాడడానికి..? నిర్మాతల్ని సినిమాలు తీయనివ్వండి.. కార్మికులు బావుంటారు.. షూటింగులు ఆపకండి. అడుక్కు తినాల్సి వస్తుంది. సినిమా అనేది పని చేసేవాడికి మాత్రమే పరమాన్నం పెడుతుంది.. పని లేని రోజున పస్తులు పడుకో పెడుతుంది.. ఇది తెలుసుకుని మసలుకోండి అని ఆదిత్య పేర్కొన్నారు.

## 'త్రిబాణధారి బార్బరిక్' 29న విడుదల





స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించిన 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్య రాజ్ ప్రధాన పాత్రను పోషించగా.. వశిష్ఠ ఎన్ సింహ, సత్యం రాజేష్, ఉదయ భాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పాటలు, టీజర్ ఇలా అన్నీ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక ట్రైలర్ ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది. విజువల్స్, ఆర్ ఆర్ ఇలా అన్నీ కూడా ఆకట్టుకున్నాయి. మోహన్ శ్రీవత్స మేకింగ్, ఇన్ ఫ్యూజన్ బ్యాండ సంగీతం ఇప్పటికే అందరిలోనూ ఆసక్తి పెంచేసింది. నిర్మాత విజయ్ పాల్ రెడ్డి మొదటి ప్రాజెక్ట్ అయినా కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించారు. ఇక ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల అయిన పాటలు అయితే శ్రోతల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. మరీ ముఖ్యంగా ఈ చిత్రానికి కుశేందర్ రమేష్ రెడ్డి అందించిన విజువల్స్ అందరినీ ఆశ్చర్య పరిచేలా ఉన్నాయి. బార్బరిక్ కాన్సెప్ట్ ఇప్పటికే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే డిఫరెంట్ ప్రమోషన్స్ చేస్తూ సినిమాను జనాల్లోకి తీసుకెళ్తున్నారు.'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఆగస్ట్ 22న విడుదల కావాల్సి ఉంది. కానీ సరైన రిలీజ్ డేట్, కావాల్సినన్నీ థియేటర్లు లభించడం కోసం ఆగస్ట్ 29కి వాయిదా వేశారు. ఇక ఈ 'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఆగస్ట్ 29న ఆడియెన్స్ ముందుకు రాబోతోంది.

## 'హే భగవాన్' గ్లింప్స్ విడుదల



సుహాస్ యూనిక్ స్క్రిప్ట్‌లతో అలరిస్తున్నాడు. ప్రస్తుతం నూతన దర్శకుడు గోపి అచ్చర దర్శకత్వంలో కొత్త ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ఈ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు, ఇది వారి ప్రొడక్షన్ నంబర్ 2. రైటర్ పద్మభూషణ్ ఫేం షణ్ముక ప్రశాంత్ ఈ కథను రాశారు. సుహాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ చిత్రానికి హే భగవాన్! అనే టైటిల్ పెట్టారు. ఈ టీజర్ సస్పెన్స్, కామెడీతో అదిరిపోయింది. ఒక టీమ్ వీడియో బయటికి వస్తే ఫ్యామిలీ సీక్రెట్ బిజినెస్ బయటపడిపోతుందని నరేష్ పిఎ హెచ్చరించే సన్నివేశంతో టైటిల్ టీజర్ ప్రారంభమవుతుంది. సుహాస్ స్టైలిష్ ఎంట్రీ ఆకట్టుకుంది. సుహాస్, శివానీ నగరం మధ్య సీక్రెట్ ఫ్యామిలీ బిజినెస్ పై జరిగే ఓ ఆర్గ్యుమెంట్ హిలేరియస్‌గా వుంది. డైరెక్టర్ గోపీ అచ్చర టీజర్‌ని స్మార్ట్‌గా కట్ చేశారు. మిస్టరీ బయటపెట్టకుండా, సిట్యుయేషన్స్, క్యారెక్టర్స్‌తోనే నవ్వులు పూయించారు.

## 'అర్జున్ చక్రవర్తి' యాంథమ్ రిలీజ్



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రీలీజైన టీజర్, సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అర్జున్ చక్రవర్తి యాంథమ్ రిలీజ్ చేశారు. విఘ్నేష్ బాస్కరన్ ఈ సాంగ్‌ని కంపోజ్ చేశారు. విక్రాంత్ రుద్ర రాసిన సాహిత్యం స్ఫూర్తిదాయకంగా వున్నాయి. దీపక్ బ్లూ, బృథ్వీవ్ సత్యకుమార్, విఘ్నేష్ పాయ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్‌తో కట్టిపడేశారు. ఈ సాంగ్‌లో విజయరామరాజు ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవుతున్న విజువల్స్, వండర్ ఫుల్ లోకేషన్స్ అద్భుతంగా వున్నాయి. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు, ఈ చిత్రానికి జగదీష్ చీకాటి డీవోపీ, ప్రదీప్ నందన్ ఎడిటర్, సుమిత్ పటేల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్




'పరదా' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అనుపమ పరమేశ్వరన్

సినిమా బండి ఫేమ్ డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల 'పరదా' అనే మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ మేకర్స్ రాజ్, డికె మద్దతు ఇస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, దర్శన రాజేంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాగ్ మయూర్ ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ ట్రైలర్ పాటలు మంచి బజ్ క్రియేట్ చేశాయి. 'పరదా' ఆగస్ట్ 22న థియేటర్స్‌లో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ డైరెక్టర్ ప్రవీణ్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమా తీశారు. ఆయన ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తారు. నిర్మాతలు విజయ్ శ్రీధర్ ఎన్ని అడ్డంకులు వచ్చినా ఈ సినిమాని బలంగా నమ్మి ఎక్కడ రాజీ పడకుండా చాలా అద్భుతంగా నిర్మించారు. చిరంజీవి గారి బర్త్‌డే రోజు ఈ సినిమా థియేటర్స్‌లో రిలీజ్ అవుతుంది. దర్శనకి తెలుగు ఇండస్ట్రీకి వెల్కమ్ చెప్తున్నాను. దర్శన ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేసింది. ఒక తెలుగు అమ్మాయిలాగే డైలాగ్స్ అన్నీ నేర్చుకుంది. సంగీత ఈ సినిమాకి మరో బిగ్ పిల్లర్. అందరూ రిలేట్ చేసుకునే క్యారెక్టర్ చేశారు. ఈ సినిమాలో పనిచేసిన నటీనటులకు టెక్నీషియన్స్‌కి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిలిం పరదా. 22న మీరు కూడా అదే చెప్తారని నమ్మకం నాకుంది. మీరు సినిమా చూడండి. నచ్చితే ఫ్రెండ్స్‌కి సజెస్ట్ చేయండన్నారు. దర్శన రాజేంద్రన్ మాట్లాడుతూ పరదా చాలా స్పెషల్ ఫిలిం. 22న తప్పకుండా ఈ సినిమా చూడండి. ఒక మ్యాజిక్‌ని ఎక్స్పీరియన్స్ చేస్తారు. అనుపమ స్క్రీన్ పై గ్రేట్ మ్యాజిక్ చేస్తుంది. ఈ సినిమాల్లో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు.

## నిధి ఫుల్ బిజీ



హరి హర వీర మల్లులో హీరోయిన్‌గా నటించిన నటి నిధి అగర్వాల్, ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ సరసన రాజా సాబ్‌లో నటిస్తోంది. కెరీర్‌లో హిట్ లేకపోయినా తెలుగులో సినిమాలు మాత్రం బాగానే ఆఫర్స్ వస్తున్నాయి. నిధి అగర్వాల్ ఇప్పుడు ఓ గ్రిప్పింగ్ హారర్ థ్రిల్లర్ సినిమా కోసం సైన్ చేశారు. నిధి అగర్వాల్ లీడ్ రోల్‌లో చేస్తున్న ఈ సినిమా గురించి నిర్మాత అప్పాలరాజు ప్రకటించారు. ఈ చిత్రాన్ని జ్యోతి క్రియేషన్స్ బ్యానర్ కిందపుప్పాల అప్పల రాజు (ఎ.ఆర్.) నిర్మిస్తున్నారు, ఇది వారి ప్రొడక్షన్ నంబర్ 1. ఈ సినిమాకు నిఖిల్ కార్తీక్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. నిధి స్పెషల్ డేను సెలబ్రేట్ చేస్తూ మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఆ పోస్టర్ ద్వారా నిధికి విషెస్ చెప్తూ, రాబోయే సినిమా హారర్ థ్రిల్‌ని ముందుగానే టోన్ సెట్ చేశారు.

## రావు బహదూర్ టీజర్ విడుదల



సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్ మేకర్ వెంకటేష్ మహా కొత్త చిత్రం రావు బహదూర్‌ను సమర్పిస్తున్న సంగతి తెలిసిందే. హీరో సత్య దేవ్ ప్రధాన పాత్రలో నటించారు. కేరాఫ్ కంచరపాలెం, ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య వంటి చిత్రాలను రూపొందించిన వెంకటేష్ మహా దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. పరిశ్రమలోని అత్యంత విజయవంతమైన రెండు బ్యానర్‌లు ఎ ప్లస్ ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్న రావు బహదూర్ టైటిల్ ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సోమవారం దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి 'నాట్ ఈవెన్ ఎ టీజర్' లాంచ్ చేశారు. రావు బహదూర్ తెలుగుతో పాటు ఇతర భాషల సబ్టైటిల్స్‌తో 2026 సమ్మర్‌లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతుంది. సత్య దేవ్, వికాస్ ముప్పాల, దీపా థామస్, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ తదితరులు నటిస్తున్నారు.



'ఇండియా' ప్రభుత్వం ఏర్పడిన తరువాత

# సిఇసి, కమిషనర్లపై చర్యలు

### ఓట్ అధికార్ యాత్రలో రాహుల్‌గాంధీ హెచ్చరిక

**న్యూఢిల్లీ:** బిహార్ ఓటర్ల ప్రత్యేక సవరణకు సంబంధించి ఎన్నికల సంఘంపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విమర్శల దాడిని ముమ్మరం చేశారు. ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు 'ఓటు చోరీ'పై ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లపై చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. 'ఓట్ అధికార్ యాత్ర'లో భాగంగా రెండోరోజు సోమవారం గయాజీలో పాల్గొని ప్రసంగించారు. ఓటు దొంగతనంలో పట్టుబడిన తర్వాత కూడా ఎన్నికల కమిషన్ తనను అఫిడవిట్ దాఖలు చేయమని అడుగుతోందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో దేశం మొత్తం మిమ్మల్ని అఫిడవిట్ ఇవ్వాలని అడుగుతుందని తాను ఇసికి చెప్పాలనుకుంటున్నానన్నారు. తమకు కొంత సమయం ఇస్తే ప్రతి అసెంబ్లీ, లోక్ సభ స్థానంలో జరిపిన మీ దొంగతనాన్ని ప్రజల ముందు ఉంచుతామన్నారు. ప్రధాని (నరేంద్ర) మోదీ ప్రత్యేక ప్యాకేజీ గురించి మాట్లాడినట్లుగానే, ఇసి బిహార్ కోసం ఎస్ఐఆర్ అనే ప్రత్యేక ప్యాకేజీని తీసుకువచ్చిందని, అంటే కొత్త రకమైన ఓటు దొంగతనం అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిహార్‌కు ఎస్ఐఆర్ అనే ప్రత్యేక ప్యాకేజీని తీసుకువచ్చారని, అది ఓట్ల దొంగతనం అని అర్థం ఉద్ఘాటించారు. బిహార్ ప్రజలు ఎన్నికల కమిషనర్లు, బిజెపి నాయకులకు ఒకే గొంతులో 'ఓటు చోరీ' రాష్ట్రంలో జరగదని చెబుతారన్నారు. తాను ఏమి చెబితే అది చేస్తానని, వేదిపై నుంచి అబద్ధం చెప్పని మీ అందరికీ తెలుసునన్నారు. ఎన్నికల కమిషనర్లు బిజెపి సభ్యత్వం తీసుకొని వారి కోసం పనిచేస్తున్నారని తేజస్వి జీ అన్నారని, కానీ ఒక విషయం అర్థం చేసుకోండి, బిహార్, ఢిల్లీలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడే రోజు వస్తుందని, అప్పుడు తాము ఆ ముగ్గురిపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. వీరు మొత్తం దేశం నుండి ఓట్లు దొంగిలించారన్నారు.

రాష్ట్రానికి రావాల్సిన నిధులపై త్వరలోనే

# కేంద్రానికి నివేదిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయమై త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. సంక్షేమ శాఖకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధుల అంశంపైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖకు కేంద్ర ప్ర భుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోయినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారించిందని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే దిశగా చర్యలు చేపట్టాలని, విద్యా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

# అత్యంత భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం రాష్ట్రంలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ క్రమంలో వాతావరణ కేంద్రం రెడ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్నారు. నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. గడిచిన 24గంటల్లో జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా గౌరారంలో 23.6, మెదక్ జిల్లా అల్లాదుర్గ్‌లో 22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

# దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

ఫుటేజ్‌లు అక్కడి సిసిటివిలో పోలీసులకు లభించాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి .కూకట్‌పల్లి సంగీత్ నగర్‌లో నివసిస్తున్న దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త బైక్ మెకానిక్ కాగా భార్య ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్నారు. కుమార్తె సహస్ర(10) బోయిన్‌పల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు కుమారుడిని పాఠశాలకు పంపించి, అనంతరం వారి విధులకు హాజరయ్యారు. కుమార్తెకు పాఠశాలకు సెలవు కావడంతో ఆమె ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం 12:30గంటల సమయంలో, కుమారుడికి భోజనం తీసుకెళ్లడానికి తండ్రి ఇంటికి వచ్చాడు. ఇంటికి రాగానే, బెడ్రూరూమ్‌లో బాలిక కత్తి పోట్లతో విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి ఆయన దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే ఆయన కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించాడు. గుర్తు తెలియని దుండగులు బాలికను హతమార్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాలానగర్ డిసిపి సురేశ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ క్లూస్ టీమ్‌లతో ఆధారాలు సేకరించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగానికి వెళ్లగా బాలిక ఒక్కతే ఇంట్లో ఉన్నది చూసి ఓ యువకుడు ఆ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడినట్లు, బాలిక ప్రతిఘటించడంతో పొడిచి చంపి పారిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. యువకుడు పోతున్న దృశ్యాలు అక్కడి సిసిటివి ఫుటేజిలో రికార్డు అయ్యాయి. అయితే పోలీసులు మాత్రం బంధువులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.
ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్ క్లూస్ టీంతో దర్యాప్తు చేస్తున్నారు. సిసిటివిలో నమోదైన యువకుని గురించి పోలీసులు గాలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. అయితే ఒక్కగానొక్క కూతురు రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసిన తల్లిదండ్రుల శోకం ఆకాశాన్నంటింది.

# పుతిన్ ఫోన్‌కాల్

(మొదటి పేజీ తరువాయి)

మిత్రదేశాల నాయకులుగా మనిద్దరిమధ్యా ఈ ఆదాన ప్రదానాలు కొనసాగాలని ఆశిస్తున్నాను' అని సోషల్ మీడియా ద్వారా మోదీ చెప్పారు. యుద్ధం మొదలైనప్పటినుండి భారతదేశం శాంతి పక్షమే వహించిందన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్‌తో జరిగిన శిఖరాగ్ర చర్చలపై తన విశ్లేషణను మోదీతో పుతిన్ పంచుకున్నారని పేర్కొంది. అదేవిధంగా భారత్-రష్యామధ్య ద్వైపాక్షిక స్నేహ సంబంధాలతోపాటు అనేక అంశాలపై కూడా ఈ సందర్భంగా నాయకులు ఇద్దరూ అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకున్నారని ప్రధాని కార్యాలయ ప్రకటన పేర్కొంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత మొదటిసారి ఈ సమస్య పరిష్కారంపై రెండు అగ్రదేశాలమధ్యా శిఖరాగ్ర సమావేశం జరిగింది. అలాస్కాలో అగ్రనేతల సమావేశంపట్ల భారత విదేశాంగమంత్రిత్వశాఖ శనివారంనాడు హర్షం ప్రకటించింది. ఉక్రేన్‌లో శాంతికి నాయకులిద్దరు ఒక చొరవ చూపించి శుభారంభం చేశారని ప్రశంసించింది. గత ఏడాది జులైలో మాస్కోలో పర్యటించిన మోదీ, పుతిన్‌తో సంభాషణ సందర్భంగా, ఉక్రేన్ యుద్ధానికి పరిష్కారం యుద్ధభూమిలో సాధ్యం కాదని, చర్చల ద్వారానే ఒక పరిష్కారం లభిస్తుందని ఉద్ఘాటించారు. అదేవిధంగా వచ్చేనెలలో మోదీ ఉక్రేన్ రాజధాని కీవ్‌లో పర్యటిస్తారు. సమయం వృథా చేయకుండా రెండు దేశాలు చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని జెలెన్స్కీతో మోదీ చెప్పేందుకు సిద్ధం అవుతున్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్న భారత్ పుతిన్‌కు ధనాన్ని సమకూర్చి ఉక్రేన్‌లో యుద్ధాన్ని కొనసాగించడానికి దోహదం చేస్తోందని ట్రంప్ తీవ్ర ఆరోపణల ప్రచారం చేస్తున్న తరుణంలో మోదీ-పుతిన్ మధ్య అలాస్కా పరిణామాలపై ఫోన్ సంభాషణ ప్రముఖంగా అందరికీ దృష్టికీ వచ్చింది. దాదాపు మూడు గంటలసేపు తామిద్దరిమధ్యా ఉక్రేన్ యుద్ధ సమస్య పరిష్కారంపై చర్చ జరిగిందని మోదీకి పుతిన్ తెలియజేశారు. ఐతే ఈ చర్చలో కాల్పుల విరమణకు ఎలాంటి ఒప్పందం కుదరలేదు.

# బిజెపి ప్రతినిధిలా సిఇసి

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఐఆర్ ప్రకటించడానికి ఎందుకు తొందరపడుతున్నారని ప్రశ్నించారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా చూడటం ఇసి రాజ్యాంగబద్ధమైన విధి అని ఆయన గుర్తు చేశారు. ప్రతిపక్ష ఆరోపణలపై విచారణకు అధికారంలో ఉన్న అధికారులు అనుమతించడం లేదని పేర్కొన్నారు. అధికార పార్టీ వైపు మొగ్గుచూపే కొంతమంది అధికారుల చెప్పు చేతుల్లో ఇసి ఉందని స్పష్టంగా తెలుస్తుందని, అలాంటి అధికారులు విచారణ వ్యతిరేకమన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన ఫిర్యాదుతో అఫిడవిట్ ఇవ్వాలని ఇసి అంటోందని, 2022లో దాదాపు 18,000 మంది ఓటర్లను జాబితా నుండి తొలగించారని ఫిర్యాదులతో తమ పార్టీ ఎస్‌పి అఫిడవిట్‌లను సమర్పించిందని, కానీ ఎటువంటి చర్య తీసుకోలేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రాంగోపాల్ యాదవ్ అన్నారు. గత సార్వత్రిక ఎన్నికలు నిర్వహించిన ఓటర్ల జాబితా సరిగ్గా లేకపోతే, లోక్‌సభను రద్దు చేయాలని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నాయకురాలు మహువా మొయిత్రా అన్నారు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన జాబితా మోసపూరితమైనదా? అది నిజమైతే, ప్రస్తుత, మునుపటి ఎన్నికల కమిషనర్లపై విచారణ జరపాలి, ఈ లోక్‌సభను వెంటనే రద్దు చేయాలి' అని ఆమె అన్నారు. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నాయకుడు మనోజ్ ఝా సిఇసిపై మండిపడుతూ తాము ఆదివార సిఇసి కోసం వెతుకుతున్నప్పుడు, కొత్త బిజెపి ప్రతినిధి దొరికారని ఎద్దేవా చేశారు. శివసేన (యుబిటి)కి చెందిన అరవింద్ సావంత్ కూడా సిఇసి 'బిజెపి ప్రతినిధిలా ప్రవర్తించారు' అని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో సిఇసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ఓటర్ల జాబితాలలోని అన్ని లోపాలను తొలగించే లక్ష్యంతో ఉందని, కొన్ని పార్టీలు దాని గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, ఇసి భుజం నుండి కాల్పులు జరపడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. డబుల్ ఓటింగ్, 'ఓట్ల దొంగతనం' ఆరోపణలను 'నిరాధారమైనవి' అని సిఇసి తోసిపుచ్చింది.

### సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌పై విపక్షాల అభిశంసన తీర్మానం?

ఓట్ల చోరీ జరిగిందని కొద్దిరోజులుగా తీవ్రంగా ఆరోపిస్తున్న విపక్షాలు, ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసనకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందుకు సంబంధించి నోటీసును తీసుకువచ్చేందుకు ఇప్పుడు ప్రతిపక్ష సభ్యులు యోచన చేస్తున్నారని సమాచారం. ఆ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, రాజ్యసభ ఎంపి సయ్యద్ నసీర్ హుస్సేన్ మీడియాతో మాట్లాడారు. జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసన విషయంపై తాము త్వరలో నిర్ణయం తీసుకుటామని ఇమ్రాన్ ప్రతాప్ గఢీ తెలిపారు. అన్ని ప్రజాస్వామ్య సాధనాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నామని నసీర్ హుస్సేన్ తెలిపారు. అవసరమైతే అభిశంసన తీర్మానం తీసుకొస్తామని ఇచ్చారు. అయితే ఇప్పటివరకు అధికారిక చర్చలు జరగలేదని తెలుస్తోంది.

# యూరప్ నేతల సందడి

(మొదటి పేజీ తరువాయి)

యూరప్ నాయకులు ఓవల్ ఆఫీసులో ట్రంప్-జెలెన్స్కీ సమావేశంలో పాల్గొనేందుకు సన్నద్ధమై వాషింగ్టన్ వెళ్ళారు. ఈనెల 22న ట్రంప్, పుతిన్,జెలెన్స్కీ మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగే అవకాశాలున్నాయని ముందస్తు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో యూరప్ నాయకులతో ట్రంప్ సమావేశం కీలక ప్రాధాన్యత సంతరించుకుంది. ఉక్రేన్‌కు పూర్తి భద్రత ఉండాలని, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడంకోసం తమ దేశం పోరాటం చేస్తోందని, అందువల్ల అర్థవంతమైన పద్ధతుల్లో యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో పుతిన్ ముందుకు వస్తారని జెలెన్స్కీ ఆశాభావం వ్యక్తం చేశారు. ''ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీ సమకూర్చడానికి యూరప్‌తో ట్రంప్ కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండటం, అందుకు అంగీకరించడం ముఖ్యమైన అంశం'' అని జెలెన్స్కీ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ''మేం యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధంగా ఉన్నాం, కానీ శాంతి మాత్రం చరకాలం వర్ధిల్లాలి'' అని జెలెన్స్కీ పేర్కొన్నారు. ''రష్యాతో శాంతి ఒప్పందం కుదిరితే, ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీ ఇస్తాం అని ట్రంప్ ఒక చారిత్రక నిర్ణయం తీసుకున్నారు'' అని జెలెన్స్కీ ఎక్స్ వేదికగా చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జెలెన్స్కీ వాషింగ్టన్ వెళ్ళినప్పుడు ట్రంప్‌తో అనూహ్యమైన రీతిలో పెద్ద వివాదం జరిగింది. వాషింగ్టన్ అధ్యక్ష భవన చరిత్రలో ట్రంప్, జె.డి.వాన్స్ సమక్షంలో జెలెన్స్కీకి అవమానం జరగడంతో ఆయన మధ్యలోనే అక్కడి నుండి వెళ్ళిపోయారు. జెలెన్స్కీ వైఖరివల్లే ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగుతోందని ఆనాడు ఆయనపై ట్రంప్ విరుచుకుపడి అవమానించడం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దాదాపు ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులు వస్తాయన్న భయంతో జెలెన్స్కీకి యూరప్ నాయకులు తోడుగా వెళ్ళారు. రష్యాకు వ్యతిరేకంగా జెలెన్స్కీ ఒంటరిగా లేరని, ఒక సంఘటన ఆయన వెంట ఉందని చాటి చెప్పడం దీని వెనుకున్న మరో ఉద్దేశం.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com